www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



ఖమ్మం, నల్లగొండ మంత్రులు
సీఎంను పని చెయ్యనివ్వట్లే!
19 నెలల్లోనే రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత
42 శాతం రిజర్వేషన్ బీసీలకు కాదు.. ముస్లింలకు!
ఖమ్మంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు
కమ్యూనిస్టులు బీజేపీలో చేరాలని పిలుపు
ఎరువుల పంపిణీపై చర్చకు రావాలని మంత్రి తుమ్మలకు సవాల్
12

బుధవారం | 30-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 122 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం, తిథి: షష్ఠి రా.2:42 తదుపరి సప్తమి, నక్షత్రం: హస్త రా.9:53 తదుపరి చిత్త, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ఉ.11:55-12:47, అమృతఘడియలు: మ.3:16-5:02, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 5:57, సూర్యాస్తమయం: 6:45 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

యుద్ధం ఆపాలని
నాకు ఎవరూ చెప్పలేదు

మే 9న అమెరికా ఉపాధ్యక్షుడు మాట్లాడారు.. పాక్ భారీ దాడికి సిద్ధమవుతోందని బెదిరించారు

అంతకు అంత బదులిస్తామని.. బుల్లెట్‌కు శతఘ్నితో సమాధానం ఇస్తామని స్పష్టంగా చెప్పాను
'ఆపరేషన్ సిందూర్'తో మన సామర్థ్యం ఏమిటో ప్రపంచమంతటికీ తెలిసింది
22 నిమిషాల్లోనే ఉగ్రస్థావరాలు ధ్వంసం చేశాం
సైనిక దళాలపై నమ్మకంతో స్వేచ్ఛను ఇచ్చాం
'చాలా దెబ్బతీశారు.. ఇక చాలు' అంటూ పాకిస్థాన్ కాళ్లబేరానికి వచ్చింది
పాక్ ఎయిర్‌బేస్‌లు ఇంకా ఐసీయూలో ఉన్నాయి
ప్రపంచమంతా భారత్‌కు మద్దతుగా నిలిచింది
కాంగ్రెస్ మాత్రం పాకిస్థాన్‌కు రిమోట్‌గా మారింది
వాళ్లు రాజకీయ లబ్ధి కోసం చేసిన ఆరోపణలు సైనిక దళాల ఆత్మస్థైర్యంపై ప్రభావం చూపాయి
'ఆపరేషన్ సిందూర్'పై చర్చకు లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం
'పహల్గాం' ముష్కరులను మట్టుపెట్టాం: షా
కాంగ్రెస్ తప్పిదం వల్లే పాక్ ఏర్పడిందని విమర్శ


లోక్‌సభలో 'ఆపరేషన్ సిందూర్'పై నిర్వహించిన చర్చలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, జూలై 29: పహల్గాం ఉగ్రదాడి అంశంలో పాకిస్థాన్‌కు బుద్ధిచెప్పేందుకు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను ఆపాలని ఏ ప్రపంచ నేత కూడా భారత్‌ను అడగలేదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పార్లమెంటు వేదికగా ప్రకటించారు. తానే భారత్, పాక్ యుద్ధాన్ని ఆపానంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలను తోసిపుచ్చేలా స్పష్టత ఇచ్చారు. మూడు దేశాలు తప్ప మొత్తం ప్రపంచ దేశాలన్నీ భారత్‌కే మద్దతు పలికాయని చెప్పారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు మాత్రం.. ఎంతో పరాక్రమం చూపిన మన సైనికులకు మద్దతుగా నిలవకుండా. పాకిస్థాన్‌ను వెనకేసుకొచ్చేలా సందేహాలు వ్యక్తం చేశాయని మండిపడ్డారు. 'ఆపరేషన్ సిందూర్'పై లోక్‌సభలో జరిగిన చర్చకు ప్రధాని మోదీ సమాధానం చెప్పారు. సుమారు

మిగతా 2వ పేజీలో...

పాక్‌తో పోరాడే సంకల్పమే మీకు లేదు
బలగాల చేతులు కట్టేసి ఆపరేషన్ సిందూర్‌లోకి దించారు
1971 యుద్ధంతో పోలికా?
అమెరికా ఒత్తిడి తెచ్చినా ఇందిర డోంట్ కేర్ అన్నారు: రాహుల్ 2

పహల్గాం ఉగ్రవాదులను పట్టించిన శాటిలైట్ ఫోన్



ఆ నగరాల పరిస్థితి
హైదరాబాద్‌కు రావద్దు

ఢిల్లీ, ముంబై, చెన్నైలలో కాలుష్యంతో ఇబ్బందులు

ఆ సమస్యలు మన దగ్గర తలెత్తకుండా చూడాలి
హైదరాబాద్ నగరంలో భూగర్భ డ్రైనేజీ, కేబుల్ వ్యవస్థ
ఇందుకు సమగ్ర డీపీఆర్ తయారు చేయండి
నీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థను సంస్కరించండి
నిర్మాణ రంగ వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ పడేయొద్దు
కొత్వాల్‌గూడ జంక్షన్లో ఇండియా గేట్ వంటి నిర్మాణం
నిధులిచ్చినా మెట్రో విస్తరణ పనుల్లో జాప్యమేంటి?
పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ సమీక్షలో సీఎం

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంలో భూగర్భ డ్రైనేజీ, కేబుల్ వ్యవస్థపై దృష్టిసారించాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు ఆయా శాఖలు సమగ్ర డీపీఆర్ తయారు చేయాలని నిర్దేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని, నిర్మాణ రంగ వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో మంచినీటి సరఫరా, మురుగు నీటి వ్యవస్థను సంస్కరించాలని, ప్రజలకు నాణ్యమైన తాగునీరు, మెరుగైన సేవలను అందించాలని సూచించారు. తనకున్న వనరులను సద్వినియోగం చేసుకునే అంశంపై జల మండలి ప్రత్యేక ప్రణాళికలను తయారు చేసుకోవాలని తెలిపారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంగళవారం సీఎం సమీక్ష

మిగతా 13వ పేజీలో...

తెలంగాణలో కొత్త
మద్యం పాలసీ!
దరఖాస్తు రుసుం ప్రస్తుతం ఉన్న 2 లక్షల నుంచి 3 లక్షలకు పెంపు
గడువును.. రెండేళ్ల నుంచి మూడేళ్లకు పెంచే చాన్స్!
'స్థానిక' ఎన్నికల కంటే ముందే దుకాణాల కేటాయింపు 12


ఢిల్లీలో 'బీసీ' ధర్నా వాయిదా!
11న నిర్వహించాలని నిర్ణయం?
పార్లమెంటులో దేశ భద్రతపై చర్చ నడుస్తుండడమే కారణం!
ధర్నా తర్వాత మూడు రోజులు ఢిల్లీలోనే సీఎం, మంత్రులు! 13
బీసీ బిల్లులపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీని కలిసే యత్నం
రాహుల్ సహకారంతో విపక్షాలను కూడగట్టాలని యోచన

ముద్ర కో ఆపరేటివ్ పేరిట
రూ.140 కోట్ల వసూళ్లు
330 శాఖలు, 1600 మంది ఉద్యోగులు, వేలల్లో బాధితులు
సేకరించిన డబ్బుతో ఏపీలోని అమరావతిలో పెట్టుబడులు
ముద్ర కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ తిప్పినేని రామదాసప్ప నాయుడు, అతని కుమారుడు సాయికిరణ్ అరెస్టు
అమరావతిలో అదుపులోకి తీసుకున్న తెలంగాణ సీఐడీ



హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ముద్ర అగ్రికల్చరల్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ మల్టీలెవల్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ తిప్పినేని రామదాసప్ప నాయుడు, ఆయన కుమారుడు, సొసైటీ డైరెక్టర్ సాయి కిరణ్‌ను తెలంగాణ సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. చాలాకాలంగా పరారీలో ఉన్న రామదాసప్ప నాయుడు, సాయి కిరణ్‌ను ఏపీ రాజధాని అమరావతిలో మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ ముద్ర పథకం పేరును అనుకరిస్తూ ముద్ర సొసైటీ పేరుతో రామదాసప్ప.. అధిక వడ్డీలు ఆశచూపి ఏజెంట్ల ద్వారా రైతులు, కూలీలు, మహిళల నుంచి రూ.140 కోట్ల నిధులు సేకరించాడు. సీఐడీ అదనపు

మిగతా 13వ పేజీలో...



సాగర్ గేట్లు తెరిచేందుకు స్విచ్ ఆన్ చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్; గేట్లనుంచి వస్తున్న జల ప్రవాహం

దిగువకు కృష్ణమ్మ పరవళ్లు

తెరుచుకున్న సాగర్ గేట్లు, నీటి విడుదల
స్విచ్ ఆన్ చేసిన మంత్రులు ఉత్తమ్, లక్ష్మణ్‌కుమార్
జూలైలో గేట్లెత్తడం 18 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి
రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల్లో పూడిక తొలగిస్తాం: ఉత్తమ్
సాగర్ గేట్లు ఎత్తే కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి డుమ్మా
గేమ్‌ఛేంజర్‌గా సన్నబియ్యం, రేషన్‌కార్డుల పంపిణీ
ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రేషన్ కార్డుల పంపిణీలో ఉత్తమ్

నాగార్జునసాగర్/యాదాద్రి/హుజూర్‌నగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ జలాశయం నుంచి దిగువకు కృష్ణమ్మ పరవళ్లు మొదలయ్యాయి. ఎగువ నుంచి భారీగా వరద వస్తుండడం, గరిష్ఠ నీటిమట్టానికి చేరువలో ఉండడంతో ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. మంగళవారం ఉదయం 11:28 గంటలకు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లు ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యేలు జైవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డిలతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి ఉత్తమ్ తొలుత 13వ నంబరు గేటును ఎత్తేందుకు స్విచ్ ఆన్ చేశారు. అనంతరం మరికొన్ని గేట్లను ఎత్తి దిగువకు నీటిని

మిగతా 14వ పేజీలో...



భూ వివాదం కేసు..
సీఎం రేవంత్‌కు సుప్రీంలో ఊరట
విచారణను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలన్న పిటిషన్‌ను కొట్టేసిన సీజేఐ ధర్మాసనం
హైకోర్టు జడ్జిపై పిటిషనర్ పెద్దిరాజు వ్యాఖ్యల మీద ఫైర్
న్యాయవాది క్షమాపణనూ పరిగణనలోకి తీసుకోవడానికి నిరాకరణ
పిటిషనర్ సహా లాయర్లకు కోర్టు ధిక్కరణ నోటీసులు

న్యూఢిల్లీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): భూవివాదం కేసులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఈ కేసు విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలన్న పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం డిస్మిస్ చేసింది. హైకోర్టు న్యాయమూర్తి మీద పిటిషనర్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడంపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. పిటిషనర్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు

మిగతా 13వ పేజీలో...




ఇండియన్ స్పెర్మ్‌టెక్
సెంటర్ సీజ్
పోలీసుల సమక్షంలో అధికారుల తనిఖీలు, తాళం
ఎనిమిది మంది అరెస్టు
హైదరాబాద్‌లో ఘటన 14

పిల్లల్లేని దంపతులకు సోషల్ మీడియాతో ఎర
ఉచిత పరీక్షల పేరిట మాయ
సృష్టి ఫర్టిలిటీ వ్యవహారంపై దర్యాప్తులో కొత్త అంశాలు 14

డిజైన్ ఖరారవ్వగానే
రేషన్ కార్డుల పంపిణీ

అప్పటి వరకు మంజూరు పత్రాల జారీ
వాటి ద్వారా రేషన్ పంపిణీ.. సంక్షేమ పథకాల్లో లబ్ధి
5,61,343 కొత్త రేషన్ కార్డులకు ఆమోదం
రాష్ట్రంలో మొత్తం లబ్ధిదారుల సంఖ్య 3.09 కోట్లు


లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న రేషన్ కార్డు మంజూరు పత్రం

హైదరాబాద్, జులై 29 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డుల మంజూరు, పాత కార్డుల్లో సభ్యుల నమోదు ప్రక్రియ నిరాటంకంగా కొనసాగుతోంది. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 5,61,343 కుటుంబాలకు ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను మంజూరుచేయగా.. ఇందుకు సంబంధించిన ధ్రువపత్రాలను అధికారులు పంపిణీ చేస్తున్నారు. ఈ నెల 25 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం ఆగస్టు 10 వరకు కొనసాగనుంది. కొత్త కార్డులకు సంబంధించిన డిజైన్లు ఇంకా ఖరారు కాకపోవడం, టెండర్ల అంశం కోర్టులో ఉండడంతో ప్రస్తుతానికి కార్డుల స్థానంలో.. మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వాటి ద్వారానే రేషన్‌ను అందజేస్తామని, సంక్షేమపథకాలకు కూడా మంజూరు పత్రాలను పరిగణనలోకి తీసుకుంటామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 1న రేషన్‌కార్డుల ప్రక్రియను ప్రారంభించే నాటికి రాష్ట్రంలో 89,95,282 కార్డులున్నాయి. వీటిపై 2,81,47,565 మంది లబ్ధిదారులున్నారు. తాజాగా ప్రభుత్వం 5.61 లక్షల కొత్తకార్డులను ఆమోదించింది. ఉన్న కార్డుల్లో అదనపు సభ్యుల చేరికలు కలిపి.. రాష్ట్రంలో మొత్తం కార్డుల సంఖ్య 95.56 లక్షల పెరగ్గా.. లబ్ధిదారుల సంఖ్య 3.09 కోట్లకు చేరుకుంది. కొత్తకార్డుదారులకు

మిగతా 13వ పేజీలో...

పరదా కాపురాల పాట్లు!
దుబాయిలో ఇరుకు గదుల్లో పలువురు తెలుగు ప్రవాసీలు
మంచం పట్టేంత స్థలంలో కాపురం.. ఒక గదిలో 4 జంటలు
బ్యాచిలర్లైతే 10 మంది.. అక్రమంగా అద్దెకు ఇస్తున్న ఓనర్లు
అధికారుల ఉక్కుపాదం.. ఇతర ప్రాంతాలకు ప్రవాసీలు
భారీగా అద్దెలు, పెరిగిన దూరాభారం
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

బతుకుదెరువు కోసం దుబాయికి వచ్చే వారు ఎదుర్కొనే సమస్యల్లో ఇల్లు సమస్య కీలకం. ఇళ్ల యజమానులు తమ ఇళ్లను అనేక భాగాలుగా విభజించి అద్దెకు ఇస్తుంటారు. అవి ఎంతచిన్నగా ఉంటాయంటే, ఒక గది అంటే ఒక మంచం పట్టేంత స్థలం మాత్రమే. ఆ మంచం చుట్టే ప్లైవుడ్ లేదా పరదాలు కట్టుకొని కాపురాలు చేసే దుస్థితి. ఇప్పుడు పలువురికి ఈ అవకాశం కూడా లేకుండా పోతోంది. ఈ తరహా నివాసాలపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. తనిఖీలు చేస్తూ యజమానులకు జరిమానాలు విధిస్తున్నారు. దీంతో, ఇంతకాలం చవకగా



మిగతా 3వ పేజీలో...

బనకచర్లపై
సుప్రీంకు బీఆర్ఎస్!
కేసీఆర్‌తో కేటీఆర్, హరీశ్‌రావు భేటీ
ఫామ్‌హౌస్‌లో ఉదయం నుంచి రాత్రి దాకా సుదీర్ఘ మంతనాలు 12
స్థానిక ఎన్నికలు, సీఎం రమేశ్ వ్యాఖ్యలు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అంశాలపై చర్చ
మోదీ, బాబు ప్రయోజనాలకే సీఎం తహతహ
బనకచర్లను అడ్డుకోవాల్సిందే: కేసీఆర్



పీ అండ్ జీ పగ్గాలు
భారతీయుడి చేతికి 11
కొత్త సీఈవోగా శైలేష్ జెజూరికర్
శైలేష్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ పూర్వ విద్యార్థి, సత్య నాదెళ్ల క్లాస్‌మేట్

భారత్-పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్..
నా అంతరాత్మ ఒప్పుకోదు: ఒవైసీ

రక్తం-నీరు కలిసి ప్రవహించని చోట మ్యాచ్ ఎందుకని వ్యాఖ్య



న్యూఢిల్లీ, జూలై 29: ఆసియా కప్-2025లో భారత్-పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్‌ని మజ్లిస్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వ్యతిరేకించారు. షెడ్యూల్ ప్రకారం ఈ మ్యాచ్ సెప్టెంబరు 14న జరగాల్సి ఉండగా.. ప్రతిపక్షాలు కూడా దీన్ని వ్యతిరేకిస్తున్నాయి. 'ఆపరేషన్ సిందూర్'పై ప్రత్యేక చర్చ సందర్భంగా లోక్‌సభలో మాట్లాడిన ఒవైసీ.. భారత్-పాక్ మ్యాచ్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "రక్తం-నీళ్లు కలిసి ప్రవహించలేవు అని మనం ప్రకటించాం. అలాంటప్పుడు పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్ ఆడుతారా? పాక్ విమానాలు మన గగనతలంలోకి రావు. వారి పడవలు మన ప్రాదేశిక జలాల్లోకి రావు. పాక్‌తో వాణిజ్య సంబంధాలను పూర్తిగా నిలిపివేశాం. అలాంటి దేశంతో క్రికెట్ మ్యాచ్ ఎలా ఆడతాం?" అని ఆయన నిలదీశారు. ఒకవేళ ఈ మ్యాచ్ జరిగినా.. దాన్ని వీక్షించడానికి తన అంతరాత్మ అంగీకరించదన్నారు.

'భారత్ వైపే' మాట్లాడతా!

కాంగ్రెస్ నేత మనీశ్ తివారీ నర్మగర్భ వ్యాఖ్య



న్యూఢిల్లీ, జూలై 29: 'ఆపరేషన్ సిందూర్'పై పార్లమెంటులో చర్చ జరుగుతున్న నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీలో వివాదాలు రాజుకున్నాయి. ఈ చర్చలో కీలక నేతలు శశిథరూర్, మనీశ్ తివారీలు పాల్గొనకుండా పార్టీ పక్కన పెట్టింది. ఈ వ్యవహారంపై శశిథరూర్ మౌనంగా ఉండగా.. మనీశ్ మాత్రం సోషల్ మీడియాలో నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. "నేను భారత్‌వైపే మాట్లాడతా." అని పేర్కొన్నారు. పాత హిందీ సినిమా 'పూరబ్ ఔర్ పశ్చిమ్'లోని ఓ పాటలో చరణాన్ని ఆయన పోస్టు చేశారు. ఒక భారతీయుడిగా తాను భారత వైభవాన్నే కోరుకుంటానని దానర్థం. 'ఆపరేషన్ సిందూర్'పై ప్రపంచ దేశాలకు వివరించేందుకు కేంద్రం పంపిన ప్రతినిధుల బృందంలో శశిథరూర్, మనీశ్ తివారీలు ఉన్నారు. ఈ పోస్టుపై మీడియా ప్రశ్నించగా.. "నా మౌనాన్ని మీరు అర్థం చేసుకోకపోతే.. నా మాటలను మీరు ఎప్పటికీ అర్థం చేసుకోలేరు." అని వ్యాఖ్యానించారు.

మోదీది పెద్ద మనసు: సుప్రియా సూలే



న్యూఢిల్లీ, జూలై 29 : నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) శరదపవార్ వర్గం నేత, బారామతి ఎంపీ సుప్రియా సూలే లోక్‌సభ వేదికగా ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపించారు. ఆపరేషన్ సిందూర్ చేపట్టేందుకు దారితీసిన పరిస్థితులను ప్రపంచానికి చెప్పే విషయంలో ప్రతిపక్షాలపై నమ్మకం ఉంచిన ప్రధాని మోదీది పెద్ద మనసు అని కొనియాడారు. ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో సోమవారం జరిగిన చర్చలో భాగంగా సుప్రియా సూలే ఈ వ్యాఖ్యలు చేశారు.

యుద్ధం ఆపాలని
నాకు ఎవరూ చెప్పలేదు



ఆపరేషన్ సిందూర్‌పై చర్చ సందర్భంగా మంగళవారం లోక్‌సభలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

(మొదటి పేజీ తరువాయి)

రెండు గంటల పాటు ప్రసంగించారు. ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా నిర్వహించామని చెప్పడంతోపాటు కాంగ్రెస్‌పై విమర్శల తూటాలు ఎక్కుపెట్టారు. చివరగా పాకిస్థాన్‌కూ హెచ్చరికలు జారీ చేశారు.

బుల్లెట్‌కు శతఘ్నితో సమాధానం

ఆపరేషన్ సిందూర్ సమయంలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తనతో మాట్లాడారని ప్రధాని మోదీ వెల్లడించారు. "మే 9న రాత్రి నాతో మాట్లాడేందుకు జేడీ వాన్స్ మూడు, నాలుగు సార్లు కాల్ చేశారు. సైనికాధికారులతో సమావేశాలతో బిజీగా ఉన్నాను. చివరికి కాల్ మాట్లాడాను. పాకిస్థాన్ భారీ దాడి చేయబోతోందని జేడీ వాన్స్ నన్ను హెచ్చరించారు. పాకిస్థాన్ దాడి చేస్తే భారత్ అంతకు మించి బదులిస్తుందని.. వారు బుల్లెట్లు వాడితే మేం శతఘ్నులతో బదులిస్తామని ఆయనకు స్పష్టం చేశాను. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను ఆపాలని ప్రపంచంలో ఏ దేశానికి చెందిన ఏ నేత కూడా భారత్‌ను అడగలేదు. ఐక్యరాజ్యసమితిలో కేవలం మూడు దేశాలు మాత్రమే పాకిస్థాన్‌కు అనుకూలంగా మాట్లాడాయి. మిగతా అన్ని ప్రపంచ దేశాల నుంచి భారత్‌కే మద్దతు లభించింది. కానీ దురదృష్టవశాత్తు కాంగ్రెస్ మన దేశ సైనికులకు మద్దతుగా నిలవలేదు. రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ నేతలు నన్ను లక్ష్యంగా చేసుకుని గుప్పించిన అవివేకమైన ఆరోపణలు.. సైన్యం నైతిక విశ్వాసాన్ని దెబ్బతీసేలా ఉన్నాయి" అని మోదీ మండిపడ్డారు.

మన సామర్థ్యమేమిటో ప్రపంచానికి తెలిసింది

ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్ ఆయుధాలు, రక్షణ వ్యవస్థల్లో డొల్లతనం ఏమిటో, భారత్ దేశీయంగా అభివృద్ధి చేసిన డ్రోన్లు, క్షిపణుల ప్రతాపం ఏమిటో ప్రపంచానికి తెలిసిందని ప్రధాని మోదీ చెప్పారు. "పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా కేవలం 22 నిమిషాల్లో పాకిస్థాన్ భూభాగంలో లోపలి ప్రాంతాల్లో ఉన్న ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశాం. మరునాడు భారత్‌పై దాడికి పాల్పడితే.. పాకిస్థాన్‌పై క్షిపణుల వర్షం కురిపించాం. భారత్ దాడులతో పాకిస్థాన్‌లోని ఎయిర్‌బేస్‌లు ఎంతగా దెబ్బతిన్నాయంటే.. ఇంకా ఐసీయూలోనే ఉన్నాయి. పాకిస్థాన్‌కు పరిస్థితి ఏమిటో అర్థమైపోయి.. అణ్వస్త్ర దాడులంటూ బెదిరింపులకు దిగింది. కానీ ఏ తొందరపాటు నిర్ణయం తీసుకున్నా.. ఆపరేషన్ సిందూర్ మొదలు సింధు నది (సింధు జలాల ఒప్పందం) వరకు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని పాకిస్థాన్‌కు తెలుసు. ఎలాంటి దాడి చేసినా మరింత భారీ స్థాయిలో ప్రతిదాడి ఉంటుందని అర్థమైంది. అందుకే ఏమీ చేయలేకుండా ఉండిపోయింది" అని మోదీ చెప్పారు. 'చాలా దెబ్బ తీశారు. ఇక చాలు (బహుత్ మారా. బస్ కరో)' అంటూ పాకిస్థాన్ డీజీఎంఓ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్) కాళ్లబేరానికి వచ్చారని పేర్కొన్నారు. 'ఒకవేళ మీరు ఏమైనా చేయదలిస్తే.. ఫలితం చాలా దారుణంగా ఉంటుంది' అని హెచ్చరించామని తెలిపారు. దేశంలో ఇంతకుముందూ ఉగ్రదాడులు జరిగాయని, ఏం చేసినా తమకేమీ కాదని వాటి సూత్రధారులు ధైర్యంగా ఉండేవారని.. కానీ ఇప్పుడు భారత్ వెంటాడుతుందని వారికి అర్థమైందని చెప్పారు.

పాకిస్థాన్ ప్రతినిధుల్లా కాంగ్రెస్, మిత్రపక్షాలు

కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు దురదృష్టవశాత్తూ పాకిస్థానీ తప్పుడు ప్రచారానికి ప్రతినిధులుగా మారిపోయాయని ప్రధాని మోదీ మండిపడ్డారు. భారత్ అన్ని అంశాల్లో స్వయం సమృద్ధి సాధిస్తే.. కాంగ్రెస్ మాత్రం పాకిస్థాన్ మీదే ఆధారపడిందని విమర్శించారు. పహల్గాం ఉగ్రదాడిపై పాకిస్థాన్ పాడిన పాటే కాంగ్రెస్ పాడుతుండటాన్ని, పాకిస్థాన్‌కు రిమోట్ కంట్రోల్‌లా మారిపోవడాన్ని చూసి దేశమంతా విస్తుపోయిందని వ్యాఖ్యానించారు. దేశంలో ఉగ్రవాదం పెచ్చరిల్లుతున్న సమయంలో కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చూసీచూడనట్టు వదిలేసిందని.. ఉగ్రవాద నిరోధక చట్టాలను నిర్వీర్యం చేసిందని మోదీ ఆరోపించారు. గాంధీ కుటుంబం ఒత్తిడితో పాకిస్థాన్‌కు అనుకూలంగా మాట్లాడవద్దని కాంగ్రెస్ నేతలకు విజ్ఞప్తి చేశారు. ఇక కాంగ్రెస్ ఎంపీలు శశిథరూర్, మనీశ్ తివారీలను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. ఆపరేషన్ సిందూర్‌పై ప్రపంచ దేశాలకు ప్రజెంటేషన్ ఇవ్వడానికి వెళ్లిన బృందాల్లోని కొందరు నేతలు పార్లమెంటులో మాట్లాడకుండా కాంగ్రెస్ నిలువరించిందని విమర్శించారు.

మీకు అద్దాన్ని చూపేందుకే ఇలా నిలబడ్డా..

పహల్గాం ఘటన మన దేశంలో అల్లర్లు రేపేందుకు జరిగిన కుట్ర అని, దాన్ని మన దేశ ఐక్యత విఫలం చేసిందని మోదీ చెప్పారు. ఉగ్రవాదుల ప్రధాన స్థావరాలను విజయవంతంగా ధ్వంసం చేశామని, అందుకే ఈ పార్లమెంటు సమావేశాలను విజయోత్సవాలని చెబుతున్నానని తెలిపారు. "నేను భారత్ తరఫున నిలబడి ఉన్నాను. దీన్ని అర్థం చేసుకోలేని వారికి వారి ముఖం చూసుకునేలా అద్దాన్ని చూపడానికి నిలబడ్డాను. ఉగ్రవాదులకు, వారిని ప్రోత్సహిస్తున్నవారికి ఊహించలేని రీతిలో బుద్ధిచెబుతామని నేను ముందే చెప్పాను. మన సైనికదళాల సామర్థ్యంపై పూర్తి నమ్మకం పెట్టుకున్నాం. దీటుగా స్పందించేలా స్వేచ్ఛను ఇచ్చాం. మనవాళ్లు ఇచ్చిన సమాధానం చూసి.. ఉగ్రవాదులు, వారి వెనుకున్నవారు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు.." అని ప్రధాని పేర్కొన్నారు.

ఉగ్రవాదుల అంతం కోసం తేదీలు చూడాలా?

పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదులను పార్లమెంటు సమావేశాల సమయంలోనే హతం చేయడం ఏమిటంటూ కాంగ్రెస్, ఇతర పక్షాలు చేసిన వ్యాఖ్యలపై ప్రధాని మోదీ మండిపడ్డారు. "అసలు వాళ్లకు ఏమైంది? బాగా నిరాశ చెందినట్టున్నారు. పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదులు ఏమయ్యారని వారే అడిగారు. మోదీ ఓడిపోయాడంటూ సంబరాలు చేసుకున్నారు. ఇప్పుడు మేం ఉగ్రవాదులను హతం చేస్తే ఏడుస్తున్నారు. ఉగ్రవాదులను అంతం చేయడానికి తేదీలు చూడాలా? ఈ తీరును చూసి దేశమంతా నవ్వుతోంది" అని పేర్కొన్నారు. ఆక్రమిత కశ్మీర్‌ను వెనక్కి తీసుకురావడం లేదేమని కాంగ్రెస్ ప్రశ్నిస్తోందని.. అసలు దేశ విభజనకు అంగీకరించినదెవరని, కశ్మీర్‌ను ఆక్రమించుకునే అవకాశం ఎవరిచ్చారని మోదీ ప్రశ్నించారు. పాక్‌తో సింధూ నది ఒప్పందం ఎవరు చేసుకున్నారని నిలదీశారు. నది మనది, నీళ్లు పాకిస్థాన్‌కు అనేలా చేశారని, నాటి తప్పులకు ఇప్పటికీ శిక్ష అనుభవిస్తున్నామని వ్యాఖ్యానించారు. ఇప్పుడు సింధు ఒప్పందం నిలిపివేత వంటి చర్యలతో వాటిని సరిదిద్దుతున్నామని పేర్కొన్నారు.

లోకం తీరు



పాక్ దాడిలో అనాథలైన 22మంది చిన్నారులను దత్తత తీసుకోనున్న రాహుల్

న్యూఢిల్లీ, జూలై 29: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ తన ఉదారతను చాటుకున్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ కాల్పులతో అనాథలైన చిన్నారుల బాధ్యతను తీసుకునేందుకు ముందుకొచ్చారు. తల్లిదండ్రులు, కుటుంబాలను కోల్పోయిన పూంచ్ జిల్లాకు చెందిన 22 మంది చిన్నారులను రాహుల్ దత్తత తీసుకోనున్నట్లు జమ్మూకశ్మీర్ కాంగ్రెస్ చీఫ్ తరీఖ్ అహ్మద్ వెల్లడించారు. ఆ చిన్నారుల గ్రాడ్యుయేషన్ పూర్తయ్యేవరకు వారి విద్య, వైద్యం, ఇతర ఖర్చులన్నీ రాహుల్ చూసుకోనున్నట్లు చెప్పారు. త్వరలోనే వీరికి తొలి విడత సాయం అందజేస్తామని తెలిపారు.

ఇజ్రాయెల్‌పై మోదీ మౌనం వంచనే: సోనియా

న్యూఢిల్లీ, జూలై 29: గాజాపై ఇజ్రాయెల్ దాడులు మానవత్వాన్ని మంటగలుపుతున్నా మోదీ ప్రభుత్వం మౌన ప్రేక్షకురాలిగా ఉండటం గర్హనీయమని సోనియాగాంధీ అన్నారు. ఇది రాజ్యాంగ విలువల పట్ల వంచనాత్మక విద్రోహమని ఆమె దుయ్యబట్టారు. మోదీ లజ్జాపూరిత మౌనం, తారస్థాయికి చేరిన నైతిక వంచన తీవ్ర నిరాశకు గురిచేస్తున్నాయని 'దైనిక్ జాగరణ్' అనే హిందీ పత్రికకు రాసిన వ్యాసంలో సోనియా పేర్కొన్నారు. అమాయక ఇజ్రాయెలీలపై హమాస్ జరిపిన అనాగరిక దాడులను సమర్థించాల్సి అవసరం లేదన్నారు. కానీ, ఆ దాడులకు ప్రతిస్పందనగా గాజాపై ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులను కేవలం విపరీత చేష్టలుగా చూడలేమని, అది కచ్చితంగా హంతక నేరమేనని సోనియా స్పష్టం చేశారు. బలహీనుల పక్షం వహించి వారి హక్కుల కోసం గట్టిగా మాట్లాడిన ఉజ్వల చరిత్ర భారత్‌కు ఉన్నదని, ఆ వారసత్వాన్ని కొనసాగించాలని మోదీకి సోనియా సూచించారు.

పాక్‌తో పోరాడే సంకల్పమే లేదు



బలగాల చేతులు కట్టేసి ఆపరేషన్ సిందూర్‌లోకి దించారు


» అందుకే కొన్ని విమానాలను మనం కోల్పోవాల్సి వచ్చింది: రాహుల్

న్యూఢిల్లీ, జూలై 29: పెహల్గాం ఉగ్రదాడి ఘటనకు ప్రతీకారంగా పాక్‌కు గట్టిగా బుద్ధి చెప్పేందుకు మనదేశం ఆపరేషన్ సిందూర్ చేపట్టిన తీరును కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా ఆక్షేపించారు. పాకిస్థాన్‌తో పోరాటం చేసేందుకు ప్రభుత్వానికి రాజకీయ సంకల్ప బలమే లేకుండాపోయిందని విమర్శించారు. సాయుధ బలగాల చేతులను కట్టేసి, పాక్‌పై దాడికి దిగాలని ఆదేశించారని దుయ్యబట్టారు. భారత్-పాక్ మధ్య సంఘర్షణను నివారించానంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదే పదే ప్రకటిస్తున్నప్పటికీ ఆయన చెబుతోంది అబద్ధం అని ప్రధాని మోదీ ఎందుకు చెప్పలేకపోతున్నారు? అని రాహుల్ ప్రశ్నించారు. మంగళవారం లోక్‌సభలో ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడారు. పెహల్గాం ఘటనలో మృతులకు ఆయన సంతాపం ప్రకటించారు. దాడికి ప్రతీకారంగా బలగాలు, ప్రభుత్వం తీసుకోబోయే చర్యలపై ఇండీ కూటమి ఒక్కతాటిపై నిలిచి మద్దతు పలికిందని గుర్తు చేశారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆపరేషన్ సిందూర్‌ను, 1971 నాటి యుద్ధంతో పోల్చడాన్ని రాహుల్ గాంధీ తప్పుబట్టారు. 1971లో జరిగిన యుద్ధంలో రాజకీయ సంకల్పం ఉందన్నారు. మనదేశంపై అమెరికా ఒత్తిడి చేసినా, తన నౌకాదళాన్ని హిందూ మహాసముద్రంలో మోహరించినా నాటి ప్రధాని ఇందిరా గాంధీ వెనక్కు తగ్గలేదన్నారు. అమెరికా.. విమాన వాహక నౌకతో వస్తున్నా ఇందిర డోంట్ కేర్ అన్నారని.. 'బంగ్లాదేశ్‌లో మేం ఏం చేయాలనుకున్నామో అది చేసితీరుతాం' అని అమెరికాకు ఆమె స్పష్టం చేశారని చెప్పారు. ఆమె ఆలోచనలో గందరగోళం లేదని.. దీన్నే 'రాజకీయ సంకల్ప బలం' అంటారని రాహుల్ నొక్కి చెప్పారు. పాక్‌తో యుద్ధం చేసేందుకు రాజకీయ సంకల్ప బలం లేదన్న విషయాన్ని ఒకరకంగా రక్షణమంత్రి రాజ్‌నాథే పాక్‌కు చెప్పారని రాహుల్ ఆరోపించారు. అర్ధరాత్రి 1:35 గంటలకు పాక్‌కు ఫోన్ చేసి.. సైనికేతర లక్ష్యాలపైనే దాడి చేశామని.. ఉద్రిక్తతలను పెంచడం తమ లక్ష్యం కాదని చెప్పినట్లుగా స్వయంగా రాజ్‌నాథే వెల్లడించడం దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. మిలటరీ లక్ష్యాలను టార్గెట్ చేసుకోరంటే.. దానర్థం, పోరాటానికి రాజకీయ సంకల్పం లేనట్లేనన్నారు. ఇది.. 'మేం మీకు లెంపకాయ వేశాం. మరిన్ని లెంపకాయలు వేయబోం' అన్నట్లుగానే ఉందన్నారు. పాక్ మిలటరీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వాయుసేన స్థావరాలపై దాడి చేయకూడదనే నిర్దేశించడంతోనే భారత్ కొన్ని ఎయిర్‌క్రాఫ్టులను కోల్పోవాల్సి వచ్చిందని ఇండోనేషియాలోని భారత రక్షణ అధికారి కెప్టెన్ శివ కుమార్ చెప్పారని రాహుల్ పేర్కొంటూ.. ఇది బలగాల చేతులు కట్టేయడం కాకపోతే మరేమిటి? అని ప్రశ్నించారు. కాగా పెహల్గాం ఘటనలో భద్రతా వైఫల్యానికి హోం మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే అన్నారు.

అమిత్ షా.. సమాధానం చెప్పండి: ప్రియాంక

శత్రుదేశమైన పాకిస్థాన్‌కు దారులన్నీ మూసుకుపోయి.. దిక్కుతోచని పరిస్థితిలో పడ్డప్పుడు మనదేశం అకస్మాత్తుగా యుద్ధాన్ని ఎందుకు ఆపాల్సి వచ్చింది? అని మోదీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ప్రియాంకా గాంధీ ప్రశ్నించారు. అర్ధాంతరంగా యుద్ధాన్ని ఆపడం దేశచరిత్రలోనే మొదటిసారి అని.. పైగా పాక్‌తో మనదేశం యుద్ధాన్ని ఆపుతున్నట్లుగా అమెరికా అధ్యక్షుడు ప్రకటన చేశారని ఆమె గుర్తుచేస్తూ.. ఇది ప్రధాని మోదీ బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోందని విమర్శించారు. నాయకత్వం అంటే క్రెడిట్ తీసుకోవడం మాత్రమే కాదని, బాధ్యత తీసుకోవడం కూడా అని మోదీని ఉద్దేశించి విమర్శలు గుప్పించారు. పహల్గాం ఉగ్రదాడి ఘటన కేంద్ర ప్రభుత్వం, ఇంటెలిజెన్స్ అదిపెద్ద వైఫల్యం అని దునుమాడారు. ఘటనకు ఎవరు బాధ్యత వహిస్తారు? హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేశారా? బాధ్యత తీసుకుంటున్నట్లుగానైనా ప్రకటించారా? అని ప్రశ్నించారు. ఆపరేషన్ సింధూర్‌తో కాళ్లబేరానికి రావడం మినహా పాక్‌కు మరో అవకాశం లేకపోయిందని షా చెబుతున్నారని.. అయితే శత్రుదేశానికి ఆ అవకాశం ఎందుకిచ్చారు? అని ఆమె నిలదీశారు.

'పహల్గాం' ముష్కరులను మట్టుపెట్టాం



ఆపరేషన్ మహాదేవ్‌లో సులేమాన్, అఫ్గానీ, జిబ్రాన్ హతమయ్యారు

» ఈ ముగ్గురూ ఉగ్రదాడిలో పాల్గొన్నారు
» అందుకు పక్కా ఆధారాలు ఉన్నాయి
» లోక్‌సభలో కేంద్ర హోం మంత్రి షా

న్యూఢిల్లీ, జూలై 29: పహల్గాం మారణకాండలో పాల్గొన్న ముగ్గురు ఉగ్రవాదులను మన భద్రతా బలగాలు హతమార్చాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. ఆర్మీ, సీఆర్పీఎఫ్, జమ్మూకశ్మీరు పోలీసులు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్ మహాదేవ్‌లో ఉగ్రవాదులను కాల్చి చంపినట్లు వెల్లడించారు. పహల్గాం దాడిలో పాల్గొన్నది వీరేనని పక్కా ఆధారాలతో గుర్తించినట్లు అమిత్ షా తెలిపారు. మంగళవారం లోక్‌సభలో ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన ప్రత్యేక చర్చలో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ మహాదేవ్‌లో మరణించిన ఉగ్రవాదులను సులేమాన్ అలియాస్ ఫైజల్, అఫ్గానీ, జిబ్రాన్‌గా గుర్తించినట్లు చెప్పారు. సులేమాన్, అఫ్గానీలు లష్కరే తాయిబాలో ఏ క్యాటగిరీ కమాండర్లని, జిబ్రాన్ కూడా కరడుగట్టిన ఉగ్రవాది అని తెలిపారు. పహల్గాం దాడికి ముందు వీరికి ఆశ్రయం కల్పించి, భోజనం పెట్టిన వారిని భద్రతాదళాలు అదపులోకి తీసుకున్నాయని.. ప్రస్తుతం వారే ఈ ముగ్గురు ఉగ్రవాదులను గుర్తించారని వివరించారు. ఉగ్రవాదుల నుంచి స్వాధీనం చేసుకున్న రెండు ఏకే-47 రైఫిళ్లు, ఒక ఎం-9ను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపగా.. పహల్గాం దాడిలో వాడిన బుల్లెట్లు ఈ తుపాకుల నుంచి వచ్చినవేనని ఆరుగురు నిపుణులు తనకు వీడియో కాల్ చేసి చెప్పారని షా వెల్లడించారు. మరణించిన ఇద్దరు ఉగ్రవాదుల నుంచి రెండు పాకిస్థాన్ ఓటరు ఐడీ కార్డులతో పాటు పాక్‌లో తయారైన చాక్లెట్లు, ఆయుధాలను కూడా మన బలగాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పాకిస్థాన్ ఉగ్రవాదులను జమ్మూకశ్మీరులోకి పంపుతోందని, కశ్మీరులో స్థానిక ఉగ్రవాదులు ఎవరూ లేరని షా స్పష్టం చేశారు. ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చిన వార్త విని అధికార, ప్రతిపక్ష సభ్యులందరూ ఎంతో సంతోషిస్తారని భావించానని.. విపక్ష సభ్యుల ముఖాలు మాత్రం దిగాలుగా ఉన్నాయని చురకలంటించారు. అన్ని రకాల ఉగ్రవాదానికి పాకిస్థానే మూలం అని.. కాంగ్రెస్ చేసిన తప్పిదం వల్లే పాకిస్థాన్ ఉద్భవించిందని ఆరోపించారు. వారు విభజనను వ్యతిరేకించి ఉంటే.. పాకిస్థాన్ అనేదే ఉండేది కాదని అన్నారు. 1948లో మన సాయుధ బలగాలు పాక్ ఆక్రమిత కశ్మీరును స్వాధీనం చేసుకొనే స్థితిలో ఉండగా.. నాటి ప్రధాని నెహ్రూ ఏకపక్షంగా కాల్పుల విరమణను ప్రకటించారని అమిత్ షా గుర్తుచేశారు. 1971లో 93 వేల మంది పాక్ సైనికులు మనకు లొంగిపోయారని, 15 వేల చదరపు కిలోమీటర్ల మేర పాకిస్థాన్ భూభాగం మన అధీనంలో ఉందని.. అయినా పీవోకేను తిరిగి తీసుకోలేకపోయారని చెప్పారు. 1962లో చైనాతో యుద్ధం సమయంలో నాటి ప్రధాని నెహ్రూ ఆకాశవాణిలో ప్రసంగిస్తూ అసోంకు వీడ్కోలు పలికారన్నారు.

ఖర్గేకు నడ్డా క్షమాపణ

రాజ్యసభలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చలో ఖర్గే గంటకుపైగా ప్రసంగించారు. అనంతరం బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా మాట్లాడుతూ.. ఖర్గే మతిస్థిమితం కోల్పోయినట్లున్నారని, అందుకే ప్రధాని మోదీపై ఇష్టానుసారం విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. నడ్డా వ్యాఖ్యలపై ప్రతిపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నడ్డా క్షమాపణలు చెప్పాలని ఖర్గే డిమాండ్ చేశారు. స్పందించిన నడ్డా.. "నా వ్యాఖ్యలు ఉపసంహరించుకుంటున్నా. ఒకవేళ ఖర్గేను నా వ్యాఖ్యలు బాధించి ఉంటే, క్షమాపణ చెబుతున్నా" అన్నారు.

ఆధారాలు ఇస్తా

చిదంబరం వ్యాఖ్యలపై అమిత్ షా స్పందిస్తూ.. హోం మంత్రిగా చేసిన వ్యక్తి అలాంటి మాటలు మాట్లాడడం చాలా దురదృష్టకరమని చెప్పారు. "వాళ్లు ఏం నిరూపించాలనుకుంటున్నారు? ఎవరిని రక్షించాలని చూస్తున్నారు? ఉగ్రవాదులు పాకిస్థానీలు కాదని చెబుతున్నారు. తద్వారా మాజీ హోం మంత్రి చిదంబరం పాకిస్థాన్‌కు క్లీన్‌చిట్ ఇవ్వాలని చూస్తున్నారు" అని షా ధ్వజమెత్తారు. ఉగ్రదాడిలో పాక్ ప్రమేయాన్ని యావత్ ప్రపంచం అంగీకరించగా.. చిదంబరం మాత్రం సందేహాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఆధారాలు కావాలని చిదంబరం అడిగితే తాను ఇస్తానని అమిత్ షా చెప్పారు. ఈ సందర్భంగా ఆయన 2008లో జరిగిన సంఘటనను గుర్తుచేశారు. ఢిల్లీలోని బాట్లా హౌస్‌లో దాక్కొన్న ఇద్దరు ఇండియన్ ముజాహిదీన్ ఉగ్రవాదులను మన బలగాలు కాల్చి చంపాయని, ఆ వార్త తెలిసిన సోనియా కన్నీళ్లు పెట్టుకోవడం తనకు ఆశ్చర్యం కలిగించిందన్నారు. అలాంటి కాంగ్రెస్‌కు ఉగ్రవాదంపై ఏం చర్యలు తీసుకున్నారని తమ ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు లేదన్నారు. ఇదిలా ఉండగా, పాకిస్థాన్ భూభాగంలోని ఉగ్రవాదంపై ఆ దేశం చర్యలు తీసుకోలేకపోతే సాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ చెప్పారు. పీవోకే భారత్‌లో కలిసే రోజు ఎంతో దూరంలో లేదన్నారు.

ఉగ్రవాదులను పట్టించిన శాటిలైట్ ఫోన్



సులేమాన్

న్యూఢిల్లీ, శ్రీనగర్, జూలై 29: పహల్గాం ఉగ్రదాడి సూత్రధారి సులేమాన్‌ను.. అతడి ఇద్దరు సహచరులను మట్టుబెట్టిన మన భద్రతా దళాలు అసలు వారి ఉనికిని ఎలా పసిగట్టాయి? వారి దాకా ఎలా చేరుకున్నాయి? అంటే.. ఆ వివరాలన్నింటినీ అమిత్ షా లోక్‌సభ సాక్షిగా వెల్లడించారు. 26 మంది ప్రాణాలను బలిగొన్న పహల్గాం ఉగ్రదాడి జరిగిన రోజు రాత్రి నుంచే ఆపరేషన్ మహదేవ్ ప్రారంభమైందని.. ఆ దాడికి పాల్పడిన ముగ్గురు ఉగ్రవాదుల గుర్తింపును ధ్రువీకరించుకోవడానికి, వారిని వేటాడడానికి కొన్ని నెలల సమయం పట్టిందని ఆయన వెల్లడించారు. పహల్గాం దాడి వెనుకే కాక.. 2024 అక్టోబరులో సోనామార్గ్ పట్టణానికి సమీపంలోని గగన్‌గిర్‌లో జరిగిన ఉగ్రదాడి వెనుక కూడా సులేమాన్ హస్తం ఉందని అమిత్ షా చెప్పారు. ఏప్రిల్ 22న పహల్గాం దాడి జరిగినప్పటి నుంచి సులేమాన్, హంజా అఫ్గానీ, జిబ్రాన్‌ను హతం చేసే దాకా జరిగిన పరిణామాలను ఆయన వివరించారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం..

- పహల్గాం ఉగ్రదాడి జరిగిన రోజున ప్రభుత్వం భద్రతా సమావేశం నిర్వహించింది. ఆ మర్నాడు కూడా (ఏప్రిల్ 23న) ఇండియన్ ఆర్మీ, సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీసులతో మరో భేటీ నిర్వహించారు. ఉగ్రవాదులు ఎట్టిపరిస్థితుల్లోనూ భారత్‌ను దాటి పాకిస్థాన్‌లో ప్రవేశించకుండా అడ్డుకోవాలని నిర్ణయించారు. మే 22వ తేదీన.. దాచిగాం ప్రాంతంలో ఉగ్రవాదుల కదలికలపై ఇంటెలిజెన్స్ బ్యూరోకి సమాచారం అందింది.
- ఉగ్రవాదుల సిగ్నల్స్‌ను పట్టుకోవడానికి మన ఇంటెలిజెన్స్, ఆర్మీ.. దేశీయంగా తయారుచేసిన పరికరాలనే ఉపయోగించాయి. అప్పట్నుంచీ ఉగ్రవాదుల సిగ్నల్స్‌ను వెతుకుతూ.. మన ఆర్మీ, నిఘా, సీఆర్పీఎఫ్ అధికారులు ఉత్తకాళ్లతో పలు పర్వతాలను అధిరోహించారు.
- ఎన్ఐఏ అధికారులు తమ దర్యాప్తులో భాగంగా బాధితులు, పహల్గాంలో గుర్రాలు నడిపేవారు (పోనీవాలాలు), పర్యాటకులు, ఫొటోగ్రాఫర్లు, స్థానిక దుకాణదారులు.. ఇలా 1055 మందితో.. 3000 గంటలకు పైగా మాట్లాడారు. వారంతా చెప్పిన వివరాల ఆధారంగా ఉగ్రవాదుల ఊహాచిత్రాలు గీయించారు. పర్యాటకులను కాల్చిచంపిన ఉగ్రవాదులకు.. ఆశ్రయం ఇచ్చిన బషీర్, పర్వేజ్‌లను ఎన్ఐఏ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు.
- ఏప్రిల్ 21వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో ఉగ్రవాదులు బైసారన్‌లోయకు 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న తమ గుడిసె వద్దకు వచ్చారని.. వారు ఏకే-47 తుపాకులను, ఎం9 రైఫిళ్లను ధరించి ఉన్నారని.. తమ వద్ద భోజనం చేశారని బషీర్, పర్వేజ్ తెలిపారు. ఇలా నెలల తరబడి సేకరించిన సమాచారం ఆధారంగా వేట కొనసాగించిన మన దళాలకు జూలై 22న ఆ ఉగ్రవాదుల జాడ తెలిసింది.

రెండుసార్లు సంకేతం..

ఆపరేషన్ మహదేవ్ గురించి విశ్వసనీయ వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం.. ఉగ్రవాదులు ఉపయోగించిన చైనీస్ ఉపగ్రహ ఫోన్ నుంచి శనివారం వచ్చిన సంకేతంతో ఆర్మీ, జమ్మూకశ్మీర్ పోలీసులు అప్రమత్తమయ్యారు. అప్పటికి 17 రోజుల క్రితం అదే తరహా సంకేతం వచ్చి ఉండడంతో.. అది ఉగ్రవాదులకు సంబంధించేనని భావించి వేట కొనసాగించారు. ఆ సంకేతం ఆధారంగా డ్రోన్ల సాయంతో వారిని అన్వేషిస్తూ శ్రీనగర్ శివార్లలో ఉన్న దాచిగాం అడవులు, జబర్వాన్ పర్వత శ్రేణిలో.. మహదేవ్‌పీక్ సమీపంలోని ముల్నార్ పీక్ వద్దకు చేరుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి దాటాక.. 2 గంటల సమయంలో సులేమాన్ బృందం తమ వద్ద ఉన్న టీ82 అల్ట్రాసెట్ కమ్యూనికేషన్స్ డివైసును ఆన్ చేసింది. దాన్ని మన దళాలు గుర్తించాయి. సోమవారం ఉదయం డ్రోన్‌తో వారి జాడ కోసం గాలించాయి. డ్రోన్ పంపిన విజువల్స్ ఆధారంగా వారు ఉన్న స్థలాన్ని గుర్తించారు. ఉదయం 10 గంటల సమయంలో.. ఆర్మీకి చెందిన రాష్ట్రీయ రైఫిల్స్ ఉగ్రవాద నిర్మూలన దళం, 4 పారా స్పెషల్ ఫోర్సెస్‌తో కలిసి మహదేవ్ శిఖరంపైకి ఎక్కడం ప్రారంభించారు. అరగంటలోపే ఉగ్రవాదులు ఉన్న ప్రదేశానికి చేరుకున్నారు. 11 గంటల సమయంలో వారిపై కాల్పులు జరిపి మట్టుబెట్టారు. 11.45 గంటలకల్లా ఆపరేషన్ మహదేవ్ ముగిసింది.

డీఎస్సీ-2003 టీచర్లకు పాత పింఛను విధానం వర్తింపు



» నియామకాల తేదీ కన్నా నోటిఫికేషన్ సంవత్సరమే లెక్క: హైకోర్టు తీర్పు

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ - 2003లో ఎంపికైన ప్రభుత్వ ఉపాధ్యాయులకు హైకోర్టులో ఊరట లభించింది. వారికి 2004 సెప్టెంబర్ 1 కంటే ముందు వరకు అమలైన పాత పింఛను విధానమే వర్తిస్తుందని మంగళవారం తీర్పు ఇచ్చింది. తమకు పాత పింఛను విధానం వర్తింపజేసేలా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ పలువురు 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు వాదిస్తూ.. ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి 2003 నవంబరులో నోటిఫికేషన్ రాగా, జూన్ 2004 నాటికి మొత్తం ఎంపిక పూర్తయిందని తెలిపారు. 2005 నవంబరులో అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చారని తెలిపారు. ఈలోపు కొత్తగా కాంట్రిబ్యూటరీ పింఛను విధానం 2004 సెప్టెంబరు 1 నుంచి అమలులోకి వచ్చిందని పేర్కొన్నారు. కొత్త పింఛను విధానం అమలులోకి రాకముందే ఎంపిక ప్రక్రియ పూర్తయింది కాబట్టి పాత పింఛను విధానమే వర్తింపజేయాలని కోరారు. ఈ వాదనతో ధర్మాసనం ఏకీభవించింది. వారికి పాత పింఛను విధానం వర్తింపజేయాలని ఆదేశించింది. ఈ తీర్పుపై తెలంగాణ సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు దాముక కమలాకర్ హర్షం వ్యక్తం చేశారు.

మాసాయిపేట రైలు దుర్ఘటనపై నాలుగో తరగతిలో పాఠ్యాంశం

» తోటివారి ప్రాణాలు కాపాడిన సాహస బాలిక గాథ

రామయంపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నాలుగో తరగతి పాఠ్యాంశంలో మాసాయిపేట మానని గాయాన్ని చేర్చారు ఉపాధ్యాయులు. 11 ఏళ్ల క్రితం జరిగిన రైలు ప్రమాదంలో రుచిత అనే చిన్నారి చేసిన సాహసాన్నీ ఈ పాఠ్యాంశంతో గుర్తు చేశారు. 16 మంది చిన్నారుల ప్రాణాల్ని చిదిమేసిన ఈ దుర్ఘటనను తెలుగు పుస్తకంలో 'తెలుగు సాహస బాల - రుచిత' అన్న శీర్షికతో ముద్రించి విద్యార్థులకు బోధిస్తున్నారు. 2014 జూలై 24న మెదక్ జిల్లా మాసాయిపేట రైల్వే క్రాస్ వద్ద.. పట్టాలపై ఆగి ఉన్న స్కూల్ బస్సును, నాందేడ్ వెళ్తోన్న రైలు ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్ సహా 16 మంది అభం శుభం తెలియని పిల్లలు మృత్యుశకటానికి బలయ్యారు. అప్పట్లో ఈ ఘటన దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ ప్రమాదం ఓ సాహస బాలికను వెలుగులోకి తీసుకు వచ్చింది. ఒకరినొకరు కాపాడుకోలేని అచేతన స్థితిలో కూడా.. ఇద్దరు తోటి వారి ప్రాణాలు కాపాడింది రుచిత అనే చిన్నారి. రైలు దగ్గరగా వస్తోందని గమనించిన రుచిత, బస్సు ముందుకు కదలకపోవడంతో వెంటనే ఇద్దరు పిల్లల్ని కిటికీలోంచి తోసేసి, తాను దూకేసింది. రుచిత సాహసాన్ని గుర్తించిన భారత ప్రభుత్వం సాహస బాలికగా గుర్తించి సత్కరించింది.

కందుకూర్‌లో ఘనంగా తేళ్ల పంచమి

» అంతటా నాగుల పంచమి.. అక్కడ మాత్రం తేళ్ల పంచమి

» వింత ఆచారం చూసేందుకు తరలి వచ్చిన జనం

» ఇక్కడి తేళ్లు కుట్టవని భక్తుల నమ్మకం



కొండమవ్వ గుట్టపై తేళ్లతో ఓ యువకుడి సరదా

నారాయణపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రం కందుకూరు గ్రామంలో మంగళవారం తేళ్ల పంచమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. దేశ వ్యాప్తంగా అన్ని చోట్లా నాగుల పంచమిని వేడుకలు నిర్వహించుకుంటే. ఇక్కడి గ్రామస్థులు మాత్రం కొండమవ్వ గుట్టపై కొలువు తీరిన తేళ్ల విగ్రహాలకు పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ వింత ఆచారాన్ని చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో రావడంతో వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. అనంతరం చిన్నా, పెద్దా అన్న తారతమ్యం లేకుండా అందరూ.. అక్కడున్న కొండ రాళ్ళను కదిలించి వాటి కింద ఉన్న తేళ్ళను పట్టుకుని వాటితో సరదాగా ఆడుకున్నారు. వాటిని ముఖం, శరీరంపై వేసుకుని సందడి చేశారు. ఈ తేళ్ల పంచమి పూర్వం నుంచి ఇక్కడ ఆచారంగా కొనసాగుతోంది. ఇక్కడి తేళ్లు కుట్టవని, ఒకవేళ కుట్టినా అమ్మవారి దగ్గర ఉన్న విభూతిని తేళ్లు కుట్టిన ప్రదేశంలో పెడితే ఏమీ కాదని భక్తులు నమ్ముతారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కేంద్ర సర్వీసులోకి షికా గోయల్

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఐపీఎస్ అధికారి, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ జనరల్ షికా గోయల్ కేంద్ర సర్వీసులో కొనసాగనున్నారు. 35 మంది ఐపీఎస్ అధికారులు కేంద్ర సర్వీసుల్లో కొనసాగడానికి సంబంధించిన ప్రతిపాదనలను కేబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ మంగళవారం ఆమోదించింది. ఇందులో తెలంగాణకు చెందిన ఇద్దరు ఐపీఎస్ అధికారులున్నారు. 1994 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి, ప్రస్తుతం సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీగా ఉన్న షికాగోయల్‌తోపాటు 1994 బ్యాచ్‌కే చెందిన మరో ఐపీఎస్ అధికారి కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరోలో పనిచేస్తున్న ఆప్టే వినాయక్ ప్రభాకర్ ఉన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

» ఒక మావోయిస్టు మృతి.. ఇద్దరు జవాన్లకు గాయాలు

చర్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా అడవుల్లో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక మావోయిస్టు మృతి చెందాడు. ఎదురుకాల్పుల్లో ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. మావోయిస్టు పార్టీ వారోత్సవాల నేపథ్యంలో సుకుమా పోలీసులు కూబింగ్ నిర్వహిస్తుండగా.. సుకుమా-కుంట అడవుల్లో మావోయిస్టులు, బలగాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఘటనా స్థలంలో ఓ మావోయిస్టు మృతదేహం, తుపాకీ లభించినట్లు పోలీసులు తెలిపారు. ఇదే ఘటనలో ఇద్దరు జవాన్లు కూడా గాయపడ్డారని, ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని పేర్కొన్నారు. తప్పించుకున్న మావోయిస్టుల కోసం గాలింపు ముమ్మరం చేశామన్నారు.

తెలంగాణకు 2,800 ఎలక్ట్రిక్ బస్సులు ఇవ్వండి

కేంద్రానికి ఎంపీ కావ్య వినతి

న్యూఢిల్లీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు 2,800 ఎలక్ట్రిక్ బస్సులను మంజూరు చేయాలని ఎంపీ కడియం కావ్య కేంద్రాన్ని కోరారు. మంగళవారం లోక్‌సభలో కావ్య మాట్లాడుతూ, పీఎం ఈ డ్రైవ్ పథకం కింద రాష్ట్రానికి 2,800 ఎలక్ట్రిక్ బస్సులను మంజూరు చేయాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ, ప్రామాణిక జీసీసీ మోడల్‌ను మాత్రమే కేంద్రం ఆమోదిస్తోందని తెలిపారు. రాష్ట్రం సూచించిన హైబ్రిడ్ మోడల్ ప్రస్తుతం పథకంలో లేనందున ఇంకా పరిశీలనలో ఉందన్నారు.

ఎన్నికల తర్వాతా నితీశే సీఎం: చిరాగ్

న్యూఢిల్లీ, జూలై 29: ఈ ఏడాది జరుగనున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత నితీశ్‌కుమార్ మరోమారు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని ఎల్‌జేపీ(రామ్ విలాస్) పార్టీ అధ్యక్షుడు, కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ చెప్పారు. నితీశ్ కుమార్ ప్రభుత్వం నేరస్థుల ఎదుట లొంగిపోయిందంటూ రెండు రోజుల క్రితమే ఆయన విమర్శించిన విషయం తెలిసిందే. ఆ ప్రభుత్వానికి తమ పార్టీ మద్దతు ఇవ్వడంపై ఆయన విచారం కూడా వ్యక్తం చేశారు. తాజాగా సోమవారం ఢిల్లీలో చిరాగ్ విలేకరులతో మాట్లాడుతూ ఎన్డీయేను గెలిచే సంకీర్ణంగా అభివర్ణించారు.

పరదా కాపురాల పాట్లు!

(మొదటి పేజీ తరువాయి)

లభించిన ఆశ్రయం ఇక మీదట దూరమయ్యే పరిస్థితిని పలువురు భారతీయులు ఎదుర్కొంటున్నారు. సంపన్నుల నిలయమైన దుబాయిలో సగటు కార్మికుడికి పడుకునే చోటు లభించాలన్నా సవాలక్ష సమస్యలు ఉన్నాయి. అనేక తెలుగు ప్రవాసీ కుటుంబాలు తమవారిని కలుసుకోవాలంటే ఏ రెస్టారెంట్‌లోనో, పార్కులోనో మాత్రమే కలుసుకుంటూ ఉంటాయి. ఇళ్ళకు అతిథులను ఆహ్వానించడానికి వెనుకాడుతారు. ఎందుకంటే, ఇరుకయిన ఇళ్లలో కుర్చీ వేసుకోవడానికి కూడ స్థలం ఉండదు. దుబాయిలో అద్దెకు ఇచ్చే ఇళ్ళు సైజులో పెద్దవేగానీ.. వాటిని నియమాలకు విరుద్ధంగా విభజించి మంచాలు లేదా గదుల వారీగా అద్దెకిస్తున్న అక్రమ విధానం అమలులో ఉంది. ఇది ఇంటి యాజమానులకు ఆర్థికంగా లాభదాయకంగా ఉంటోంది. మరోవైపు, ప్రవాసీలకు చవకగా ఆశ్రయం లభిస్తోంది. దుబాయి నిబంధనల ప్రకారం ఒక గదిలో ఒక మనిషికి కనీసం 3.7 చదరపు మీటర్ల వైశాల్యం ఉన్న స్థలం ఉండాలి. కానీ ఆ సైజు లేదా దానికన్నా తక్కువ స్థలంలో ఒక జంట ఉంటోంది. ఒక గదిలో ఒక జంటకు బదులుగా నాలుగు జంటలు పరదాలు కట్టుకొని బంకు బెడ్డులలో కాపురం చేస్తుండగా, బ్యాచిలర్లయితే 10 మంది వరకు నివసిస్తున్నారు. తెలుగు ప్రవాసీయులు ఎక్కువగా ఉన్న దేరా, రిగ్గా, కరమా, సత్వా, ముర్రఖబాద్, బర్ దుబాయిలలో 'షేర్ అకాడమేషన్' పేరిట ఈ సంస్కృతి ఎక్కువగా ఉంది. ఒక గది అద్దె 4 వేల దిర్హాంలు ఉంటే, నాలుగు జంటలు వెయ్యి దిర్హాంల చొప్పున చెల్లిస్తూ ఆ ఒక్క గదిలో ఉంటున్నాయి. మంచం చుట్టు పరదా లేదా ప్లైవుడ్‌తో తెరలాగా వేసుకుంటున్నారు.



ఆరోగ్య సమస్యలు.. అగ్ని ప్రమాదాలు

యజమానులు తమ ఇళ్లలోని మొత్తం స్థలాన్ని అద్దెకు ఇస్తుండటంతో.. గాలి, వెలుతురు లేని ఇరుకు కారణంగా పలువురు ఆరోగ్య సమస్యల బారిన పడుతున్నారు. అంతే కాదు, అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దుబాయిలో జరుగుతున్న అగ్ని ప్రమాదాలలో 74 శాతానికి పైగా ఈ తరహా ఇరుకు గదులే కారణమని ఇటీవల ఓ అధికారిక నివేదిక వెల్లడించింది. ఈ నేపథ్యంలో, షేర్ అకాడమేషన్‌పై అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. పోలీసులు, మునిసిపాల్టీ, విద్యుత్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేస్తూ జరిమానాలు విధిస్తున్నారు. దీని వెనుక దుబాయి స్థిరాస్తి వ్యాపారుల హస్తం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. షేర్ అకామడేషన్ విధానం తమ వ్యాపారాభివృద్ధికి అడ్డంకిగా తయారైందని భావించి ఆ విధానాన్ని తొలగించటానికి వారు సైతం ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. దీంతో తెలుగు ప్రవాసీలు ఆశ్రయం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. ముఖ్యంగా, అద్దె తక్కువ ఉండే షార్జాకు తరలివెళ్తున్నారు. అయితే, ఇది చాలామందికి ఆర్థికంగా భారంగా పరిణమిస్తోంది. ఏపీలోని ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన వందలాది మంది మహిళలు దుబాయిలో ఇళ్ళలో పాచి పనులు చేస్తుంటారు. వీరంతా ఇపుడు షార్జాలో ఉండి దుబాయికి వెళ్లి రావటానికి డబ్బుపరంగా ఇబ్బందులు ఎదుర్కోవటమేగాక ప్రయాణ బడలికతో అలిసిపోతున్నారు. తెలంగాణ కార్మికులది కూడ అదే పరిస్థితి. కాగా, దుబాయి నగర శివారులో ఉన్న లేబర్ క్యాంపులలో వసతుల అభివృద్ధిపై సర్కారు దృష్టి సారిస్తోంది. 50 మందికిపైగా కార్మికులు ఉన్న ప్రతి సంస్థ విధిగా తమ లేబర్ క్యాంపు వసతి వివరాలను ప్రభుత్వం వద్ద నమోదు చేయాలని నిర్దేశిస్తున్నారు.

31న గురుకుల ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

» ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఇంటర్మీడియట్ కోర్సులకు సంబంధించిన సీట్లకు ఈ నెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి తెలిపారు. బుధవారం నుంచి వెబ్‌సైట్‌లో ఖాళీ సీట్ల జాబితా అందుబాటులో ఉంటుందని తెలిపారు. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలను పారదర్శకంగా మెరిట్ ఆధారంగా భర్తీ చేసినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో మంగళవారం వర్షిణి మీడియాతో మాట్లాడారు. గురుకుల పాఠశాలల్లో 5 నుంచి 9వ తరగతి వరకు ఉన్న అన్ని సీట్లు భర్తీ అయ్యాయని ఆమె తెలిపారు. సంక్షేమ గురుకులాల్లో పిల్లలకు నాణ్యమైన పోషకాహార భోజనాలు అందించడానికి కేంద్రీకృత కొనుగోలు విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని తెలిపారు.

వ్యవసాయ మహిళా డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు ఆగస్టు 15లోగా దరఖాస్తులు

గురుకుల వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఈఏపీసెట్-2025లో అర్హత సాధించిన విద్యార్థినులు ఈ నెల 30 నుంచి ఆగస్టు 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి బడుగు సైదులు తెలియజేశారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో https://mjptbcwreis.telangana.gov.in, https://ug.mjptbcwreis.net దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నాణ్యమైన విద్యతోనే ప్రపంచస్థాయి గుర్తింపు

» విద్యతో పాటు నైతిక విలువలు నేర్పించాలి

» కష్టపడి చదివితేనే విద్యార్థులకు ఉన్నత లక్ష్యాలు సాధ్యం

» ముచ్చింతల్ ప్రభుత్వ పాఠశాలలో ఒకే రోజు 800 అడ్మిషన్లు అద్భుతం : కపిల్‌దేవ్



తరగతి గదులను ప్రారంభిస్తున్న క్రికెటర్ కపిల్‌దేవ్; చిత్రంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్, మైహోం గ్రూప్ వైస్ చైర్మన్ జూపల్లి జగపతిరావు

శంషాబాద్‌రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యతోనే ప్రపంచస్థాయి గుర్తింపు వస్తుందని భారత క్రికెట్ మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్ అన్నారు. విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానంలో నిలవాలంటే కష్టపడి చదవాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యతోపాటు నైతిక విలువలు పాఠశాల దశ నుంచే నేర్పించాలన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లో ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవానికి ఆర్టీసీ ఎండీ సజ్జనార్, మైహోం గ్రూప్ వైస్ చైర్మన్ జూపల్లి జగపతిరావుతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల అదనపు గదులను ప్రారంభించారు. అనంతరం సమావేశంలో కపిల్‌దేవ్ మాట్లాడుతూ.. గత సంవత్సరం ఇక్కడికి వచ్చినప్పుడు వసతులేమీ లేవని, ఇప్పుడు కార్పొరేట్ స్కూల్‌కు మించిన వసతులను ఏర్పాటు చేశారని కొనియాడారు. కృషి ఫౌండేషన్ సహకారంతో ఈ పనులు చేపట్టడం అభినందనీయమన్నారు. ఒకేరోజు ఈ పాఠశాలలో 800మంది విద్యార్థులు చేరడం మామూలు విషయం కాదని, రానున్న రోజుల్లో ఎడ్యుకేషన్ హబ్‌గా ముచ్చింతల్‌ను చూస్తామని అన్నారు. ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ.. పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తమ అన్న జూపల్లి రామేశ్వర్‌రావు స్ఫూర్తితోనే సమాజసేవలోకి వచ్చామని జూపల్లి జగపతిరావు చెప్పారు. నిరుపేద కుంటుంబం నుంచి వచ్చామని, ఈ రోజు ఎంతో ఎత్తుకు ఎదిగాం కాబట్టే సమాజనికి సేవ చేయాలనే ఉద్దేశంతో పేదల పిల్లలకు ఉన్నత విద్య అందించాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. రూ.2.10 కోట్లతో అదనపు తరగతి గదులను 28 రోజుల్లో నిర్మించామని చెప్పారు. ఈ గ్రామాన్ని భవిష్యత్‌లో ఎడ్యూకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు.

నెల రోజుల్లో భవనం నిర్మాణం

ముచ్చింతల్‌లోని ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి నడుం కట్టిన మైహోం గ్రూప్ గత విద్యాసంవత్సరం తన వంతుగా అదనపు తరగతి గదులను నిర్మించింది. 1 నుంచి 9వ తరగతి వరకు ఉన్న ఈ బడిలో విద్యార్థుల సంఖ్య 360కి పెరిగింది. ఎక్కువ మంది విద్యార్థులు చేరేవిధంగా సంస్థ ఈ విద్యాసంవత్సరం వినూత్న ప్రచారానికి స్వీకారం చుట్టింది. ముచ్చింతల్ చుట్టుపక్కల 24 గ్రామాల విద్యార్థుల కోసం 2 బస్సులను ఉచితంగా ఏర్పాటు చేస్తామని.. వేసవి సెలవుల్లో ఊరూరా తిరుగు తూ ప్రచారం చేసింది. అంతే ప్రభుత్వ పాఠశాలలో చేరే విద్యార్థుల సంఖ్య అమాంతం పెరిగింది. 2024 జూన్ 12న 800 మంది ఈ పాఠశాలలో చేరారు. వీరంతా ప్రైవేటు స్కూళ్లను వదిలివచ్చినవారే. ఒకేసారి విద్యార్థుల సంఖ్య 1160కి చేరడంతో.. మరిన్ని తరగతి గదుల అవసరం ఏర్పడింది. దీంతో 2.10 కోట్లతో అదనపు తరగతి గదులను కేవలం 28 రోజుల్లో నిర్మించి ఇచ్చారు. ఈ స్కూల్లో ప్రస్తుతం 22 మంది టీచర్లు ఉండగా.. వీరిలో 14 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు. మిగతా టీచర్లకు మైహోం గ్రూప్ వేతనాలు చెల్లిస్తుంది.

బీసీ రిజర్వేషన్ల కోసం 72 గంటల దీక్ష

» ఇందిరా పార్కు వద్ద ఆగస్టు 4 నుంచి 7 వరకు నిర్వహణ

» ఆర్డినెన్స్, బిల్లుల ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు న్యాయ పోరాటం చేయట్లేదు?: ఎమ్మెల్సీ కవిత

పంజాగుట్ట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం 72 గంటల నిరాహార దీక్ష చేయనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వెల్లడించారు. ఇందిరాపార్క్‌లోని ధర్నా చౌక్‌లో ఆగస్టు 4వ తేదీ ఉదయం 11 గంటల నుంచి 7వ తేదీ ఉదయం 11 గంటల వరకు తన దీక్ష కొనసాగుతుందని ప్రకటించారు. హైకోర్టు చెప్పిన గడువులోగా స్థానిక ఎన్నికలు నిర్వహించడం ఎంత ముఖ్యమో.. బీసీలకు రిజర్వేషన్లు కల్పించడమూ అంతే ముఖ్యమని అన్నారు. బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదించకపోవడం, బీసీ బిల్లులపై రాష్ట్రపతి స్పందించకపోవడంపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు న్యాయ పోరాటం చేయట్లేదని ప్రశ్నించారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం యునైటెడ్ పూలే ఫ్రంట్(యూపీఎఫ్), బీసీ సంఘాల నాయకులతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. బీసీ బిల్లులను అసెంబ్లీలో ఆమోదించే సమయంలో అఖిల పక్షాన్ని కేంద్రం వద్దకు తీసుకెళ్తామని ప్రకటించిన కాంగ్రెస్ సర్కారు.. ఇప్పుడు ఆ దిశగా ఎలాంటి ప్రయత్నమూ చేయడం లేదని దుయ్యబట్టారు. గతంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపట్టిన ధర్నాను ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీనే పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు కూడా ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుళ్లకుండా, పార్టీ పరంగా ధర్నా చేస్తామని చెప్పడం బీసీలను వంచించడమేనని ధ్వజమెత్తారు.

కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ వర్సిటీలో ఆగస్టు నుంచి తరగతులు!

» 'దోస్త్' వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ

» పీజీ కోర్సులూ ఈ ఏడాది నుంచే ప్రారంభం

కొత్తగూడెం ఎడ్యుకేషన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే మొదటి ఎర్త్ సైన్సెస్ (భూ విజ్ఞాన శాస్త్రం) యూనివర్సిటీని రాష్ట్ర ప్రభుత్వం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం కొత్తగూడెంలో ఏర్పాటు చేసింది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో అంతకుముందున్న మైనింగ్ ఇంజనీరింగ్ కళాశాలను ఎర్త్ సైన్స్ వర్సిటీగా అప్‌గ్రేడ్ చేసి.. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన మాజీ ప్రధాని దివంగత మన్మోహన్ సింగ్ పేరు పెట్టింది. ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు ఇచ్చేందుకు 'దోస్త్' వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానించింది. ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులు. మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం సీట్లు కేటాయిస్తారు. బీఎస్సీలో జియాలజీ, జియోఫిజిక్స్, జియోకెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ కోర్సులతో పాటు పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులు కూడా ఈ ఏడాది నుంచే ప్రారంభించనున్నారు. ఒక్కో విభాగం లో బీఎస్సీలో 60, పీజీలో 40సీట్లు ఉన్నాయి. ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా పీజీ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తారు. ప్రస్తుతం ఎర్త్ సైన్సెస్ కోర్సులన్నీ దేశంలో ఎక్కడా ఒకే వర్సిటీలో ఎక్కడా లేవు. ఈ కోర్సులకు దేశ విదేశాల్లో వివిధ రంగాల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఎర్త్ సైన్సెస్ వర్సిటీ 312 ఎకరాల్లో ఏర్పాటవుతోంది. రూ.500 కోట్లతో సదుపాయాలు కల్పిస్తున్నారు. మొదటి ఏడాది ఏ కోర్సుల్లో ఏ సబ్జెక్టులు ఉండాలనే అంశంపై వివిధ వర్సిటీల అధ్యాపకులతో చర్చించారు. ఆగస్టులో తరగతులు ప్రారంభమవుతాయని విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, వైస్ చాన్సలర్ యోగితా రాణా తెలిపారు. బీఎస్సీ కోర్సుల్లో అడ్మిషన్ ఫీజు రూ.19,500 వరకు ఉంటుందని, స్కాలర్‌షిప్ లభిస్తుందని ప్రిన్సిపాల్ జగన్ మన్మోహన్‌రాజు చెప్పారు.



కార్యక్రమంలో బాక్సింగ్ పోజిస్తున్న హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, టిమ్రిస్ అధ్యక్షుడు ఫహీముల్లా ఖురేషీ, మైనార్టీ కార్యదర్శి షఫీఉల్లా

టిమ్రిస్ క్రీడా కార్యాచరణ విడుదల

» జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న 95 మంది విద్యార్థులకు సన్మానం

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలన్న లక్ష్యంతో మైనార్టీ గురుకులాల విద్యాసంస్థ టిమ్రిస్ నూతన క్రీడా కార్యాచరణ ప్రకటించింది. సికింద్రాబాద్ జింఖానా మైదానంలో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో టిమ్రిస్ అధ్యక్షుడు ఫహీముల్లా ఖురేషీ, మైనార్టీ కార్యదర్శి షఫీఉల్లా, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత ఏడాది కాలంలో జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని సత్తా చాటిన 95 మంది టిమ్రిస్ విద్యార్థులను సన్మానించారు. క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటుతున్న విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని ఫహీముల్లా ఖురేషీ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'దివ్య' విజయం

ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్‌లో చాంపియన్‌గా అవతరించి పందొమ్మిదేళ్ల దివ్యా దేశ్‌ముఖ్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఫైనల్లో తనకంటే ఎంతో అనుభవజ్ఞురాలైన తెలుగమ్మాయి కోనేరు హంపిపై విజయం సాధించి చిరుప్రాయంలోనే ప్రపంచకప్ గెలిచిన చరిత్ర సృష్టించింది. టైటిల్ కోసం ఇద్దరు భారతీయులు పోటీ పడటం ఇదే మొదటిసారి. ఇక, గతంలో ఆనంద్ రెండు పర్యాయాలు ఈ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచినా, మహిళల్లో భారత్ నుంచి మొట్టమొదటి చాంపియన్ దివ్య.

నాగ్‌పూర్‌లో వైద్యులైన అమ్మానాన్నల ప్రోత్సాహమే అండగా దివ్య చదరంగ ప్రస్థానం సాగింది. అండర్–7 అమ్మాయిల విభాగం జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించడం ఆమె సహజ ప్రజ్ఞను చాటింది. అండర్–9 విభాగంలో ఆమె జాతీయ చాంపియన్. మరుసటి ఏడాది ఆసియా స్కూల్ చెస్ అండర్–10 విభాగంలో ప్రపంచ టైటిల్ గెలిచి చిచ్చరపిడుగు అనిపించుకుంది. పన్నెండేళ్లకే ఇంటర్నేషనల్ మాస్టర్ హోదా అందుకుంది. వరల్డ్ యూత్ చెస్, ఆసియా టైటిల్, ప్రపంచ జూనియర్ చెస్ చాంపియన్‌షిప్.. ఇలా చిరుప్రాయంలోనే అనేక టైటిళ్లు కొల్లగొట్టింది. నిరుడు సహచర క్రీడాకారిణులతో కలిసి ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్‌ను భారత్ అందుకోవడంలో కీలక భూమిక పోషించింది. సీనియర్ టోర్నమెంట్లలో ఆడిన అనుభవం అంతగా లేకున్నా, తాజా ప్రపంచకప్‌లో దూకుడైన ఆటతో గ్రాండ్‌మాస్టర్లను కంగుతినిపించింది. తనకంటే మెరుగైన రేటింగ్ ఉన్న ద్రోణవల్లి హారికను క్వార్టర్స్‌లో, చైనా స్టార్ క్రీడాకారిణి టాన్ జోంగ్యీని సెమీఫైనల్లో ఓడించి దివ్య ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేసుకుంది. ఇక అసలైన ఆఖరి పోరాటంలో తనకంటే రెట్టింపు వయసున్న హంపిపై విజయం సాధించి ప్రపంచకప్ ట్రోఫీని సగర్వంగా అందుకుంది. ఈ క్రమంలోనే చదరంగ క్రీడాకారులకు అత్యంత ప్రాధాన్యమైన గ్రాండ్‌మాస్టర్ హోదాను దక్కించుకుంది. హంపి, హారిక, వైశాలి తర్వాత గ్రాండ్‌మాస్టర్‌గా అవతరించిన నాలుగో భారత క్రీడాకారిణిగా శిఖరాగ్రానికి చేరుకుంది.

దివ్య ఫ్యాషన్‌కూ ప్రాధాన్యమిస్తుంది. నవతరం అమ్మాయిలకు తగ్గ దుస్తులు ధరించడం, జుట్టును వదిలేయడం ఆమెకు ఇష్టం. వీటిపై గతంలో దివ్య ఎన్నో విమర్శలు ఎదుర్కొంది. 'అమ్మాయిల ఆటతీరును, వారి బలాలను చూడండి. అంతేకానీ, ఇతర విషయాలను కాదు. నేను వీటిని పట్టించుకోను. అందరూ నాలా ఉండకపోవచ్చు. కొందరు ఇలాంటి మాటలు భరించలేక ఆటకు దూరమవుతారు. ఇలాంటి పరిస్థితిని ఎవరికీ రానివ్వొద్దు' అంటూ విమర్శకులకు దీటుగా బదులిచ్చింది ఆమె. తన ఆటతో, ఆత్మవిశ్వాసంతో ఈ తరానికి స్ఫూర్తిగా నిలిచింది.

విశ్వనాథన్ ఆనంద్ దశాబ్దాల తరబడి భారత చదరంగానికి చుక్కానిలా నిలిచారు. ఐదు పర్యాయాలు ప్రపంచ చాంపియన్‌గా నిలిచి చెస్‌లో దిగ్గజస్థాయిని అందుకున్నారు. ఆ తర్వాత భారత్ నుంచి కొందరు ఆటగాళ్లు వచ్చినా నిలదొక్కుకోలేకపోయారు. కానీ, గత దశాబ్దకాలం నుంచి పరిస్థితి మారింది. ఆనంద్ మార్గదర్శకత్వంలో ఎందరో క్రీడాకారులు వెలుగులోకి వచ్చారు. 1999 నాటికి దేశంలో ముగ్గురే గ్రాండ్‌మాస్టర్లు ఉంటే.. ఇప్పుడు ఆ సంఖ్య 88కి చేరింది. భారత్‌లో చెస్ ఎదుగుదలకు ఇది సంకేతం. గుకేశ్, ప్రజ్ఞానంద, అర్జున్ ఇరిగేసిలాంటి ఆటగాళ్లు పిన్న వయసులోనే గ్రాండ్‌మాస్టర్లుగా అవతరించారు. అమెరికా, రష్యా, నెదర్లాండ్స్ లాంటి దేశాలను తలదన్నే స్థాయిలో ఎక్కువగా గ్రాండ్‌మాస్టర్లు భారత్‌లో రూపు దిద్దుకుంటున్నారు. ఆనంద్ ఘన వారసత్వాన్ని అందిపుచ్చుకుంటూ జూనియర్ ఆటగాళ్లు తమ మస్తిష్కానికి పదును పెడుతున్నారు. గతేడాది గుకేశ్ ప్రపంచ చాంపియన్‌గా అవతరిస్తే, చెస్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే ఒలింపియాడ్ పురుషులు, మహిళల ట్రోఫీలను భారత జట్లు గెలుచుకున్నాయి. నిరుడు మహిళల ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్‌షిప్‌ను హంపి దక్కించుకుంటే, ఇప్పుడు మహిళల ప్రపంచకప్‌ను దివ్యా దేశ్‌ముఖ్ సొంతం చేసుకుంది. ప్రస్తుతం ప్రపంచ చదరంగంలో మనోళ్ల ఆధిపత్యం సాగుతోందనడానికి ఈ విజయాలే తార్కాణం.

హమాస్... క్షణం ఆలోచించాల్సింది!

2023 అక్టోబరు 7వ తేదీ... ఇజ్రాయెల్‌పైకి వేల క్షిపణులు ప్రయోగించే ముందు హమాస్ ఒక్క క్షణం ఆలోచించాల్సింది... 'నాది' అని ఇజ్రాయెల్ చెప్పుకొంటున్న భూభాగంలోకి ప్రవేశించేముందు ఒక్క క్షణం ఆలోచించాల్సింది...

వందల మందిని చంపి, ఎందరినో బందీలుగా పట్టుకున్నామనే ఆనందం పొందేముందైనా ఒక్క క్షణం ఆలోచించాల్సింది... 'ఈ రోజు మాదే! మరి... రేపు ఏమవుతుంది?' అని హమాస్ తమలో తాము ప్రశ్నించుకోవాల్సింది!

అదే జరిగి ఉంటే... నేడు గాజా ఒక శిథిలాల దిబ్బలా మారేది కాదేమో! రెండేళ్లుగా రక్తమోడుతూ విలపించేది కాదేమో! ఏడ్పులు, ఆర్తనాదాలు వినిపించేవి కావేమో! 'పాలస్తీనా ఎవరిది? ఇజ్రాయెల్ దురాక్రమణదారా? కాదా? న్యాయం ఎటువైపు ఉంది?' అనే ప్రశ్నలకు ఎవరి సమాధానాలు వారివి. కానీ... ఇజ్రాయెల్ ఏమిటో ప్రపంచానికి తెలుసు. ఆ దేశ పాలకుడు ఎంత మొండివాడో కూడా తెలుసు. 'మా పౌరుల్లో ఒక్కరిని చంపితే... మిమ్మల్ని వందమందిని చంపుతాం. మాపై ఒక్క రాకెట్ వదిలితే... వెయ్యి బాంబులతో విరుచుకుపడతాం!' అనేదే ఇజ్రాయెల్ సిద్ధాంతం! లక్ష్యంగా ఎంచుకున్న 'శత్రువు' పాతాళంలో ఉన్నా వెంటాడి, వేటాడి వధించే తత్వం వాళ్లది. కాలం మారుతోంది కానీ... ఈ సిద్ధాంతంలో ఇసుమంత మార్పూ లేదు. ఇది ప్రపంచానికి తెలుసు! మరి... హమాస్‌కు తెలియదా? ఒక్కరోజు అవకాశం దక్కిందని కంచెలు తెంచుకుని ఇజ్రాయెల్‌లోకి దూకుడుగా వెళ్లడం ఎంత 'ముప్పో' తెలియదా? తాము వదిలే వందల రాకెట్లకు బదులుగా ఎన్ని వేల బాంబులు మీద పడతాయనేది ఊహించలేకపోయిందా? హమాస్ ఒక్కరోజు పొందిన 'వెర్రి ఆనందానికి' ఇప్పుడు మూల్యం చెల్లించుకుంటున్నది ఎవరు? 'శత్రువు'కు తనదైన విస్తృత అర్థాన్ని కల్పించుకుని... జాలి, దయ, మానవత్వాన్ని మూటగట్టి మంచెపై పెట్టిన ఇజ్రాయెల్ రక్కసి పంజాకు బలి అవుతున్నదెవరు? ముందు హమాస్ స్థావరాలు, ఆ తర్వాత ప్రభుత్వ భవనాలు, ఆపై పాఠశాలలు, ఆస్పత్రులు, నిరాశ్రయుల శిబిరాలు... ఇజ్రాయెల్ గురికి అన్నీ శిథిలాలే! 'గాజా'కు అన్ని దారులూ మూసుకుపోయాయి. సహాయ సామగ్రీ అందడం లేదు. గాజా ఇప్పుడు ఆకలి దప్పులతో అల్లాడుతోంది. సంక్షోభం ఇంతలా ముదిరి... డొక్కలు ఎండి, కన్నీళ్లూ ఇంకి, ఎముకలు తేలిన చిన్నారుల చిత్రాలు ప్రపంచాన్ని కలిచి వేస్తున్నాయి కానీ... ఇజ్రాయెల్‌ను కాదు!



ఇజ్రాయెల్ ఏమిటో ప్రపంచానికి తెలుసు. ఆ దేశ పాలకుడు ఎంత మొండివాడో కూడా తెలుసు. 'మాపై ఒక్క రాకెట్ పడితే... వెయ్యి బాంబులతో విరుచుకుపడతాం!' అనేదే ఇజ్రాయెల్ సిద్ధాంతం! 'శత్రువు' పాతాళంలో ఉన్నా వెంటాడి, వేటాడి వధించే తత్వం వాళ్లది. కాలం మారుతోంది కానీ... ఈ సిద్ధాంతంలో ఇసుమంత మార్పూ లేదు.

ఇజ్రాయెల్ 'మొస్సాద్'కు ప్రపంచంలోనే అత్యంత సమర్థమైన నిఘా వ్యవస్థగా పేరుంది. పాలస్తీనా వైపు నుంచి ఒక్క రాకెట్ గాల్లోకి లేచినా... దుర్భేద్యమైన ఇజ్రాయెల్ గగన రక్షణ వ్యవస్థ (ఐరన్ డోమ్) అడ్డుకుంటుంది. మరి... 2023 అక్టోబరు 7వ తేదీన 'అలా ఎందుకు జరిగింది?' అది యూదులకు సెలవుల కాలం! ఇజ్రాయెలీలు విహారాల్లో మునిగి తేలుతున్నారు. గాజాకు బాగా సమీపంలోని రీఇమ్‌లో భారీ సంగీతోత్సవం ఏర్పాటు చేశారు. అలాంటి సమయంలో... హమాస్ నుంచి ఎలాంటి ముప్పు ఊహించకుండా 'మొస్సాద్' మొద్దు నిద్రపోతోందా? హమాస్ దాడిని ఊహించలేదా? లేక... 'గాజా'ను మట్టిపాలు చేసేందుకే వాళ్లకు ఒక అవకాశమిచ్చిందా? ఏం జరిగిందో చెప్పలేం! కానీ... పాలస్తీనాపై విరుచుకు పడేందుకు ఇజ్రాయెల్‌కు ఒక 'కారణం' దొరికింది. 'అందివచ్చిన అవకాశం' అంటూ గాజాలో ఒక్కో అంగుళాన్నీ ధ్వంసం చేస్తోంది. హమాస్ దాడిలో 1500 మంది దాకా ఇజ్రాయెలీలు మరణించినట్లు అంచనా. అయితే... దీనికి ప్రతీకారంగా ఇజ్రాయెల్ చేస్తున్న మారణహోమంలో ఈ ఏడాది జనవరికే గాజాలో 70వేల మంది మరణించినట్లు ఒక స్వతంత్ర అధ్యయనం పేర్కొంది. వీళ్లంతా తుపాకులు పట్టిన ఉగ్రవాదులు కాదు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు, సామాన్యులే. 'యునిసెఫ్' అంచనా ప్రకారం... గాజా స్ట్రిప్‌లో 2023 అక్టోబరు నుంచి ఇప్పటిదాకా 50వేల మందికి పైగా పిల్లలు మరణించడమో, క్షతగాత్రులు కావడమో జరిగింది! వాళ్లు చేసిన పాపం ఏమిటి? ఇజ్రాయెల్ ఇప్పుడు దేన్నీ వదిలిపెట్టడంలేదు. ఆస్పత్రులు, పాఠశాలలు, సహాయ శిబిరాలు, ఆహార పంపిణీ కేంద్రాలు.... దేన్నీ, దేన్నీ వదిలిపెట్టడం లేదు. సంక్షుభిత గాజాకు బాహ్యప్రపంచం నుంచి సహాయం నిలిచిపోయింది. పాలస్తీనీయులను చంపేందుకు ఇజ్రాయెల్ ప్రత్యేకంగా బాంబులు, బుల్లెట్లు వాడక్కర్లేదు. ఆకలిదప్పులతో వాళ్లంతట వాళ్లే చనిపోతారు! ఇది ఆధునిక మానవ చరిత్రలో అత్యంత విషాదంగా నిలిచిపోతుంది!

2023 అక్టోబరు 7న హమాస్ చర్య ఇజ్రాయెల్‌పై యుద్ధ ప్రకటనే! కానీ... ఇజ్రాయెల్‌ను ఎదుర్కొనేందుకు హమాస్ సిద్ధపడే, సర్వసన్నద్ధమయ్యే ఈ యుద్ధానికి దిగిందా? ఇజ్రాయెల్‌తో పోల్చితే హమాస్ బలమెంత? సాయుధ సంపత్తిలో తన స్థానమేది? అంతర్జాతీయ స్థాయిలో అండగా ఉండేదెవరు? ఇవన్నీ ఆలోచించకుండానే హమాస్ యుద్ధ ప్రకటన చేసేసింది. పాలస్తీనాకు దౌత్యపరమైన మద్దతు ఇచ్చే దేశాలే తప్ప... యుద్ధంలో అండగా నిలిచే వారెవరూ లేరు. 'సేవ్ పాలస్తీనా' నినాదాలు... అంతర్జాతీయంగా పాలస్తీనీయులకు సంఘీభావంగా జరిగే నిరసన ప్రదర్శనలు, సోషల్ మీడియా పోస్టులతో గాజాలోని సామాన్యులకు ఒరిగేదేమీ లేదు. శత్రువు బలాన్ని అంచనా వేయకుండా మీసంమెలేసి తొడగొట్టడం, రాళ్లేసి రెచ్చగొట్టడం... స్వీయహాని చేసుకోవడమే! తప్పొప్పుల సంగతి పక్కనపెడితే... ఇలాంటి విషయాల్లో లౌక్యమూ, సంసిద్ధతా అవసరమే. హమాస్ దూకుడు వల్ల ఆ సంస్థకు జరిగిన నష్టమెంతో కానీ... 'గాజా' మాత్రం ధ్వంసమైపోయింది. పాలస్తీనా ప్రజల ప్రాణాలను పణంగా పెట్టే హక్కు హమాస్‌కు లేదు. హమాస్‌ను నిర్మూలించే పేరుతో సామాన్యులను బలి తీసుకునే అధికారం ఇజ్రాయెల్‌కూ లేదు. కనికరమన్నది లేని ఇజ్రాయెల్ పాలకుడు సంపూర్ణ నాశనం చేసేదాకా వదిలిపెట్టేలా లేడు! ప్రపంచ దేశాలు పట్టించుకోవడం లేదు. ఐక్యరాజ్యసమితి మాటకు విలువ లేదు. మరి... ఈ వినాశనం ఆగేదెన్నడు? ఆపేదెవ్వరు? తప్పు ఎవరిది?

● తొమ్మండ్రు సురేష్‌కుమార్

జైపాల్ బాటలో రాహుల్, రేవంత్!



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మహాత్మా గాంధీ ఆకాశవాణిలో ప్రజల నుద్దేశించి చేసిన ప్రసంగానికి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 1997 నవంబర్ 12న అప్పటి సమాచార ప్రసార శాఖ మంత్రి జైపాల్‌రెడ్డి ఢిల్లీలోని బ్రాడ్ కాస్టింగ్ హౌజ్‌లో ఒక అద్భుతమైన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రెండు ఫలకాలను జైపాల్‌రెడ్డి తాను ఆవిష్కరించకుండా వాటిని బ్రాడ్ కాస్టింగ్ హౌజ్‌లో పని చేస్తున్న అట్టడుగున ఉన్న ఇద్దరు సఫాయి కార్మికులతో ఆవిష్కరింపజేశారు. జైపాల్ ఏ దృక్కోణంతో ఆలోచిస్తారో చెప్పేందుకు ఈ సంఘటన ఒక ఉదాహరణ. తనను తాను మండల్ వాదినని చెప్పుకునే జైపాల్‌రెడ్డి సమాజంలో వెనుకబడిన వర్గాలకు సామాజిక న్యాయం గురించి తరుచూ మాట్లాడేవారు. 1990 అక్టోబర్ 1న రాజ్యసభలో జైపాల్ చేసిన చరిత్రాత్మక ప్రసంగంలో వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ కల్పించడాన్ని సమర్థిస్తూ బలంగా వాదించారు. 1956లో కాకా కాలేకర్ కమిషన్ నివేదికను కాంగ్రెస్ తిరస్కరించిన విషయాన్ని ఎత్తి చూపిన జైపాల్ ఓబీసీలకు కేవలం 4 శాతం మాత్రమే ఉద్యోగాలు లభిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. కాంగ్రెస్ సామాజిక న్యాయ పంథాను వీడినందువల్లే బీజేపీ ఎదుగుదల జరుగుతోందని ఆయన చివరి రోజుల్లో వాపోయేవారు. 'కులం ఒక సామాజిక వాస్తవం' అని చెప్పేవారు. 'నేను రెడ్డి అయినందువల్ల చాలా లాభాలు పొందాను. నేను కులానికి దూరం కావాలనుకున్నా కులం నన్ను వదిలిపెట్టలేదు' అని ఆయన మరణించడానికి ఏడాది ముందు ఏబీఎన్‌లో నిర్వహించిన 'ఓపెన్ హార్ట్ విత్ ఆర్కె' కార్యక్రమంలో నిజాయితీగా అంగీకరించారు.

ఏ ఆలోచనా విధానాన్ని జైపాల్‌రెడ్డి ప్రతిపాదించారో అదే ఆలోచనా విధానాన్ని ఇవాళ కాంగ్రెస్ అందుకునేందుకు ప్రయత్నం చేస్తోంది. జైపాల్‌రెడ్డిని మేధావిగా పరిగణించిన రాహుల్ తరచు ఆయనతో పలు అంశాలపై చర్చలు జరిపేవారు. అయితే జైపాల్ ఆలోచనల్ని ఆయన అమలులో పెట్టలేదు. తాజాగా రాహుల్ అన్నమాటల్ని వింటుంటే తనను తాను ఆత్మావలోకనం చేసుకుంటున్నట్లు అర్థమవుతోంది. 'ఓబీసీలు ఎదుర్కొంటున్న సవాళ్లను అర్థం చేసుకోవడంలోనూ, వారికోసం చేపట్టాల్సిన చర్యలను గ్రహించడంలోనూ కాంగ్రెస్ విఫలమైనట్లు నాకు అనిపిస్తోంది. ఓబీసీలకు సానుకూలంగా ప్రతిస్పందించకపోవడం వల్లే బీజేపీకి అవకాశం కల్పించామని భావిస్తున్నాను..' అని రాహుల్ కాంగ్రెస్ కేంద్ర కార్యాలయంలో పార్టీ ఎంపీలనుద్దేశించి మాట్లాడుతూ అన్నారు. తెలంగాణలో జరిపిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వేపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రజంటేషన్ తర్వాత రాహుల్ ఈ ప్రసంగం చేశారు. ఏ జైపాల్‌రెడ్డి చేసిన ఆలోచనలను అర్థం చేసుకోవడంలో కాంగ్రెస్ విఫలమైందో అదే జైపాల్‌రెడ్డి స్ఫూర్తిని ఆయనకు అత్యంత సమీప బంధువైన రేవంత్‌రెడ్డి కార్యరూపంలో పెట్టేందుకు రాహుల్ పూర్తి ప్రోత్సాహం ఇవ్వడమే కాక తెలంగాణ నమూనానే దేశానికి ఆదర్శంగా ప్రకటించడం ఒక కీలక పరిణామంగా భావించవచ్చు. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే తన స్వంత కులం వారు మెచ్చరని తెలిసినా రేవంత్‌రెడ్డి తన అంచనాలను అధిగమించి కులగణనను శాస్త్రీయంగా, అర్థవంతంగా జరిపించారని రాహుల్ ప్రశంసించారు.

జైపాల్ సూచనలు తనలో మెదులుతున్నాయేమో రాహుల్ గత ఒకటి రెండేళ్లుగా అంతర్మథనం చేసుకుంటున్నట్లు కనపడుతోంది. ఈ ఏడాది జనవరిలో ఢిల్లీలో జరిగిన దళిత మేధావుల సదస్సులో ఆయన ప్రసంగిస్తూ 'దళితులు, వెనుకబడిన వర్గాలు, అత్యంత వెనుకబడిన వర్గాల విశ్వాసాన్ని కాంగ్రెస్ చూరగొని ఉంటే బీజేపీ ఎప్పుడూ అధికారంలోకి వచ్చి ఉండేది కాదు..' అని చెప్పారు. వెనుకబడిన, అట్టడుగున ఉన్నవారి ఆందోళనలను సమగ్రంగా అర్థం చేసుకుని నిర్మాణాత్మక పరిష్కారాలను సాధించి ఉంటే వారు తమకు దూరమయ్యేవారు కాదని రాహుల్ అభిప్రాయపడ్డారు.

నిజానికి భారతీయ జనతా పార్టీ ఎప్పుడూ కులాన్ని ఒక ప్రధానాంశంగా భావించలేదు. మండల్ కమిషన్ నివేదికను వీపీ సింగ్ వెలుగులోకి తీసుకువచ్చినప్పుడు దాని ప్రభావాన్ని హరించేలా చేసేందుకు అద్వాణీ నాయకత్వంలో బీజేపీ రథయాత్ర చేపట్టింది. వీపీ సింగ్ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్నది. 'మండల్ వర్సెస్ కమండల్' వివాదం ఆ రోజుల్లో అత్యంత ప్రాచుర్యం పొందింది. మండల్ రాజకీయాలు బిహార్‌లో సృష్టించిన కల్లోలం కుల సేనలను కూడా తయారు చేసి నెత్తురుటేర్లు పారించింది. సంబంధిత ఘటనలు చరిత్రలో నమోదయ్యాయి. మోదీ నాయకత్వంలో కూడా హిందూత్వనే బీజేపీ ప్రధానాంశంగా ముందుకు ప్రవేశపెట్టింది. యువత, పేదలు, మహిళలు, రైతులే అతిపెద్ద కులాలని, ఈ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తే దేశం అభివృద్ధి చెందుతుందని మోదీ పదే పదే తన ప్రసంగాల్లో ప్రకటించారు. కాంగ్రెస్ తప్పిదాల వల్ల ఆ పార్టీ ఓటు బ్యాంకును దాదాపు తన వైపు తిప్పుకోగలిగిన బీజేపీ కుల ప్రాతిపదికన ప్రజలను తమ వైపునకు తిప్పుకోవాల్సిన అవసరం లేదని భావించింది. కులాన్ని కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు మాత్రమే ఉపయోగించుకోవాలని, సంక్షేమ పథకాలు ప్రకటిస్తే చాలని భావించిన కాంగ్రెస్ పంథాను బీజేపీ కూడా అనుసరించింది.

రామజన్మభూమి ఉద్యమ సమయంలో బీజేపీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న గోవిందాచార్య మండల్ పార్టీలను ఎదుర్కోవాలంటే సామాజిక సమీకరణ తప్పదనే సిద్ధాంతీకరణ చేశారు. దాన్ని అమలు చేసి ఉత్తరప్రదేశ్‌లో తొలుత కల్యాణ్‌సింగ్ వంటి బీసీ నేతను ముఖ్యమంత్రిని చేసి అధికారంలోకి వచ్చిన బీజేపీ తర్వాత అగ్రవర్ణాలకే నాయకత్వాన్ని అప్పజెప్పింది. ఫలితంగా బీజేపీ క్రమంగా యూపీలో పట్టు కోల్పోయింది. మోదీ నాయకత్వంలో మళ్లీ బీజేపీ పుంజుకుని కేవలం అగ్రవర్ణాలను మాత్రమే కాక ఓబీసీల్లో అతి వెనుకబడిన వర్గాలను, ముఖ్యంగా యాదవేతరులను తన వైపునకు తిప్పుకుని సంఘటితం చేయగలిగింది. 2009 నుంచి 2019 మధ్య దేశ వ్యాప్తంగా బీజేపీ ఓబీసీ ఓట్లు 20 నుంచి 44 శాతం మేరకు పెరిగాయి. కాంగ్రెస్‌నే కాక అనేక రాష్ట్ర స్థాయి పార్టీలను బీజేపీ దెబ్బతీయగలిగింది.

ఈ పరిణామాల్ని గమనించినందువల్లే గత ఎన్నికల్లో సమాజ్‌వాది పార్టీ బీజేపీ కంటే ఎక్కువ మంది బీసీ, దళిత అభ్యర్థులను రంగంలోకి దించింది. యాదవేతర బీసీలకు అధిక సీట్లను కేటాయించింది. వెనుకబడిన, దళిత, అల్పసంఖ్యాక వర్గాల ఫార్ములాను అనుసరించి లోక్‌సభలో అధిక సీట్లను సాధించగలిగింది. 2024 ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా ఎన్డీఏ 4 శాతం ఓబీసీల మద్దతును కోల్పోతే ఇండియా కూటమి 11 శాతం ఎగువ స్థాయి ఓబీసీలు, 7 శాతం మరింత వెనుకబడిన ఓబీసీల మద్దతును సాధించగలిగింది.



తెలంగాణలో వలే దేశ వ్యాప్తంగా కులగణన నిర్వహించి ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా, ఉపాధి పరిస్థితులను ఆరాతీస్తే 78 ఏళ్ల స్వాతంత్ర్యం తర్వాత భారత ప్రజలు ఏ స్థాయిలో ఉన్నారో తేటతెల్లమవుతుంది. శాస్త్రీయంగా విధానాల రూపకల్పనకు అది విశేషంగా తోడ్పడుతుంది. భారత్‌ను నాల్గవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా చెప్పుతున్న పాలకులు మన ప్రజల వాస్తవ పరిస్థితిని వెల్లడించేందుకు సిద్ధంగా ఉన్నారా?

భారతీయ జనతా పార్టీని వరుసగా మూడు సార్వత్రిక ఎన్నికల్లో ఓడించలేకపోగా, వివిధ రాష్ట్రాల్లో అధికారం కోల్పోయిన కాంగ్రెస్‌కు ఓబీసీ ఓట్ల పుణ్యమా అని గత సార్వత్రిక ఎన్నికల్లో కొంత పుంజుకున్నది. ఇది ఆ పార్టీలో కొత్త ఆశల్ని చిగురింపచేసింది. అయినప్పటికీ హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పాత తప్పిదాల్నే చేసింది. భూపిందర్‌సింగ్ హుడా నాయకత్వంలో కేవలం జాట్ ఓట్ బ్యాంకు కాంగ్రెస్ మద్దతుగా ముందుకు వస్తే విస్తృత స్థాయిలో వివిధ కులాలను తన వైపునకు తిప్పుకోవడంలో కాంగ్రెస్ విఫలం కావడం ఆ పార్టీ ఓటమికి దారితీసింది. అదే సమయంలో జాట్‌కు సంబంధించని వారిని బీజేపీ తన వైపునకు తిప్పుకోగలగడం వల్ల ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించగలిగింది.

ప్రస్తుత పరిస్థితుల్లో సామాజిక న్యాయాన్ని ఎజెండాగా చేపట్టడం కన్నా కాంగ్రెస్‌కు మరో గత్యంతరం లేదు. 11 సంవత్సరాల బీజేపీ పాలనలో వివిధ వర్గాలకు సరైన న్యాయం జరగలేదని విమర్శిస్తున్న కాంగ్రెస్ అధికారంలోనూ, విద్యలోనూ, సంపదలోనూ వెనుకబడిన వర్గాలకు సరైన న్యాయం జరిగిందా లేదా తేల్చేందుకు శాస్త్రీయంగా కులగణన జరపాలన్న డిమాండ్‌కు ప్రాచుర్యం కల్పిస్తోంది. అంతే కాదు, ఈ కులగణన డేటా ఆధారంగా ప్రభుత్వ విధానాలను రూపొందించి, ఎవరి జనాభా ఎంత ఎక్కువ ఉంటుందో అంత భాగస్వామ్యం కల్పించాలనే నినాదం ఆధారంగా ప్రజల్లోకి ప్రవేశించాలని వ్యూహరచన చేస్తోంది. వెనుకబడిన వర్గాలకు సంబంధించి కేవలం నినాదాలు చేయడం మాత్రమే సరిపోదని, నిర్దిష్టమైన చర్యలను ప్రకటించాలని కాంగ్రెస్ గ్రహించింది.

కాంగ్రెస్ ఈ వ్యూహం ప్రజల్లో ఊపందుకుని మండల్ నాటి సామాజిక వాతావరణాన్ని కల్పించగలుగుతుందా? లోహియా రాజకీయాల ఆధారంగా వెలుగులోకి వచ్చిన వెనుకబడిన కులాలు మరో ప్రభంజనాన్ని రేకెత్తించగలుగుతాయా? బీజేపీ ఈ పరిణామాన్ని చూస్తూ ఊరుకుంటుందా? 2026లో జరిగే జనగణనలో భాగంగా కులగణన జరిపించాలని బీజేపీ కూడా నిర్ణయించింది. ఈ ఏడాది బిహార్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మాత్రమే బీజేపీ ఈ నిర్ణయం తీసుకుందా? 2020 బిహార్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి నితీశ్ నాయకత్వంలో కూడా 10 శాతం ఓబీసీ మద్దతును కోల్పోయింది. బిహార్‌లో నితీశ్‌కుమార్ కూడా కులగణన జరిపించిన తర్వాత వాస్తవాలను గ్రహించి బిహార్‌లో రిజర్వేషన్ పరిమితిని 65 శాతానికి పెంచారు. సుప్రీంకోర్టు ఈ నిర్ణయాన్ని సహజంగానే కొట్టివేసినప్పటికీ వెనుకబడిన కులాల ప్రాధాన్యాన్ని బీజేపీ, జేడీ(యు) గ్రహించినట్లే కనిపిస్తోంది. నవంబర్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ కులాలు ఎటువైపు వెళతాయన్నదానిపై దేశ రాజకీయ పరిణామాలను అంచనా వేసేందుకు ఆస్కారం ఉన్నది.

నిజానికి తెలంగాణలో మాదిరి దేశవ్యాప్తంగా విస్తృత స్థాయిలో కులగణన నిర్వహించి ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా, ఉపాధి పరిస్థితులను కూడా ఆరాతీస్తే ఈ దేశంలో ప్రజలు స్వాతంత్ర్యం వచ్చిన 78 సంవత్సరాల తర్వాత కూడా ఏ స్థాయిలో ఉన్నారో ఖచ్చితంగా తేలేందుకు అవకాశాలు ఉన్నాయి. తద్వారా విధానాల రూపకల్పన కూడా శాస్త్రీయంగా చేసేందుకు తోడ్పడుతుంది. భారత్‌ను నాల్గవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా చెప్పుకుంటున్న మన నేతలు మన ప్రజల వాస్తవ పరిస్థితిని వెల్లడించేందుకు సిద్ధంగా ఉన్నారా?

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

పోడు హక్కుల గోడు తీరేదెన్నడు?

వానాకాలం మొదలైందంటే చాలు, ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు, అటవీ అధికారుల మధ్య తరచూ వివాదాలు తలెత్తుతుంటాయి. దశాబ్దాలుగా ఇదే పరిస్థితి. ఇటీవల ములుగు జిల్లాలోని రొయ్యూరులో గిరిజనుల గుడిసెల తొలగింపు, భద్రాద్రి జిల్లా ఇరవెండి గ్రామంలో పోడు సాగు చేస్తున్న మహిళా రైతులపై దాడి వంటి ఘటనలు ఎన్నో. అసలు ఈ పోడు భూముల సమస్యలకు పరిష్కారం లేదా? పోడు హక్కుల చట్టం ఏం చెబుతోంది?

గిరిజనులకు అడవిపై ఉన్న హక్కులను గుర్తిస్తూ 'అటవీ హక్కుల చట్టం 2006'ను కేంద్రం రూపొందించింది. అటవీ భూముల్లో నివాసం, సాగు, పోడు భూములకు హక్కు పత్రాలు పొందడం వంటి పలు రకాల హక్కులను గిరిజనులకు ఈ చట్టం కల్పించింది. భూ హక్కు పత్రం పొందడానికి సంబంధించి '2005 నాటికి ఆ భూముల్లో కనీసం మూడు తరాలుగా (75 ఏళ్లుగా) ఆ గిరిజనులు పోడు సాగు చేస్తూ ఉండాలి. ఆ భూమి కూడా పదెకరాల లోపే ఉండాలి' అనే నిబంధనలు ఉన్నాయి. ఈ నిబంధనలకు విరుద్ధంగా సాగు చేసే వారిపై అటవీ పోలీసు అధికారులు కేసులు నమోదు చేస్తారు. భూమి హక్కు పత్రం పొందినవారు ఆ భూమిని వారసత్వంగానే అనుభవించాలి తప్ప ఎటువంటి భూ బదలాయింపులు చేయకూడదు.

పోడు భూముల హక్కుల గుర్తింపు విషయంలో అనేక సమస్యలు ఉన్నాయి. గతంలో పోడు రైతులకు క్లైమ్ నెంబర్లు, భూమి పట్టాలు ఇచ్చినా, హక్కు పత్రాలు మాత్రం ఇవ్వలేదు. దీంతో అలాంటి భూములను ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకుని, ఆయా ప్రదేశాల్లో మొక్కలు నాటుతున్నారు. భూమి ఒకచోట ఉంటే మరోచోట సర్వే నెంబర్లు చూపించడం, వేర్వేరు చోట్ల భూములు ఉన్నట్లు చూపించడం (భూమి ఒకచోట ఉంటేనే సర్వే చేయాలనే నిబంధన ఉంది) వంటి సమస్యలున్నాయి. కొందరు పోడు రైతులకు భూ హక్కు పత్రాలు ఇచ్చినా టైగర్ జోన్లు, కోల్ ప్రాజెక్టు, ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో ఆ భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంది. అలా భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి. పోడు భూముల వివాదాల్లో గిరిజనులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి. పోడు రైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వాలి. పోడు భూములు చేతులు మారకుండా చూడాలి. పోడు భూముల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించాలి.

– వాసం ఆనంద్ కుమార్

బీఈడీ అభ్యర్థులకు అనాదిగా అన్యాయం

'దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మితమవుతుంది' అని కొఠారి కమిషన్ చెప్పింది. కానీ ప్రస్తుత ప్రభుత్వం, విద్యాశాఖ అనుసరిస్తున్న విధానంతో అటు విద్యార్థుల, ఇటు బీఈడీ అభ్యర్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. డీఈడీ కోర్సు పూర్తి చేసి, డీఎస్సీ ద్వారా ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి కొన్నేళ్లకు ప్రభుత్వం ప్రమోషన్లు కల్పిస్తోంది. వారిని ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు (ఎస్‌ఏ)గా నియమిస్తోంది. మొత్తం పోస్టుల్లో ఈ ప్రమోషన్ల నియామకాలు ఏ పదో, ఇరవై శాతమో అయితే పర్వాలేదు. కానీ ఏకంగా డెబ్బై శాతం పోస్టులను ప్రమోషన్ల ద్వారానే పాఠశాల విద్యాశాఖ భర్తీ చేస్తోంది. తద్వారా ఉన్నత పాఠశాలల్లో నేరుగా భర్తీ అయ్యే ఎస్‌ఏ పోస్టుల సంఖ్య భారీగా పడిపోతోంది. దీంతో బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులకు ప్రతి డీఎస్సీలోనూ నిరాశే మిగులుతోంది. టెట్ వంటి ఉపాధ్యాయ అర్హత పరీక్షల్లో 90శాతం మార్కులు సాధించినా ఫలితం ఉండడం లేదు.



1998కి ముందు వరకు ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయ ఖాళీల్లో సగం పోస్టులు డీఎస్సీతో నేరుగానూ, మిగతా సగం పోస్టులు ఎస్జీటీ (సెకెండరీ గ్రేడ్ టీచర్)లకు ఎస్‌ఏలుగా ఉద్యోగోన్నతి కల్పించడం ద్వారానూ భర్తీ చేసేవారు. అలాగే డీఎస్సీలో బీఈడీ అభ్యర్థులకు ఎస్జీటీ రాసుకునే అవకాశం కూడా ఉండేది. కానీ రాజకీయలబ్ధి కోసం నాటి నేతలు 1999లో జీవో–108, జీవో–505 (సవరణ) ద్వారా స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ప్రత్యక్ష నియామకాల ద్వారా 30 శాతం, ఎస్జీటీలకు ప్రమోషన్లు కల్పించడం ద్వారా 70శాతం భర్తీ చేయాలని నిర్ణయించారు. ఇది బీఈడీ అభ్యర్థుల పాలిట శాపంగా పరిణమించింది.

డీఎస్సీలో ఎస్జీటీ పోస్టులకు పోటీపడే విషయంలోనూ మా బీఈడీ అభ్యర్థులకు అన్యాయమే జరుగుతోంది. ప్రాథమిక పాఠశాలల్లోని ఎస్జీటీ పోస్టులకు బీఈడీ అభ్యర్థులు అనర్హులంటూ 2011లో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. దీంతో బీఈడీ అభ్యర్థులు ఎస్జీటీ రాసుకునే అవకాశం కోల్పోయారు. కానీ 2018లో సుప్రీం మరొక తీర్పులో.. బీఈడీ అభ్యర్థులు ఎస్జీటీ రాసుకోవచ్చని, కానీ ఉద్యోగానికి ఎంపికైతే మాత్రం ఆరు నెలల బ్రిడ్జి కోర్సు చేయాలని తెలిపింది. 2023లో రాజస్థాన్‌లో డీఈడీ అభ్యర్థులు సుప్రీంను ఆశ్రయించగా... బీఈడీ అభ్యర్థులు డీఎస్సీలో ఎస్జీటీ పరీక్ష రాసే అవకాశాన్ని తొలగిస్తున్నట్లు సర్వోన్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. దీంతో అటు నేరుగా పోస్టులు లేక, ఇటు ఎస్జీటీ రాసుకునే వెసులుబాటు లేకపోవడంతో బీఈడీ అభ్యర్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. కేరళ రాష్ట్రంలో ఈ పరిస్థితి లేదు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులను 25 శాతం ప్రమోషన్లతోనూ, 75 శాతం నేరుగానూ అక్కడి ప్రభుత్వం భర్తీ చేస్తోంది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే కేంద్రీయ విద్యాలయాల్లోనూ 66.66 శాతం ప్రత్యక్షంగా (పరీక్షల ద్వారా), 33.33 శాతం ప్రమోషన్ల ద్వారా ఉపాధ్యాయ నియామకాలు చేపడుతున్న విషయం రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలి.

మా న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత ఏడాది ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించాం. హైకోర్టును ఆశ్రయించాం. విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, విద్యా కమిషన్ ఛైర్మన్లతో పాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులకు ఎన్నోసార్లు వినతిపత్రాలు అందజేసినా స్పందన లేదు. దీంతో మా ఉద్యమాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించాం. ఈ సందర్భంగా బీఈడీ అభ్యర్థుల ప్రధానమైన డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచుతున్నాం. ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులను 80 శాతం నేరుగా, 20 శాతం మాత్రమే ప్రమోషన్లతో భర్తీ చేయాలి. ప్రభుత్వ గురుకుల (జేఎల్, పీజీటీ, టీజీటీ), మోడల్ స్కూల్ (పీజీటీ, టీజీటీ), పీడీ, పీఈటీ వంటి ఉపాధ్యాయ ఖాళీలను నేరుగా ఒకే డీఎస్సీలో భర్తీ చేయాలి. 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలి.

మా డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 3 నుంచి 7 వరకు యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి హైదరాబాద్‌లోని SCERT (విద్యా కమిషన్) కార్యాలయం వరకూ పాదయాత్ర నిర్వహించబోతున్నాం. ఈ యాత్రకు బీఈడీ అభ్యర్థులంతా కదలిరావాలి. ఈ ర్యాలీ అనంతరం కూడా ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయడానికి సిద్ధంగా ఉన్నాం. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మా న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి.

■ కోటగిరి కిరణ్‌కుమార్
బీఈడీ అభ్యర్థుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

సాగులో నయా పద్ధతులు అవసరం

స్వాతంత్ర్యానంతర తొలినాళ్లలో దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి తక్కువగా ఉండేది. నాటి సంప్రదాయ వ్యవసాయం వల్ల రైతులు ఆరుగాలం కష్టపడి పండించినా పట్టుమని పది బస్తాల ధాన్యం కూడా ఇంటికొచ్చేది కాదు. అప్పటి వంగడాలు తక్కువ దిగుబడినిస్తూ, చీడపీడలను తట్టుకునే స్వభావం చాలా తక్కువగా ఉండి, ఎక్కువ ఎత్తు పెరిగేవి. దాంతో పంట కోత సమయంలో గింజలు పొలంలోనే రాలిపోయి అన్నదాతలకు కన్నీళ్లను మిగిల్చేవి. దాంతో 'షిప్ టు మౌత్', 'బెగ్గింగ్ బౌల్' వంటి హేళనలను నాటి భారతం ఎదుర్కోవాల్సి వచ్చింది. అనంతర కాలంలో చేపట్టిన హరిత విప్లవం చాలా వరకూ సత్ఫలితాలనిచ్చింది. కానీ కొత్త వంగడాల రాకను ఆహ్వానిస్తూనే, పాత దేశవాళీ వంగడాలను కాపాడుకునే ప్రయత్నం నాటి వ్యవసాయాధికారులు చేయలేదు. నేడు ప్రపంచంలోని పలు దేశాలు వ్యవసాయరంగంలో అనేక వినూత్న పద్ధతులను అవలంబిస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నాయి. 'ఫుకోక నేచురల్ ఫార్మింగ్, పెర్మాకల్చర్, సిన్ట్రోపిక్ ఫార్మింగ్, కొరియన్ నేచురల్ ఫార్మింగ్, జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్, హోలిస్టిక్ మేనేజ్‌మెంట్ నేచురల్ సీక్వెన్స్ ఫార్మింగ్, బయోడైనమిక్ ఫార్మింగ్, రీజెనెరేటివ్ అగ్రికల్చర్..' మొదలైన సేంద్రియ వ్యవసాయ ప్రధాన పద్ధతులను పలు దేశాలు అనుసరిస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నాయి. మనదేశ వ్యవసాయ పద్ధతుల్లోనూ మార్పు రావాలి. 2024లో భారత దేశం 59.75 లక్షల హెక్టార్లలో సమర్థవంతంగా సేంద్రియ వ్యవసాయాన్ని చేయగలిగిందని ఐఎఫ్ఓఏఎం గణాంకాలు చెబుతున్నాయి. దీన్ని ఇంకా పెంచుకుంటూ.. నూతన పద్ధతుల్లో దేశవాళీ వంగడాల సాగును ప్రోత్సహించాలి. రసాయన మందుల పిచికారీని వీలైనంత మేర తగ్గించాలి. సీడ్ బాల్స్‌ను వాడడం, సేంద్రియ ఆధారిత వ్యవసాయం, నేచురల్ ఫార్మింగ్‌కు ప్రభుత్వం పెద్దపీట వేయాలి.

– బొంతా విద్యాధర్
పీజేటీఏయూ, వరంగల్

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
బుధవారం 30 జూలై 2025


తేజస్విని(ఫైల్)

చిన్నారిని చిదిమేసిన స్కూల్ బస్సు

- అన్నయ్యను బడికి పంపేందుకు తల్లితో కలిసి వెళ్లి దుర్మరణం
- భూపాలపల్లి జిల్లాలో ఘటన

6

పాహిమాం నాగేంద్ర

ఘనంగా నాగుల పంచమి వేడుకలు


హనుమకొండ పబ్లిక్ గార్డెన్ వద్ద పుట్టలో పాలు పోస్తున్న మహిళలు

హనుమకొండ కల్చరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర శ్రావణమాస వేళ మంగళవారం నాగుల పంచమిని మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నగరంలో ప్రధానంగా ఉర్సు సుభాష్‌నగర్‌లోని నాగమయ్య ఆలయంతోపాటు ప్రసిద్ధ భద్రకాళి, వేయిస్తంభాల ఆలయం, నాగుల వీధి తదితర ప్రాంతాలకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నాగేంద్రుడికి పాలుపోసి నీరాజనాలు అర్పించారు. హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయంలో ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో నాట్యమండపంలో శ్రీవల్లీ దేవసేన సహిత సుబ్రమణ్యేశ్వరస్వామి ప్రతిష్ఠింపజేసి పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని పుట్టల్లో పాలుపోసి రుద్రేశ్వరుడిని దర్శించుకున్నారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్, ఎక్సైజ్ కాలనీవెంకటేశ్వర ఆలయం, అంబేద్కర్ సమీపంలోని సీతారామాంజనేయస్వామి ఆలయం, రాజరాజేశ్వరీ ఆలయంలో, రాగన్నదర్వాజలోని నాగుల గుడి తదితర ప్రాంతాల్లోనూ మహిళలు నాగేంద్రుడికి పాలుపోసి మొక్కులు చెల్లించుకున్నారు.

కొత్తకొండకు కొత్త కళ



త్రిశూలం, ఢమరుకం, నంది విగ్రహం, ఫౌంటేన్ ఏర్పాటు

భీమదేవరపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయానికి కొత్త కళ రానుంది. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయ ప్రాంతంలో త్రిశూల చౌరస్తాకు శ్రీకారం చుట్టారు. ఇందు కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ సొంతంగా రూ. 25 లక్షల నిధులు కేటాయిస్తూ మంగళవారం భూమి పూజ చేశారు. శివుడి ఆయుధమైన త్రిశూలం, ప్రజలను మేలు కోల్పే ఢమరుకం, శివుడి వాహనమైన నంది విగ్రహాలతో త్రిశూల చౌరస్తాను ఏర్పాటు చేయనున్నారు. వీరభద్రస్వామి ఆలయానికి స్వాగతం పలికే కమాన్ ఎదురుగా ఈ త్రిశూల చౌరస్తాను ఏర్పాటు చేయనున్నారు. సుమారు 16 ఫీట్ల వెడల్పు, 22 ఫీట్ల ఎత్తుతో త్రిశూల చౌరస్తా ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇందు కోసం దాదాపుగా రూ. 25 లక్షలను మంత్రి పొన్నం ప్రభాకర్ సొంత నిధులను కేటాయించనున్నారు. మధ్యలో త్రిశూలం, త్రిశూలం పైనా ఢమరుకం, కింద నాలుగు వైపులా నాలుగు నంది విగ్రహాలు, పైనా ఓంకారం రానుంది. నాలుగు వైపులా ఫౌంటేన్‌తో నీరు 24 గంటలు పోసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.


వరంగల్ లేబర్‌కాలనీ సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

'చేయూత' పింఛన్‌ను పెంచాలి

- ఎన్నికల వేళ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి
- లేదంటే ఆగస్టు 13న పింఛన్‌దారులతో గర్జనసభ
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

6


నకిలీ పత్రాల ముఠా ఆటకట్టు


నకిలీ కార్డులను పరిశీలిస్తున్న డీసీపీ సలీమా

- ఆర్‌సి, ఇన్సూరెన్స్ బోగస్ పత్రాలను వాహనదారులకు అంటగట్టి లక్షల్లో దోపిడీ
- 15 మంది అరెస్టు... పరారీలో ఐదుగురు..
- నిందితుల్లో ఆర్‌టీఏ ఏజెంట్లు, వాహన కన్సల్టెన్సీల నిర్వాహకులు
- ఆర్‌టీఏ అధికారుల పాత్రపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల ఆరా
- వివరాలు వెల్లడించిన సెంట్రల్ డీసీపీ షేక్ సలీమా

6

అంగట్లో అమ్మతనం



వ్యాపారంగా మారిన 'సంతాన సాఫల్య' వైద్యం

- నిబంధనలు పట్టని గైనకాలజిస్టులు, కార్పొరేట్ ఆస్పత్రులు
- అక్రమ మార్గంలో వీర్యం, అండాల సేకరణ
- అమాయక గ్రామీణ మహిళలు, విద్యార్థులకు ఎర
- రికార్డులు, డేటాను నేషనల్ రిజిస్ట్రీకి పంపించని వైనం
- వీర్యదాతలకు రూ. వెయ్యి నుంచి 3వేల వరకు..
- అండదాతలకు రూ.30 వేల నుంచి రూ.40వేల వరకు చెల్లింపు
- ఆర్‌ఎంపీ, ఆస్పత్రుల పీఆర్‌వోల నెట్‌వర్క్ దందా
- సంతాన సాఫల్యం కోసం వచ్చే వారి నుంచి లక్షలు దండుకుంటున్న ఆస్పత్రులు
- పర్యవేక్షణ, తనిఖీలు పట్టని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు

వరంగల్ మెడికల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లాకు మెడికల్ హబ్‌గా కొనసాగుతున్న వరంగల్ నగరంలో అమ్మతనం అమ్ముడుపోతోంది. నగరంలో డోనర్ బ్యాంకుల ద్వారా యేటా వందల మంది సంతానప్రాప్తి పొందుతున్నట్లు తెలుస్తోంది. ఈ దందా కాసులు కురిపిస్తుండడంతో పలు గైనిక్ ఆస్పత్రులు కూడా ఫెర్టిలిటీ సెంటర్లుగా అవతారం ఎత్తుతున్నాయి. నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న సంతాన సాఫల్య కేంద్రాలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. వయసు దాటాక వివాహం చేసుకోవడం, మానసిక ఒత్తిడి, శారీరక లోపంతో కొందరు స్త్రీలలో అండాలు, పురుషుల్లో వీర్యకణాల ఉత్పత్తి తగ్గిపోతోంది. ఫలితంగా సంతానలేమి సమస్య ఉత్పన్నమవుతోంది. దీంతో మాతృత్వం కోసం గైనకాలజిస్టులను సంప్రదిస్తున్నారు. దీన్ని అదనుగా తీసుకున్న కొందరు గైనిక్ వైద్యులు అక్రమ మార్గంలో కాసుల పంట పండించుకుంటున్నారు. చట్ట ప్రకారం వీర్యం, అండ దాతల రికార్డులు, డేటాను నమోదు చేసి నేషనల్ రిజిస్ట్రీకి పంపించాల్సి ఉంటుంది. కానీ ఈ నిబంధనలు పాటించకుండా నగరంలో కొందరు గైనకాలజిస్టులు అక్రమ మార్గంలో వీర్యం, అండాలను సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం దళారుల ద్వారా విద్యార్థులకు ఎర వేస్తున్నారు. రూ. 1000 నుంచి రూ. 3 వేల వరకు వీర్యం కోసం చెల్లిస్తున్నారు. ఒక్కొక్క విద్యార్థి నెలలో ఐదుసార్లు వీర్యం ఇచ్చే విధంగా ఒప్పందాలు కూడా చేసుకుంటున్నట్లు సమాచారం. అదేవిధంగా అండం కోసం మహిళలకు రూ. 30 నుంచి రూ.40 వేలు చెల్లిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఒకరి వీర్యాన్ని మరొకరికి అందించాలంటే భార్యాభర్తలకు విధిగా చెప్పాల్సి ఉంటుంది. కానీ ఈ వివరాలేమీ చెప్పడం లేదని తెలుస్తోంది.

డోనర్ బ్యాంకుల్లో నిబంధనలు గాలికి..

చట్ట ప్రకారం సేకరించిన వీర్యాన్ని ఆరునెలలపాటు నిల్వ చేసి ఆ తరువాత తలసేమియా వైరల్ మార్క్‌తోపాటు 18 రకాల స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాల్సి (మిగతా 8లో...)

గైనకాలజిస్టుల ఇష్టారాజ్యం..

గైనిక్ విభాగంలో డిప్లొమా గానీ ఫెలోషిప్ గాని చేసిన వారు మాత్రమే ఇన్‌ఫెర్టిలిటీ సేవలు అందించేందుకు అర్హులని సీనియర్ వైద్యులు చెబుతున్నారు. కానీ కొందరు గైనకాలజిస్టులు నిబంధనలకు విరుద్ధంగా స్టిములైజేషన్ ఇంజక్షన్లు మహిళలకు ఇచ్చి అండం విడుదలయ్యే వరకు చూసి రూ. 2 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆ తరువాత సంతాన సాఫల్య కేంద్రాలకు పంపుతున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి మహిళలకు అక్కడి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. మహిళ అండాన్ని తీసి భర్త వీర్యంతో చికిత్స అందించాల్సి ఉంటుంది. ఇందుకు దంపతుల అనుమతి తప్పనిసరి. ప్రతీ అంశాన్ని రికార్డుచేసి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయానికి పంపాల్సి ఉంటుంది.

అంతా మాయ..

వీర్యకణాలు, అండాలు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి కూడా తరలిస్తున్నట్లు సమాచారం. అండాల చికిత్స అందేందుకు రూ. 2 లక్షల వరకు కార్పొరేట్ ఆస్పత్రుల వారు వసూలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. కొందరు ఆర్‌ఎంపీలు, పీఆర్‌వోలు గ్రామీణ మహిళలకు పది రోజులపాటు స్టిములైజేషన్ ఇంజక్షన్ ఇచ్చి అండాలు విడుదలయ్యే విధంగా ప్రోత్సహిస్తున్నట్లు సమాచారం. ఇలాంటి మహిళలను హైదరాబాద్‌కు తరలించి అండాలు తీసి భద్రపరుస్తూ రూ. 2 లక్షలకు అమ్ముకుంటున్నట్లు తెలుస్తుంది.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం..

డాక్టర్ ఎ.అప్పయ్య, హనుమకొండ డీఎంహెచ్‌వో



సంతాన సాఫల్య కేంద్రాల అనుమతులు కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జారీ చేస్తారు. చట్టం ప్రకారం వాటిని తనిఖీ చేసే బాధ్యత జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు ఉంది. ఎవరైనా బాధితులు ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. అదే విధంగా ఐయూఐ, ఐవీఎఫ్, సరోగసి ప్రొసీజర్ల వివరాలు ప్రతీ మూడు నెలలు లేదా ఆరు నెలలకు ఒకసారి నివేదికల రూపంలో పంపాల్సి ఉంటుంది. ఇలా పంపిన నివేదికలను కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ కార్యాలయంతో పాటు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమగ్రంగా పరిశీలిస్తుంది.

మీనాక్షి 'చేతి'కి జాబితా

- కాంగ్రెస్‌లో సంస్థాగత పదవులపై క్షేత్రస్థాయి కసరత్తు పూర్తి
- గ్రామ స్థాయి నుంచి జిల్లా కమిటీల వరకు ప్రతిపాదనలు
- కమిటీలు, డైరెక్టర్ పోస్టులకు పూర్తయిన ఎంపికలు
- స్థానిక సంస్థల ఎన్నికల తదుపరి అధికారిక ప్రకటన
- మీనాక్షి నటరాజన్‌తో డీసీసీల అధ్యక్షుల సమావేశం

హనుమకొండ సిటీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణం కసరత్తు నిర్మాణం పూర్తయ్యింది. గ్రామ నుంచి జిల్లా కమిటీల నిర్మాణ ప్రతిపాదనలను డీసీసీల అధ్యక్షులు పూర్తి చేశారు. నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియలో భాగంగా డైరెక్టర్ పోస్టుల ఎంపిక కూడా పూర్తి చేశారు. రెండింటి ప్రతిపాదనల జాబితాను తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ చేతికి అప్పగించారు. మంగళవారం హైదరాబాద్‌లో మీనాక్షి నటరాజన్, మహేశ్‌కుమార్‌గౌడ్‌తో ఉమ్మడి వరంగల్ డీసీసీల అధ్యక్షులు నాయిని రాజేందర్ రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ, భరత్‌చంద్రారెడ్డి, (మిగతా 6లో...)


మీనాక్షి నటరాజన్, మహేశ్‌కుమార్‌గౌడ్‌తో డీసీసీల అధ్యక్షులు, ఇన్‌చార్జులు తదితరులు

రేపటి నుంచి పోలీస్ డ్యూటీ మీట్

రాష్ట్ర వ్యాప్తంగా సుమారు వెయ్యి మంది అధికారులు, సిబ్బంది హాజరు

వరంగల్ క్రైం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31నుంచి ఆగస్టు 2వరకు మూడు రోజుల పాటు వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో మామునూర్ పోలీసు ట్రైనింగ్ సెంటర్ వేదికగా రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్- 2025 ను నిర్వహిస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. తెలంగాణలోని ఏడు జోన్లతో పాటు సైబరాబాద్, రాచకొండ, హైదరాబాద్ కమిషనరేట్ పోలీసులు, సీఐడీ, ఇంటెలిజెన్స్, యాంటీ నార్కోటిక్ బ్యూరో, సైబర్ సెక్యూరిటీ వింగ్, జీఆర్‌పీ ఐటీ, ఆక్టోపస్, గ్రేహౌండ్స్ విభాగాలకు చెందిన సుమారు వెయ్యికి పైగా పోలీస్ అధికారులు, సిబ్బంది 25 విభాగాల్లో పోటీ పడనున్నట్లు తెలిపారు. 31 వ తేదీ ఉదయం 9 గంటలకు రాష్ట్ర స్థాయి పోలీస్ ఉన్నతాధికారి చేతుల మీదుగా డ్యూటీ మీట్‌ను ప్రారంభించడం జరుగుతుందని, 2వ తేదీన ముగింపు సందర్భంగా ముఖ్య అతిధుల చేతుల మీదుగా విజేతలకు పతకాలతో పాటు చాంపియన్ షిప్ ట్రోఫీలను అందజేయడం జరుగుతుందని సీపీ తెలిపారు.

లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం డీఎంహెచ్‌వో మల్లికార్జునరావు ఆధ్వర్యంలో లింగనిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య అధికారులు స్కానింగ్ సెంటర్లపై పర్యవేక్షణ చేయాలని, పోలీసు అధికారులు నిఘా పెంచాలన్నారు. ఆయుర్వేదిక్ మందుల విక్రయాలలో వైద్యులు ఉండాలని, అనుమతి పొందాలన్నారు. గైనకాలజిస్టు, రేడియాలజిస్టు వైద్యులు స్కానింగ్ సెంటర్లలో విధులు నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్కరికీ ఒక రిపోర్టు ఫారం-ఎఫ్ ద్వారా ప్రతి నెల 5న అందజేయాలన్నారు. స్కానింగ్ వివరాలను నివేదికలను ఆన్‌లైన్ చేయాలన్నారు. సమావేశంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఎంసీహెచ్ ప్రాజెక్టు అధికారి అశోక్, టీబీ ప్రాజెక్టు అధికారి కమలహాసన్ పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ బస్సుల విస్తరణకు సహకరించాలి

కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన ఎంపీ కడియం కావ్య

హనుమకొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎలక్ట్రికల్ బస్సుల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య కోరారు. పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద తెలంగాణ రాష్ట్రానికి 2,800 ఎలక్ట్రికల్ బస్సులు మంజూరు ప్రతిపాదనను ఆమోదించాలని కావ్య విజ్ఞప్తి చేశారు. ఎలక్ట్రికల్ బస్సుల ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పర్యావరణ రక్షణతో పాటు తెలంగాణ రవాణా రంగానికి నూతన శక్తినిస్తాయని ఎంపీ పేర్కొన్నారు. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ స్పందిస్తూ, ప్రామాణిక జీసీసీ మోడల్‌ను మాత్రమే కేంద్రం ఆమోదిస్తోందని తెలిపారు. రాష్ట్రం సూచించిన హైబ్రిడ్ మోడల్ ప్రస్తుత పథకంలో లేనందున ఇంకా పరిశీలనలో ఉందని చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్రం తరుపున మరిన్ని అంశాలు లేవనెత్తుతూ కేంద్రం రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా విధానాల్లో మార్పులు చేయాలని అభ్యర్థించారు. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రం పక్షాన 2800 ఎలక్ట్రిక్ బస్సుల ప్రతిపాదన కోరారు. హైబ్రిడ్ జీసీసీ మోడల్ ద్వారా ఉపాధికి మద్దతు కల్పించాలన్నారు. సీఈఎస్ఎల్ ఆధ్వర్యంలో బస్సుల కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఎంపీ కావ్య కోరారు.

కలిమి శ్రీనివాస్‌కు డాక్టరేట్

హసన్‌పర్తి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కలిమి శ్రీనివాస్‌కు హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ చేతుల మీదుగా కలిమి శ్రీనివాస్‌కు డాక్టరేట్ పట్టాను అందజేసి మాట్లాడారు. డాక్టర్ కె.సాగర్ పర్యవేక్షణలో డైజైన్ ఆఫ్ లైట్ వెయిట్ అథెంటికేటెడ్ కీ అగ్రిమెంట్ ప్రోటోకాల్ ఫర్ వైర్‌లెస్ సెన్సార్ నెట్‌వర్క్ 5జీ ఇంటిగ్రేటెడ్ ఇంటర్ నెట్ ఆఫ్ థింగ్స్ అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు గాను కలిమి శ్రీనివాస్‌కు డాక్టరేట్ ప్రకటించినట్లు ఆమె తెలిపారు. అనంతరం శ్రీనివాస్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి, ఏవో వేణుగోపాలస్వామి, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

'చేయూత' పింఛన్‌ను పెంచాలి

ఎన్నికల వేళ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి
లేదంటే ఆగస్టు 13న పింఛన్‌దారులతో గర్జనసభ
ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



సమావేశానికి హాజరైన వికలాంగులు

జనగామ రూరల్/గిర్మాజిపేట(వరంగల్), జూలై 29(ఆంధ్రజ్యోతి): చేయూత పెన్షన్‌ను రూ.2016 నుంచి రూ.4,016కు, దివ్యాంగులకు రూ.4,016 నుంచి రూ.6,016 వరకు పెంచుతామని ఎన్నికల వేళ హామీ ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి 20 నెలలైనా పింఛన్ డబ్బులు పెంచడం లేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆరోపించారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు పెంచకపోతే సీఎం రేవంత్ రెడ్డిని గద్దె దింపుతామని హెచ్చరించారు. జనగామ జిల్లా కేంద్రంలో మంగళవారం వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం సోమరాజు అధ్యక్షతన వికలాంగుల చేయూత పింఛన్‌దారుల మహాగర్జన సన్నాహక సమావేశం నిర్వహించగా ముఖ్యఅతిథిగా కృష్ణ మాదిగ హాజరై మాట్లాడారు.

ఏపీలో సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను పెంచి ఇస్తుంటే, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్‌దారులకు రావాల్సిన రూ.20 వేల కోట్లను మళ్లించి, ప్రభుత్వం రైతు రుణమాఫీ చేసిందని విమర్శించారు. రూ.30వేల కోట్లు రుణమాఫీ చేయాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.20 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేసిందని ఆరోపిస్తున్న కేసీఆర్, పింఛన్‌దారుల సమస్యలపై ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. కేసీఆర్ గడిలో, రేవంత్‌రెడ్డి బంగ్లాలో పుట్టడంతో పేదల కష్టాలు తెలియడం లేదని ఆరోపించారు. పెన్షన్ డబ్బులు పెంచి, వెంటనే లబ్ధిదారులకు అందించాలని, లేదంటే ఆగస్టు 13 లక్షలాది మందితో 'చలో హైదరాబాద్' పెన్షన్‌దారుల గర్జన నిర్వహించి తాడోపేడో తేల్చుకుంటామన్ని పేర్కొన్నారు.

పింఛన్ పెంచకపోతే పోరు తప్పదు

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఆసరా ఫింఛన్‌ను రు.4వేలు, వికలాంగుల పింఛన్‌లను రు.6 వేలకు పెంచాలని కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన వరంగల్ లేబర్‌కాలనీలో జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు రాజు యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ వర్గాలకు పెంచిందిని గుర్తు చేశారు. అభివృద్ధి, సంక్షేమం పేరుతో వేల కోట్ల రుపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం ఆసహాయులకు ఎందుకు పెంచడంలేదని ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రభుత్వ తీరును ప్రశ్నించడంలో ప్రతిపక్షాలు వైఫల్యం చెందాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు ఆనందరావు మాదిగ, ప్రణయ్‌దీప్ మాదిగ, రాజశేఖర్ మాదిగ, సుధాకర్ మాదిగ, మల్లన్న, వికలాంగుల హక్కుల పోరాట వేదిక నాయకులు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, రవిందర్, భాస్కరరావు, శ్రీధర్ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

హాజరైన 1000మంది క్రీడాకారులు



అథ్లెటిక్స్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఆర్ఐ ఉదయ్‌భాస్కర్

వరంగల్ స్పోర్ట్స్, జూలై29 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, పట్టుదలతో క్రీడల్లో సాధన చేస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారులు, ఆర్ఐ (ఏఆర్ వీటీసీ) కమ్మాకుల ఉదయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జేఎన్ఎస్‌లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి జూనియర్స్ బాలబాలికల అథ్లెటిక్స్ క్రీడా పోటీలను ఆర్ఐ ఉదయ్‌భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..క్రీడల్లో పాల్గొనడం ద్వారా స్నేహపూర్వక సంబంధాలు పెంపొందుతాయన్నారు. జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభతో రాణించి రాష్ట్ర స్థాయికి చేరుకొని పతకాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కొదిరిపాక సారంగపాణి మాట్లాడుతూ..జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ అండర్-8, 10, 12, 14,16, 18, 20 బాలబాలికల స్టాండింగ్ బ్రాడ్ జంప్, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, ట్రిబుల్ జంప్, కిడ్స్ జావెలిన్‌త్రో, ట్రయాథ్లెన్, 60, 100, 200, 400, 600, 800, 1000, 1500, 3000, 5000 మీటర్ల పరుగు పందెంలో ఒక్క రోజు పాటు క్రీడలు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్స్‌లో వివిధ మండల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి సుమారు 1000 మంది బాలబాలికలు పాల్గొన్నరన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభతో రాణించిన అథ్లెట్లు ఆగస్టు 3, 4 తేదీల్లో హనుమకొండ జేఎన్ఎస్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు ప్రాతినిథ్యం వహిస్తారని సారంగపాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ అథ్లెటిక్స్ కోచ్ శ్రీమన్నారాయణ, పీడీలు వాసు, మనోజ్‌కుమార్, రజినికాంత్, సీనియర్ అథ్లెట్లు, టెక్నికల్ అఫీషియల్స్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ డిగ్రీ కోర్సుల ఇంగ్లీష్ సిలబస్ మార్పు

కేయూ క్యాంపస్ జూలై 29, (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఈ ఏడాది నుంచి మొదటి ఏడాది బీఏ, బీకాం, బీఎస్సీతో పాటు ఇతర కోర్సుల ఇంగ్లీష్ సెలబస్ మారినట్లు కేయూ పాఠ్య ప్రణాళిక సంఘం చైర్‌పర్సన్ పోల నిర్మల వెల్లడించారు. మంగళవారం కేయూ ఇంగ్లీష్ విభాగంలో బీవోఎస్ సభ్యులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేయూ ఇంగ్లీష్ విభాగం బీవోఎస్ చైర్‌పర్సన్ నిర్మల మాట్లాడారు. డిగ్రీ కోర్సుల మొదటి ఏడాది ఇంగ్లీష్ సబ్జెక్టు ఇంగ్లీష్ ఫర్ బ్రిలియన్స్ పుస్తకాన్ని కొత్త సెలబస్‌గా ప్రకటించినట్లు స్పష్టం చేశారు. ఈ సబ్జెక్టుకు 20 క్రెడిట్స్ ఉంటాయని పేర్కొన్నారు. నూతన సెలబస్‌లో గద్యం, కవిత్వం, నటన, నాటకం, వ్యాకరణం, లెర్నింగ్ స్టడీ, రీడింగ్, రైటింగ్ నైపుణ్యాలకు సంబంధించిన అంశాలుంటాయని తెలిపారు. నూతన సెలబస్ మేరకు పాఠ్య పుస్తకాలు వారం రోజుల్లో అందుబాటులోకి వస్తాయని వివరించారు. ఈ సమావేశంలో మేఘనరావు, ఎం.నవీన్, రామ్‌భాస్కర్, శ్రీనాథ్, శారద తదితరులు పాల్గొన్నారు.

మీనాక్షి 'చేతి'కి జాబితా

(5వ పేజీ తరువాయి)

పైడాకుల అశోక్, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో పాటు జిల్లా ఇన్‌చార్జులు సమావేశమయ్యారు.

భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ సమావేశానికి ప్రకాశ్‌రెడ్డి హాజరు కాలేదు. డీసీసీల అధ్యక్షులు ప్రతిపాదిత జాబితాను మీనాక్షి నటరాజన్‌కు అందచేశారు. కమిటీల రూపకల్పన, పదవులకు నేతల ఎంపిక, పార్టీకి అందచేసిన సేవలు, సీనియారిటీ తదితర అంశాలను డీసీసీల అధ్యక్షులు మీనాక్షి నటరాజన్‌కు వివరించారు. అయితే స్థానిక ఎన్నికల తదుపరే కమిటీల అధికార వెల్లడి ఉంటుందని సమావేశం నిర్ణయించింది. ఈ పరిణామంతో స్థానిక ఎన్నికలు ముగిసే వరకు ఆశావహులకు ఉత్కంఠతో వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్థానిక సమరం అనంతరం కమిటీలు, డైరెక్టర్లతో పాటు చైర్మన్ పోస్టుల భర్తీ తతంగం కూడా పూర్తి చేయనున్నట్లు మీనాక్షి నటరాజన్, మహేశ్‌కుమార్‌గౌడ్ తెలియచేశారు.

క్షేత్రస్థాయి కసరత్తు పూర్తి

కమిటీల నిర్మాణం, డైరెక్టర్ పోస్టుల భర్తీకి క్షేత్రస్థాయి నుంచి కసరత్తు పూర్తి చేసినట్లు డీసీసీల అధ్యక్షులు వివరించారు. ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు చేపట్టిన కసరత్తు ప్రక్రియను వివరించారు. పార్టీకి సేవలు, సీనియారిటీ తదతర అంశాలను మీనాక్షి నటరాజన్ పదే పదే ప్రస్తావించినట్లు తెలిసింది. అధికారిక ప్రకటన తదుపరి వివాదాలకు దారి ఉండకూడదని ఆమె స్పష్టం చేసినట్లు సమాచారం. దీనిపై ఒక్కో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి నుంచి ఆమె వివరాలు రాబట్టినట్లు తెలిసింది. తమ వైపు నుంచి పరిశీలన ఉంటుందని ఆ తదుపరి ఆమోదం పడుతుందని కరాకండిగా చెప్పినట్లు తెలిసింది.

ప్రకటనకు అడ్డంకిగా స్థానిక ఎన్నికలు

కమిటీలు, డెరెక్టర్ల పోస్టులకు ఎంపిక జాబితా అధికారిక ప్రకటన అంశంపై సమావేశంలో లోతైన చర్చ జరిగింది. స్థానిక ఎన్నికల క్రమంలో కమిటీల ఎంపికపై రచ్చ జరిగితే పార్టీకి నష్టం వాటిల్లుతుందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఎన్నికల తదుపరి ప్రకటనకు అనుకూలమైన వాతావరణమనే ఏకాభిప్రాయాన్ని డీసీసీల అధ్యక్షులు వ్యక్తీకరించడంతో మీనాక్షి నటరాజన్ ఇందుకు సముఖత చూపారు. ఎన్నికల తరువాతే ప్రకటన ఉంటుందని జిల్లా అధ్యక్షులకు స్పష్టం చేశారు. ఇక పార్టీ తలపెట్టిన పాదయాత్రల కార్యక్రమంపై కూడా సమావేశంలో చర్చించారు. ఆగస్టు 6న హనుమకొండ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గంలో మీనాక్షి నటరాజన్ పాదయాత్ర, రూట్ మ్యాప్ తదితర అంశాలు చర్చకు వచ్చాయి.

హోటళ్లలో అధికారుల తనిఖీ

'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన మునిసిపల్ యంత్రాంగం
వరంగల్ ట్రైసిటీస్‌లో మూకుమ్మడి సోదాలు
నిబంధనలు పాటించని యజమానులకు జరిమానా



హనుమకొండలో అక్షయ హోటల్‌లో తనిఖీ చేస్తున్న ఎంహెచ్‌వో

వరంగల్ కార్పొరేషన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని పలు హోటళ్లలో జీడబ్ల్యూఎంసీ అధికారులు కొరడా ఝులిపించారు. నిబంధనలు పాటించని పలు హోటళ్ల యజమానులకు జరిమానా విధించారు. మంగళవారం ' ఆంధ్రజ్యోతి'లో 'ఆరోగ్యంతో చెలగాటం' అనే వార్త ప్రచురితమైంది. దీంతో గ్రేటర్ వరంగల్ కమిషనర్ స్పందించి సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. వరంగల్ నగరంలోని హోటళ్ల పూర్తి వివరాలు, ఆహారం కల్తీ చేసే ప్రాంతాల పూర్తి వివరాలు కమిషనర్ కోరినట్టు తెలిసింది. నగరంలో అపరిశుభ్రత కలిగిన హోటళ్లను తనిఖీ చేయాలని జీడబ్ల్యూఎంసీ సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డిని ఆదేశించారు. దీంతో మంగళవారం సాయంత్రం శానిటేషన్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి వరంగల్ ట్రైసిటీస్‌లోని కొన్ని హోటళ్లను తనిఖీ చేశారు. చాలా రోజులుగా ఫ్రిజ్‌లో పెట్టిన మటన్, చికెన్, ఫిష్ గుర్తించారు. సుబేదారిలోని అక్షయ హోటల్‌లో వంటగది, అక్కడి పని వాళ్లు నిబంధనలు పాటించకుండా అపరిశుభ్రంగా ఉండడంతో సీఎంహెచ్‌వో గుర్తించి సదరు యజమానికి రూ. 5 వేల జరిమానా విధించినట్టు తెలిపారు. ఇంకా నగరంలో చాలా హోటళ్లు గుర్తించి వార్నింగ్ ఇచ్చామని ఇకపై తమ సిబ్బంది వరుసగా హోటళ్లు, రెస్టారెంట్లుచ బార్లు, బేకరీలలో తనిఖీలు చేస్తూనే ఉంటారని అన్నారు. ఈ తనిఖీలలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, శానిటరీ జవాన్లు పాల్గొన్నారు.



కాజీపేట మీదుగా వీక్లీ స్పెషల్ రైళ్లు రద్దు

కాజీపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : సౌత్ ఈస్ట్రన్ రైల్వేలో జరుగుతున్న అభివృద్ధి పనుల దృష్ట్యా కాజీపేట మీదుగా నడిచే వీక్లీ స్పెషల్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. (17007) చర్లపల్లి - దర్భంగా మీదుగా నడిచే దర్భంగా ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 26న, సెప్టెంబరు 9న రద్దుచేశారు. ఇదే రైలు డౌన్‌లో ఆగస్టు 29న, సెప్టెంబరు 12న రద్దుచేశారు. (17005) హైదరాబాద్ - రక్సోల్ మధ్య నడిచే రక్సోల్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 21, సెప్టెంబరు 12న రద్దుచేశారు. డౌన్‌లో ఆగస్టు 24, 31వ తేదీలలో రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

కుల్సా అధ్యక్షుడిగా నాగేశ్వర్‌రావు

కేయూ క్యాంపస్ జూలై 29, (ఆంధ్రజ్యోతి) : కేయూ లైబ్రరీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (కుల్సా) అధ్యక్షుడిగా ఎ.నాగేశ్వర్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం కుల్సా సెక్రటరీ వి.కృష్ణమాచార్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాగేశ్వర్‌రావు ఎంపికైనట్లు తెలిపారు. ఇప్పటి వరకు కుల్సా అధ్యక్షుడిగా పనిచేసిన కొండల్‌రెడ్డి మృతితో కొత్త అధ్యక్షుడి ఎంపిక నిర్వహించారు. కాగా, ఆగస్టు 12న లైబ్రరీల పితా రంగనాథన్ జయంతిని పురస్కరించుకుని లైబ్రరీ రంగంలో ప్రతిభ చూపిన వారికి బంగారు పతకం, పురస్కారం, మెమోంటోలు అందచేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మనోహర్‌రావు, రమణయ్య, కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా కుమారస్వామి

మడికొండ, జూలై 29(ఆంధ్రజ్యోతి): మడికొండకు చెందిన నార్లగిరి కుమారస్వామిని బీసీ సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షడిగా నియమించినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం నియామక పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కుమారస్వామి హర్షం వ్యక్తం చేస్తూ తన నియామకానికి సహకరించిన బీసీ సంఘం రాష్ట్ర జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

వరి నారు ధ్వంసం.. రైతు కుటుంబంపై హత్యాయత్నం

● 100కు డయల్ చేసిన బాధిత కుటుంబం

● పోలీసుల రాకతో పారిపోయిన దుండగులు పరారీ



ఆశ్వరావుపల్లిలో దుండగులు ధ్వంసం చేసిన వరినారు

రఘునాథపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా రఘునాథపల్లి ఆశ్వరావుపల్లి శివారులో ఉన్న తన పొలంలో కూలీలతో నాటు వేస్తుండగా, ఇదే గ్రామానికి చెందిన పొట్లపల్లి కళాధర్ రావు దుండగులను తీసుకొచ్చి నారును ధ్వంసం చేయడంతో తమ కుటుంబంపై మంగళవారం హత్యాయత్నానికి పాల్పడినట్టు బాధిత రైతు మండల ఎల్లయ్య ఆరోపించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రైతు ఎల్లయ్య మాట్లాడుతూ జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఆశ్వరావుపల్లి శివారులోని కళాధర్ రావు వ్యవసాయ భూమి ఉందని, పక్కనే ఉన్న తన భూమి అతడిదే అంటూ వేధిస్తున్నాడన్నారు.

ఈ విషయంపై రెవె న్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే ఆ భూమి తనదేనని తేల్చి చెప్పినా, కళాధార్ బలవంతంగా ఆక్రమించుకోవడానికి యత్నిస్తున్నాడని ఎల్లయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ క్రమంలో తన భూమిలో నారు పోసుకుని, కూలీలతో మూడు నాటు వేయిస్తుండగా, కళాధర్‌రావు కొందరు కిరాయి దుండగులను తీసు కొచ్చి నాటు వేయకుండా అడ్డుకోవడమేకాక, నారును ధ్వంసం, తన కుటుంబ సభ్యులపై హత్యాయత్నానికి ప్రయత్నించాడని ఆరోపించాడు. దీంతో 100 కు ఫోన్ చేయడంతోపాటు గ్రామస్థులకు విషయాన్ని తెలుపగా, పోలీసులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పొలం వద్దకు రావడంతో కళాటదర్ రావు, అతని భార్య, కిరాయి దుండగులు నుంచి పారిపోయారన్నారు. కళాదర్ రావుతో ప్రాణ భయం ఉందని, రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు.

చిన్నారిని చిదిమేసిన స్కూల్ బస్సు

అన్నయ్యను బడికి పంపేందుకు తల్లితో కలిసి వెళ్లి దుర్మరణం
భూపాలపల్లి జిల్లాలో ఘటన

మహదేవపూర్ రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : అన్నయ్యను బడికి పంపించేందుకు తల్లితో కలిసి వెళ్లిన చిట్టి చెల్లి(3) విగత జీవిగా మారింది. ప్రైవేటు స్కూల్ బస్సు టైర్ కింద నలిగి ప్రాణాలు కోల్పోయింది. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అంబట్‌పల్లిలో మంగళవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబట్‌పల్లి గ్రామానికి చెందిన సింగినేని మల్లేష్-భాగ్య దంపతులకు నాలుగేళ్ల కొడుకు అన్విత్, మూడేళ్ల కూతురు తేజస్విని ఉన్నారు. కొడుకు అన్విత్‌ను సూరారంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు పంపిచేందుకు తల్లి భాగ్య, కూతురు శ్రీహర్షిణి స్కూల్ బస్సు వద్దకు వచ్చారు. కొడుకును బస్సు ఎక్కించిన భాగ్య వెనుదిరిగింది. స్కూల్ బస్సు ముందుకు కదలగా తల్లి చేయి వదిలించుకొని ఉన్న చిన్నారి శ్రీహర్షిణి ఉన్నట్టుండి దాని కింద పడిపోయింది.

వెనుక టైరు తల పైనుంచి వెళ్లడంతో మెదడు చిట్లి బయట పడి అక్కడిక్కడే మృతి చెందింది. రెప్పపాటులో ఈ ఘోరం జరగ్గా తల్లి హతాశయురాలైంది. తన కళ్లెదుటే కన్న కూతురు ప్రాణాలు వదలడంతో భాగ్య కన్నీరుమున్నీరైంది. విషయం తెలుసుకొని అక్కడికి వచ్చిన తండ్రి మల్లేష్ తన చిట్టి తల్లిని విగత జీవిగా చూసి గుండెలు బాదుకున్నాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై పవన్ కుమార్ సందర్శించి విచారణ చేపట్టారు. చిన్నారి మృతికి కారణమైన బస్సు డ్రైవర్ పరారీలో ఉన్నాడని తెలిపారు. మల్లేష్ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటుండగా చిన్నారి తేజస్విని మృతితో ఆ ఇంట తీవ్ర విషాదం అలుముకుంది.

నకిలీ పత్రాల ముఠా ఆటకట్టు

● ఆర్‌సి, ఇన్సూరెన్స్ బోగస్ పత్రాలను వాహనదారులకు అంటగట్టి లక్షల్లో దోపిడీ

● 15 మంది అరెస్టు.. పరారీలో ఐదుగురు ● వివరాలు వెల్లడించిన సెంట్రల్ డీసీపీ షేక్ సలీమా

వరంగల్ క్రైం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నకిలీ వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ పత్రాలను తయారు చేసి అటు వాహనదారులను, ఇటు ఆర్టీఏ అధికారులను నమ్మించి ప్రభుత్వ ఖజానాకు తూట్లు పొడుస్తున్న రెండు ముఠాలకు చెందిన 15 మందిని మంగళవారం అరెస్టు చేసినట్లు సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా తెలిపారు. వారి నుంచి పత్రాల తయారీకి వినియోగించిన 6 డెస్క్‌టాప్ కంప్యూటర్లు, 2 థర్మల్ ప్రింటర్స్, 17 సెల్‌ఫోన్‌లతో పాటు పీవీసీ కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఫైనాన్స్ సంస్థలు సీజ్ చేసిన వాహనాలను తిరిగి విక్రయించే క్రమంలో ఫ్రెష్ రిజిస్ట్రేషన్ కార్డుల కోసం ఆర్‌టీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది, కానీ ఫైనాన్స్ సంస్థలు అలా చేయకుండా స్థానిక వాహన కన్సల్టెన్సీ నిర్వహకులకు ఎన్‌ఓసీ, ఒరిజనల్ రిజిస్ట్రేషన్ కార్డులు లేకుండానే వాహన కన్సల్టెన్సీలకు విక్రయించే వారు. దీంతో కన్సల్టెన్సీల నిర్వహకులు ఒరిజనల్ పత్రాల కోసం ఆర్‌టీఏ ఏజెంట్లుగా చలామణి అవుతున్న వడ్లకొండ శ్రీనువాస్, ఆసీఫ్ ఖురేషిలను ఆశ్రయించడంతో వాహనాలకు సంబంధించిన పూర్తివివరాలను ఆన్‌లైన్‌లో సేకరించి, పీవీసీ కార్డులపై, ఆర్‌టీఏ కార్యాలయం నుంచి అక్రమ మార్గంలో సేకరించిన ఒరిజినల్ కార్డులపై థర్మల్ ప్రింటింగ్ మిషన్ ద్వారా ఒరిజనల్ తరహాలో రిజిస్ట్రేషన్ కార్డులను తయారు చేసి కన్సల్టెన్సీ నిర్వహకులకు అందజేసే వారు. అనంతరం సదరు బోగసు పత్రాలతో వాహనదారులకు ఆర్‌టీఏ కార్యాలయాల్లో అన్‌లైన్ ద్వారా ఫ్రెష్ రిజిస్ట్రేషన్‌లు జారీ చేయించేవారు.

మరో ఘటనలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ రెన్యూవల్‌తో పాటు ఓనర్‌షిప్ ట్రాన్స్‌ఫర్ సమయంలో నిబంధనల ప్రకారం బీమా పత్రాలు తప్పనిసరి అయితే ఇదే అదునుగా భావించిన కొంత మంది ఆర్‌టీఏ ఏజెంట్లు, వాహన కన్సలెన్సీ నిర్వహకులైన నవాబు లెబర్ కాలనీ, సాబీర్ ఎల్‌బి నగర్, మణికంటి ప్రభాకర్‌రెడ్డి నయీంనగర్, గుగ్గిల్ల చెర్రిబాబు కాపువాడ, కేశోజ్ రాజ్‌కుమార్ అలియాస్ డీఎల్ రాజు గుడిబండల్, ఆసీఫ్ కరుణాపురం, అంకం శ్రీనువాస్ ధర్మసాగర్, గొనెల రమేశ్ అలియాస్ వాగ్దేవి రమేశ్ సుధానగర్, ఎన్. శశివర్ధన్ ఖిలావరంగల్, నరిశెట్టి రాజేశ్ కరీమాబాద్, ముజ్జిగ ఓంప్రకాశ్ నక్కలపల్లి, అక్షయ్‌కుమార్ ఫాతిమానగర్‌లు కలిసి బోగస్ బీమా పాలసీ పత్రాలను రూపొందించి ఆన్‌లైన్‌లో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందేలా సహకరించి వాహనదారుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు దండుకుంటున్నారు.

ఈ అక్రమాలకు సంబంధించి హనుమకొండ, కేయూసీ, మీల్స్‌కాలనీ పీఎస్‌ల పరిధిలో కేసులు నమోదు చేసి 13 మందిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. ఇంకా ఈ దందాలో పాలు పంచుకున్న మామిడి రాజు అలియాస్ భూపాలపల్లి రాజు, వేల్పుల సతీష్, దేవులపల్లి శ్రావణ్, లక్ష్మమ్మ ప్రస్తుతం పరారీలో ఉన్నారన్నారు. నకిలీ వ్యహారంలో ఆర్టీఏ అధికారుల పాత్ర ఏ మేరకు ఉందనే విషయంపై సైతం దర్యాప్తు జరుగుతుందన్నారు.

ఈ సందర్భంగా నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన టాస్క్‌ఫోర్స్ సీఐ సత్యనారాయణ రెడ్డి, శ్రీధర్, బాబులాల్, పవన్‌కుమార్, హనుమకొండ, కేయూసీ, మీల్స్‌కాలనీ ఇన్స్‌పెక్టర్లు శివకుమార్, రవికుమార్, రమేశ్, ఎస్సైలు, సిబ్బందిని డీసీపీ అభినందించారు.



ధ్వంసమైన పోతన నగర్ రోడ్డు

వామ్మో.. గుంతలు..

» అధ్వానంగా వరంగల్ నగర రోడ్లు
» వర్షానికి గుంతలైన ప్రధాన రహదారులు

వరంగల్ కార్పొరేషన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో ఇటీవల విస్తారంగా కురిసిన వర్షాలకు ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లు ప్రమాదకరంగా మారాయి. ఈ రోడ్లపై వాహనాలతో ప్రయాణించే ప్రజలు బయటకు వెళ్లి తిరిగి వస్తారనే గ్యారెంటీ లేదు. రోడ్లను దూరం నుంచి చూస్తే బాగానే ఉన్నా దగ్గరికి వెళ్లే సరికి ఎక్కడ చూసినా ప్రాణాంతక గుంతలు, మోకాలులోతు గుంతలు ఉంటున్నాయి. దీంతో వాహనచోదకులు, కార్లు, భారీ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలా నిత్యం ప్రధాన రహదారులపై ప్రమాదాలు జరుగుతున్న ఘటనలు నిత్యకృత్యమయ్యాయి. స్మార్ట్‌సిటీ, జనరల్ ఫండ్‌తో పాటు ఇతర నిధుల నుంచి కోట్లు ఖర్చు చేసి నగర రోడ్లను అద్దంగా తీర్చి దిద్దాల్సిన అధికారులు.. నిద్రమత్తు నటిస్తుండడంతో కాంట్రాక్టర్లు నాసిరకం పనులు చేసినట్టు వర్షంతో వెలుగులోకి వచ్చింది. ఈ వారం వ్యవధిలో కురిసిన భారీ వర్షాలకు రోడ్లపై ఏర్పడిన గుంతల్లో పడి సుమారు 22 మంది చికిత్స పొందుతున్నట్టు తెలిసింది.



అంబేద్కర్ భవన్ వద్ద రోడ్డుపైనే ఉన్న మట్టి కుప్పలు, రాళ్లు

గుంతలమయమైన ప్రదేశాలు

వరంగల్ నగరం పాలక సంస్థ పరిధిలోని పోతననగర్‌రోడ్డు, విజ్ఞాన్ ముందు రోడ్డు, గోపాల్‌పూర్ జంక్షన్, ఖమ్మం ఓవర్ బ్రిడ్జి ప్రాంతం, ఖమ్మం ఫ్లైఓవర్ బ్రిడ్జి, వరంగల్ బస్‌స్టేషన్, అంబేద్కర్ భవన్ ముందు, కేయూ రోడ్డు, యాదవ నగర్, రమేష్‌బార్ ముందు, ములుగురోడ్డు జంక్షన్, హనుమాన్‌నగర్ జంక్షన్, భీమారం జంక్షన్, వరంగల్ 12 మోరీల జంక్షన్, శివనగర్‌రోడ్డు, కరీమాబాద్‌రోడ్డు, మడికొండ జంక్షన్, బాపూజీనగర్ వద్ద రోడ్లు వర్షానికి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గ్రేటర్ వరంగల్ అధికారులు గుంతలను గుర్తించి ప్రత్యేక బడ్జెట్‌తో ప్యాచ్ వర్క్‌లు చేసి సమస్య పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ వద్ద తెరిచి ఉన్న మ్యాన్‌హోల్



ఖమ్మం ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ధ్వంసమైన రోడ్డు



శానిటరీ ఇన్‌స్పెక్టర్ల అక్రమ దందా

» బల్దియాలో జవాన్లతో వసూళ్లు
» రీషఫిల్ చేసినా మారని తీరు
» పీహెచ్ వర్కర్లనూ వదలని వైనం
» ఒకరికి బదులు మరొకరు విధులు

వరంగల్ కార్పొరేషన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని 66 డివిజన్లతో పాటు మెయిన్ రోడ్లపై ప్రజాపాలన విభాగం శానిటరీ ఇన్‌స్పెక్టర్ల అక్రమాలు పెరిగిపోతున్నాయి. వారి చేతికి మట్టి అంటకుండా కొందరు జవాన్లను ఎంపిక చేసుకుని వారి చేత అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా ట్రై సిటీస్‌లోని పెద్ద హోటళ్లు, దాబాలు, బార్లు, రెస్టారెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్, షాపింగ్ మాల్స్ నుంచి నెల వారీగా ఇచ్చే చెత్త పన్ను కాకుండా అదనంగా అడ్డదారిలో గార్బేజ్ పన్ను వసూలు చేస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అక్రమ చెత్త పన్నుతో పాటు 66 డివిజన్లలో పని చేసే పబ్లిక్ హెల్త్ (పీహెచ్) వర్కర్లతో పాటు ప్రభుత్వ శానిటరీ ఉద్యోగుల నుంచి నెల వారీగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. డబ్బులు ఇవ్వబోమని తెగేసి చెప్పేవారికి కష్టమైన పనులు పురమాయిస్తున్నారు. వారితో డ్రెయినేజీలు శుభ్రం చేయించడం, జంతు కళేబరాలు తరలించడం, మెయిన్ రోడ్లు ఊడ్పిస్తారని కార్మికులు చెబుతున్నారు. కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శాశ్వతంగా కొందరు పీహెచ్ వర్కర్లను జవాన్లుగా ఎంపిక చేసి వారికి పదోన్నతులు కల్పిస్తూ వసూళ్లకు పాల్పడుతున్నట్లు జోరుగా ప్రచారం సాగుతుంది.

ఎక్కువ డివిజన్లు.. తక్కువ ఇన్‌స్పెక్టర్లు

గ్రేటర్ శానిటేషన్ విభాగంలో 1 సీఎంహెచ్‌వో, 1 ఎంహెచ్‌వో, 2 శానిటరీ సూపర్‌వైజర్లు, 7 ఒరిజినల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, 5 మలేరియా విభాగం నుంచి ఎంపిక చేసిన డిప్యుటేషన్ ఇన్‌స్పెక్టర్లు, 1 ఫారిన్ సర్వీస్ (మెడికల్ డిపార్ట్‌మెంట్)కు సంబంధించిన అధికారులు పని చేస్తున్నారు. ఉద్యోగ నియామకాల కుంభకోణంలో ఇరుక్కున్న ఓ ఇన్‌స్పెక్టర్ సైతం ఖమ్మం నుంచి ఇటీవల తిరిగి జీడబ్ల్యూఎంసీ శానిటేషన్ విధుల్లో చేరి చర్చనీయాంశంగా నిలిచాడు. చాలాకాలంగా పాతుకుపోయిన 13 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఇటీవల 66 డివిజన్లకు రీషఫిల్ చేశారు.

ఐనా వారి ప్రవర్తనలో మార్పు రాకుండా వారి వద్ద గతంలో పర్మినెంట్‌గా పని చేసి అక్రమ వసూళ్లకు పాల్పడిన వారిని సైతం వారి వెంటే తీసుకుని వెళ్లినట్లు ప్రచారం జరుగుతుంది. ఐతే కొందరు ఉన్నతాధికారులతో చనువుగా ఉన్న ఇన్‌స్పెక్టర్లకు వారు కోరుకున్న డివిజన్లు, 6 కమర్షియల్ మెయిన్ రోడ్లను అప్పగించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రస్తుతం గ్రేటర్ పరిధిలో 250 మందికి పైగా వైట్‌కాలర్ జవాన్లు డ్యూటీకి హాజరు కాకుండా పర్సనల్ పనులు చేసుకునే ప్రభుత్వ (పీహెచ్) వర్కర్ల వద్ద నెలకు రూ. 10 వేలు, ఔట్ సోర్సింగ్ కార్మికుల నుంచి నెలకు రూ. 500 నుంచి వెయ్యి వసూలు చేస్తున్నట్లు తెలిసింది. అలాగే బదిలీ వర్కర్‌ను పెట్టినట్లు ఆయా డివిజన్లలో పని చేస్తున్న కొందరు జవాన్లు అధికారులు, కమిషనర్‌ను సైతం తప్పుదోవ పట్టిస్తూ నెలకు లక్షల్లో వెనకేసుకోవడంతో పాటు డివిజన్ ఇన్‌స్పెక్టర్‌కు నెలకు రూ. 1 లక్ష ఇస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఒక్కో డివిజన్‌లో సుమారు 25 నుంచి 35 మంది శానిటేషన్ కార్మికులు పని చేయాల్సి ఉండగా ప్రస్తుతం 10 మంది కంటే ఎక్కువ చేయడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పని చేసే సిబ్బంది మీదనే అదనపు భారం పడడం వల్ల రోగాల బారిన పడుతున్నారు.

కమిషనర్ గారు.. జర దేఖోజీ

గతంలో ఉన్న అధికారులు శానిటేషన్ విభాగంపై దృష్టి సారించపోవడంతో సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు ఆడిందే ఆట పాడిందే పాటగా డ్యూటీ చేశారు. కానీ కొత్త కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ వచ్చిన తర్వాత కూడా వారి విధుల పట్ల దృష్టి సారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. వారి పని విధానంలో మార్పు రాకపోతే వరంగల్ నగరం చెత్త కుప్పలా మారిపోతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

జవాన్ల డ్యూటీ చేస్తున్న సూపర్‌వైజర్లు

వరంగల్ శానిటేషన్ విభాగంలో పని చేస్తున్న ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నగరంలో జవాన్ల డ్యూటీలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్ తర్వాత అతి పెద్ద నగరమైన వరంగల్ బల్దియాకు కనీసం 6 శానిటరీ సూపర్‌వైజర్లు పని చేయాల్సి ఉంది. కాని ఇక్కడి అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రస్తుతం ఇద్దరే పని చేస్తున్నారు. ఆ ఇద్దరు తలో నాలుగు డివిజన్లు, మెయిన్ రోడ్లను పంచుకుని వర్కర్ల నుంచి జవాన్ల ద్వారా అందిన కాడికి దండుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రతిరోజూ శానిటరీ సూపర్‌వైజర్లు డివిజన్లలో పర్యటిస్తూ అక్కడి సమస్యలు గుర్తించి ఆయా డివిజన్ల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లకు పనులు అప్పగించాల్సి ఉంటుంది. కానీ సూపర్‌వైజర్లు అడ్డదారిలో వచ్చే డబ్బులకు ఆశపడి వారి స్థాయిని తగ్గించుకుని జవాన్ డ్యూటీలు చేస్తున్నారని కింది స్థాయి సిబ్బంది ఆరోపిస్తున్నారు.

ఎలుకల మందు తాగి విద్యార్థి ఆత్మహత్య

పాఠశాల వద్ద బంధువులు ఆందోళన



వెంకట చైతన్య (ఫైల్)

తొర్రూరు రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఎలుకల మందు తాగి 10వ తరగతి చదువుతున్న విద్యార్థి బానోత్ వెంకట చైతన్య (15) మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామ శివారు మర్రికుంట తండాకు చెందిన వెంకన్న-అనిత దంపతుల కుమారుడు వెంకట చైతన్య తొర్రూరు మండలం వెల్లికట్టె గ్రామ శివారులోని అబ్యాస్ పాఠశాలలోని హాస్టల్‌లో ఉంటూ పదవ తరగతి చదువుతున్నాడు. మూడు రోజులుగా ఒంటరిగా ఉంటూ, నిత్యం ఆన్‌లైన్ ద్వారా వచ్చిన పుస్తకాలు చదువుతూ, స్నేహితులకు దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో ఈ నెల 27న రాత్రి హాస్టల్‌లో ఎలుకల మందు తాగడం గమనించిన తోటి విద్యార్థులు, ఉపాధ్యాయలు వెంటనే స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యంతో కలిసి వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా, పరిస్థితి విషమించింది. సోమవారం రాత్రి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించినట్లు తెలిపారు. దీంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు మృతికి గల కారణాలు తెలియజేయాలని పాఠశాల ఎదుట మృతదేహం వేసి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న సీఐ గణేష్, ఎస్సై ఉపేందర్ ఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడి ఆందోళన విరమింప చేశారు. తన కుమారుడి మృతికి గల కారణాలు తెలియజేయాలంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ఆయుర్వేద వైద్య కళాశాలలో 10 సీట్లు కోత

ఫ్యాకల్టీ కొరతతో తగ్గించిన వైద్య కమిషన్

గిర్మాజిపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో వరంగల్ అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా సీట్లను కోల్పోయింది. మొత్తం 63 బీఏఎంఎస్ సీట్లకు ఈ ఏడాది (2025-26)ప్రవేశాలకు 10 సీట్లను తగ్గిస్తూ నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్ (ఎన్సీఐఎస్ఎం) ఆదేశాలు జారీ చేసింది. నిబంధనల ప్రకారం కళాశాలలో ఫ్యాకల్టీతో పాటు మౌలిక సదుపాయాలు లేనందున సీట్లు తగ్గిస్తున్నట్లు వైద్య కమిషన్ పేర్కొంది. గతేడాది కూడా ఇవే కారణాలతో 4 సీట్లను తగ్గించిన విషయం తెలిసిందే. కాగా, 'ఆయుర్వేద వైద్య కళాశాలల్లో సీట్లకు గండి' శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించిన విషయం విదితమే. అందులో చెప్పినట్లుగానే 10 సీట్లు తగ్గాయి. అయితే 10 సీట్లకు కోత పడటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి కేంద్ర ప్రభుత్వస్థాయిలో వైద్య కమిషన్‌తో చర్చించి తగిన హామీ ఇస్తే కోల్పోయిన 10 సీట్లు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ విషయంలో మంత్రి కొండా సురేఖ ప్రత్యేక చొరవ తీసుకొని వైద్య కళాశాల సీట్లను కాపాడాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



అమ్మవారికి చీరె సారె సమర్పిస్తున్న భక్తులు ←

భద్రకాళి అమ్మవారికి చీరెసారె సమర్పణ

51 రకాల స్వీట్లు, పండ్లతో పూజ

వరంగల్ కల్చరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు ప్రజల ఇలవేల్పు భద్రకాళి అమ్మవారికి శ్రావణ మాసం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీలక్ష్మి శ్రీనివాస సేవా ట్రస్టు మహబూబాబాద్ అధ్యక్షుడు బి. కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో 300 మంది భక్తులు వరంగల్ పోచమ్మమైదాన్ నుంచి మేళతాళాలతో చీరె సారెతో ఆలయానికి తరలి వచ్చారు. అమ్మవారిని దర్శించుకొని 51 రకాల స్వీట్లు, వివిధ రకాల పండ్లతో పాటు చీరె సారె సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బి.శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవన్‌కుమార్‌రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, తొగరు క్రాంతి, బింగి సతీష్, స్రవంతి, సుగుణ, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, ఈవో శేషు భారతి, అర్చకులు భద్రకాళి శేషుతో పాటు భట్టి శ్రీనివాస్, భార్గవి, కార్పొరేటర్లు చాడా స్వాతి రెడ్డి, దేవరకొండ విజయలక్ష్మి, సురేందర్, హేమలత, నాగజ్యోతి, రజినీరెడ్డి, వనజ తదితరులు పాల్గొన్నారు.

పరకాలను జిల్లాగా ఏర్పాటు చేయాలి

» మహిళలను కోటీశ్వరులను చేస్తాం : పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
» ప్రజలు సహకారంతోనే పట్టణాభివృద్ధి : హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

పరకాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పరకాలను అమరవీరుల జిల్లాగా ఏర్పాటు చేయాలని, గత పాలకుల నిర్లక్ష్యంతో పరకాలకు అన్యాయం జరిగిందని స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పరకాల పట్టణ కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం ఎక్స్‌కవేటర్, ఆరు స్వచ్ఛ ఆటోలను కలెక్టర్ స్నేహ శబరీష్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫెడ్ ఫెస్టివల్ స్టాళ్లను అధికారులతో కలిసి సందర్శించారు. మహిళా సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన, స్టాళ్లను పరిశీలించారు. అలాగే వన మహోత్సవంలో భాగంగా అధికారులతో కలిసి మొక్కలు నాటారు. మునిసిపల్ కార్మిక సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ.. మైనింగ్ ఏరియా భూపాలపల్లి వంటి ప్రాంతాలను జిల్లాగా ఏర్పాటు చేశారని కొంత కాలం తర్వాత ఆ ప్రాంతాల్లో జనసంచారం ఉండదన్నారు. పరకాలకు అన్ని రకాలుగా అర్హత ఉందన్నారు. పరకాలలో స్కిల్ డెవలప్‌మెంట్ ఏర్పాటు చేయబోతున్నట్లు పేర్కొన్నారు. పీయూఎఫ్ ఐడీసీ నిధులతో డీపీఆర్ ద్వారా అభివృద్ధి చేస్తామన్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ వచ్చే నెల 2న ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే రూ. 40 కోట్లతో డ్రెయినేజీ, రూ. 11 కోట్లతో రోడ్ల అభివృద్ధి చేస్తున్నామన్నారు. పరకాలకు పూర్వవైభవం తీసుకరావడానికి ప్రజల సహకరించాలని కోరారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరైన వారు త్వరగా ముగ్గులు పోసి నిర్మాణం చేపట్టాలన్నారు. 469 ఇళ్లకు 45 శాతం పురోగతి ఉందన్నారు. 45 రోజులు దాటితే నోటీసులు ఇచ్చి మంజూరు పత్రాలను రద్దు చేస్తామన్నారు. అధికారులు వెంటపడి ఇంటి నిర్మాణం ప్రారంభించాలన్నారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల పాలు చేశాడని ఆరోపించారు.



పారిశుధ్య కార్మికురాలికి దుస్తులు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ స్నేహ శబరీష్

అనంతరం కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. ప్రజలు సహకారంతోనే పట్టణాభివృద్ధి సాధ్యమన్నారు. మహిళలు తడి, పొడి చెత్తను వేరు చేసి సిబ్బందికి అందించాలని కాలనీ వారీగా కంపోస్టు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం మెప్మా సిబ్బందికి శిక్షణ అవసరమని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని మొదలు పెట్టి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఇల్లు కట్టుకునే వారికి మెప్మా ద్వారా ఆర్థికసాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీవో నారాయణ, కమిషనర్ సుష్మ, తహసీల్దార్ విజయలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ రాజిరెడ్డి, ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు, కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, కట్కూరి దేవేందర్‌రెడ్డి, సోదా రామకృష్ణ, మడికొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దిగొచ్చిన సన్న బియ్యం ధరలు

» మధ్య తరగతి కుటుంబాలకు అందుబాటులో..
» సన్న బియ్యం పంపిణీతోనే దిగిన ధరలు
» ప్రభుత్వం 3 నెలల బియ్యం ఇవ్వడంతో తగ్గిన గిరాకీ
» ధరలు తగ్గడంతో తలలు పట్టుకుంటున్న వ్యాపారులు

వర్ధన్నపేట రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : సన్న బియ్యం ధరలు దిగొచ్చాయి. మధ్య తరగతి కుటుంబాలు సన్న బియ్యం కొనాలంటేనే వామ్మో అనేవారు. ప్రస్తుతం ఈ బియ్యం ఆ కుటుంబాలకు అందుబాటులో ఉండేవిధంగా ధరలు ఉన్నాయని బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు, మిల్లర్లు, దుకాణాదారులు చెబుతున్నారు. రేషన్ దుకాణాల ద్వారా ఓ పక్క ప్రభుత్వం సన్న బియ్యం ప్రారంభించడంతో పాటు కేంద్ర ప్రభుత్వం మూడు నెలల పాటు రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయడంతో సన్న బియ్యాన్ని కొనుగోలు చేసే కుటుంబాలు తక్కువై పోయాయి. దీంతో దుకాణాదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ రెండు నెలల్లోనే రూ. 700-1000 వరకు ధరలు పడిపోవడంతో ప్రజలు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులోకి సన్న బియ్యం ..

సన్న బియ్యం రెగ్యులర్‌గా కొనే వారిలో మధ్య తరగతి కుటుంబాలే ముందు వరుసలో ఉంటాయి. కొంత మంది దుకాణాదారుల వద్ద కిలోల చొప్పున కొనుగోలు చేస్తారు. మరికొంత మంది నేరుగా మిల్లర్ల వద్దే కొనుగోలు చేసుకుంటారు. ప్రస్తుతం సన్న బియ్యం కొనుగోలు చేయాలనుకునే మధ్య తరగతి కుటుంబాలకు అందుబాటులో ఉన్నాయని వ్యాపారులు చెపుతున్నారు. రూ. 5 వేలకు పైగా ధరలు పలికిన సన్న బియ్యం ఇప్పుడు రూ. 4 వేలకు పైగా మాత్రమే పలుకుతున్నాయి. జై శ్రీరాం బియ్యం సైతం రూ. 6 వేల వరకు పలికిన సందర్భంలో ఇప్పుడు రూ. 5వేలకు పడిపోయాయి. ఆర్ఎన్ఆర్, బీపీటీ బియ్యం సైతం రూ. 4 వేలు, కొన్ని చోట్ల ఆ లోపు ధరలతో అమ్మాల్సిన పరిస్థితి వచ్చింది.



వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం దివిటిపెల్లిలోని రైస్‌మిల్‌లో ఉన్న బియ్యం బస్తాలు

రైస్ మిల్లర్లకు తీవ్ర నష్టం

రైస్ మిల్లు వ్యాపారులకు సన్న బియ్యం ధరలు తగ్గడంతో తీవ్ర నష్టం చవిచూస్తున్నారు. సన్నాలు పండించిన రైతులకు సైతం బోనస్‌తో కలిపి దాదాపు రూ. 3 వేల వరకు మద్దతు ధర వస్తుండడంతో బియ్యం ధరలు పెరిగి కొన్ని రోజుల పాటు లాభాలు గడించారు. కానీ ఇప్పుడు సన్న బియ్యాన్ని అడిగే వారు కూడా లేకపోవడంతో మిల్లుల్లో బియ్యం నిల్వలు పెరిగిపోయాయి. కొంత మంది మిల్లర్లు ఇంకా సన్న వడ్లను మరాడించకుండానే పక్కన పెట్టేశారు. సాధారణ మిల్లులు కూడా దాదాపు క్రాప్‌కు వెయ్యి క్వింటాళ్లకు పైగా సన్న వడ్లను కొనుగోలు చేసి అమ్మేవారు. పెద్ద మిల్లర్లు దాదాపు 3000-5000 క్వింటాళ్ల వరకు మరాడించి దుకాణాదారులు, హోటళ్లకు పంపించేవారు. కానీ గత రెండు నెలలుగా మిల్లులు సైతం పని చేయడం మానేశాయి. ప్రభుత్వానికి పంపిద్దామని చూసిన ఇప్పటికే గోదాములు నిండిపోయాయని పంపిస్తే తీసుకోబోమని చెబుతున్నారని సమాచారం.

భారీగా నష్టపోయాం..



పంట కోతలు కాగానే సన్న బియ్యం కోసం మాకు ఆర్డర్లు వచ్చేవి. ఈసారి రేషన్ బియ్యం మూడు నెలల పాటు ఇచ్చే సరికి సన్న బియ్యం కొనేవారు తక్కువయ్యారు. సగానికి పైగా వ్యాపారం పడిపోయింది. మిల్లుల్లోనే సన్న బియ్యం నిల్వలు ఉండిపోయాయి. ఒక్కసారిగా ధరలు తగ్గడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వానికి వెళ్లాల్సిన బియ్యం సైతం గోదాముల్లో ఉండిపోయింది.

పెద్దబోయిన శంకర్, మిల్లు యజమాని, వర్ధన్నపేట

బియ్యం ధరల వివరాలు క్వింటాల్(రూ.లలో)

రకం	మే	జూన్/జూలైలో ధర	తగ్గిన ధర
సాంబమసూరి	6000	4700	1300
జైశ్రీరాం	6500	4900	1600
స్ట్రీమ్ రైస్	5000	3900	1100
బీపీటీ	5000	4300	700
ఆర్ఎన్ఆర్	5500	4500	1000

రేపు ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

హసన్‌పర్తి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుబ్బయ్యపల్లిలో ఈ నెల 31న సాంఘిక సంక్షేమ గురుకులంలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుధాకృష్ణ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రేపు (గురువారం) ఉదయం 9 గంటలకు కళాశాల ప్రాంగణంలో 10వ తరగతి మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని పేర్కొన్నారు.

స్కూటీపై 120 చలాన్లు

రూ. 32,165 పెండింగ్



పెండింగ్ చలాన్లను చూపుతున్న ట్రాఫిక్ సీఐ వెంకన్న

కాజీపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వాహనాల తనిఖీలో భాగంగా ఓ మాస్ట్రో స్కూటీపై ఏకంగా 120 చలాన్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కాజీపేట ట్రాఫిక్ సీఐ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేటలోని ఎఫ్‌సీఐ పాయింట్ వద్ద మంగళవారం తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఏపీ 36 ఏఎక్స్ 4930 మాస్ట్రో ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా 120 చలాన్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ చలాన్ల విలువ రూ. 32,165 పెండింగ్ ఉన్నట్లు తెలిపారు. సదరు వాహనదారునికి డ్రైవింగ్ లైసెన్స్ కూడా లేదన్నా రు. వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.





సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ప్రభుత్వ భూమిని రక్షించాలి

న్యూశాయంపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలోని 31వ డివిజన్ న్యూశాయంపేటలోని సర్వే నెం 579, 39లో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు కబ్జాకు పాల్పడుతున్నారని ఈ భూమిని రక్షించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ ఇక్కడ కబ్జా అవుతున్న భూమిని ప్రభుత్వం పట్టించుకోకుంటే సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కమిటీ సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, కాజీపేట మండల కార్యదర్శి శంకర్‌నాయక్, సహాయ కార్యదర్శి వేల్పుల సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

ఎంసీహెచ్ భవనంలో నర్సింగ్ తరగతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరంగల్ మెడికల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రిలోని స్కూల్ ఆఫ్ నర్సింగ్ తరగతులను ఎంసీహెచ్ భవన సముదాయంలో నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. 'శిథిలావస్థకు చేరిన నర్సింగ్ భవనం' అనే శీర్షికతో ఈ నెల 28న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం స్పందించింది. డిప్యూటీ డైరెక్టర్ (నర్సింగ్) విద్యులత మంగళవారం ఎంజీఎం ఆస్పత్రిలోని నర్సింగ్ స్కూల్‌ను సందర్శించారు. పై పెచ్చులు ఊడుతున్న తరగతి గదులను స్వయంగా పరిశీలించారు. ట్యూటర్లను, విద్యార్థులను సమస్యల గురించి ఆరా తీశారు. నర్సింగ్ తరగతులను ఎంజీఎం ఆస్పత్రి ఆవరణలోని ఎంసీహెచ్ బ్లాక్‌లో నిర్వహించాలని ఆదేశించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ సత్యశారదను స్వయంగా కలిసి వివరించారు. ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్ తదితరులు ఉన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

న్యూశాయంపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు అన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో 30-33 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారిణి జహీదా తస్నీర్‌ను మంగళవారం న్యూశాయంపేటలోని కార్పొరేటర్ కార్యాలయంలో కార్పొరేటర్ రాజు అభినందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాజు మాట్లాడుతూ యువత జిల్లా, జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు సంపాదించే విధంగా క్రీడల్లో రాణించి సత్తా చాటాలన్నారు. క్రీడల్లో రాణించాలన్న యువతకు తనవంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు.

నేడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రాక



రాంచందర్‌రావు

మహబూబాబాద్ రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మానుకోట జిల్లాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు బుధవారం రానున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్.రాంచందర్‌రావు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన తర్వాత తొలిసారి మహబూబాబాద్‌కు వస్తున్నట్లు చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు నుంచి మహబూబాబాద్ జిల్లా బయ్యా రం మండలం గంధంపల్లికి మధ్యాహ్నం 3 గంటలకు చేరుకుంటారని చెప్పారు. అక్కడ్నుంచి మహబూబాబాద్‌కు చేరుకుని ఫ్లైఓవర్ మీదుగా కురవికి వెళ్లి శ్రీవీరభద్రస్వామిని దర్శించుకోనున్నట్లు చెప్పారు. ఆ తర్వాత మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కురవి గేట్ నుంచి బైక్ ర్యాలీగా అండర్‌బ్రిడ్జి, నెహ్రూ సెంటర్, తహసీల్ సెంటర్ మీదుగా శ్రీనివాసథియేటర్ నుంచి మదర్‌థెరిస్సా సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, నర్సంపేట బైపాస్‌రోడ్డు మీదుగా వీఆర్ఎన్ గార్డెన్‌కు చేరుకుంటారని చెప్పారు. అక్కడ నిర్వహించే బీజేపీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొని ప్రసంగించనున్నట్లు చెప్పారు. రాంచందర్‌రావుతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్ హాజరవుతున్నట్లు చెప్పారు.

పులులను సంరక్షించాలి

అటవీశాఖ జిల్లా అధికారి అనూజ్ అగర్వాల్



పులుల చిత్రాలను తిలకిస్తున్న అనూజ్ అగర్వాల్

న్యూశాయంపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పులుల సంరక్షణ బాధ్యత తీసుకోవాలని జిల్లా అటవీశాఖ అధికారి అనూజ్ అగర్వాల్ కోరారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని కాకతీయ జూలాజికల్ పార్క్‌లో మంగళవారం అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనూజ్ అగర్వాల్ మాట్లాడుతూ జూపార్క్‌కు పులులు వచ్చినప్పటి నుంచి సందర్శకుల తాకిడి పెరిగిందని, త్వరలో పార్క్‌ను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ప్రతిభా పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. జూపార్క్‌లో సేవ్ టైగర్స్ సేవ్ నేచర్... ప్రోగ్రాంలో భాగంగా ఏర్పాటు చేసిన పెద్ద పులుల చాయాచిత్ర ప్రదర్శన విద్యార్థులను ఎంతగానో ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పులుల సంరక్షణపై అవగాహన సదస్సు

రాంగనర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాంనగర్‌లోని షైన్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పులుల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పులులను రక్షించుకునే బాధ్యత మనందరిపై ఉందని తెలిసేలా దృశ్యరూపంలో స్కిట్ వేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్ మాట్లాడుతూ మనుషులు తమ స్వార్థం కోసం అడవులను, ప్రకృతిని నాశనం చేస్తున్నాడని దానిలో వణ్యప్రాణులకు హాని కలిగిస్తున్నాడని వాపోయారు. ఒకప్పుడు పులులు భూమిపై జీవించేవని చెప్పుకునే పరిస్థితి రావొద్దని, పులులను సంరక్షించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ మూగల రమ, ప్రిన్సిపాల్ ప్రగతిరెడ్డి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



పులుల సంరక్షణపై ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

జాతీయ విద్యా విధానంపై ప్రత్యేక దృష్టి

» వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

హసన్‌పర్తి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యావిధానం 2020 విద్యా రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు బాటలు వేస్తుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. మంగళవారం పీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల హసన్‌పర్తి ఆవరణలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్నంశెట్టి సుమాదేవి అధ్యక్షతన జరిగిన జాతీయ విద్యావిధానం 2020 ఐదో వార్షికోత్సవ సమావేశంలో శిలా ఫలకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, నైపుణ్యపరంగా మెరుగులు, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యను మలచడమే ఈ విద్యావిధానం ముఖ్య లక్షణమన్నారు. ఎమ్మెల్యేగా తాను దత్తత తీసుకున్న ఈ పాఠశాల జిల్లాలోనే అత్యుత్తమ పీఎంశ్రీ పాఠశాలకు ఎంపిక కావడం తనకు గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను పరిశీలించారు. పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్‌కి ఫాల్ సీలింగ్, ఏసీల ఏర్పాటు, పాఠశాల డయాస్ పైకప్పు ఏర్పాటుకు త్వరలోనే పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎ.శ్రీనివాస్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు ఎస్.రజిత, ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, ఏఎంసీ ఉపాధ్యక్షులు తంగెళ్లపల్లి తిరుపతి, కాంగ్రెస్ నాయకులు విజయమూరి వెంకటేశ్వర్లు, వీసం సురేందర్‌రెడ్డి, పెద్దమ్మ నర్సింహరాములు, ప్రభాకర్, శ్యాం, చంటిరెడ్డి, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం

» ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

రాంనగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండలోని పల్లా రవీందర్‌రెడ్డి భవన్‌లో టీఎస్ఈఈయూ-327 యూనియన్ ఆధ్వర్యంలో విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తాన్నారు. ఉద్యోగులకు బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు పేర్కొన్నారు. తనకు యూనియన్‌లతో సంబంధం లేదని ఉద్యోగులందరూ సమానమేని అన్నారు. విద్యుత్ ఉద్యోగులు విధిగా భద్రతకు చెందిన పరికరాలను విధుల్లో వెంటపెటుకోని వెళ్లాలన్నారు. ఎల్‌సీ యాప్‌ను విధిగా వినియోగించాలని, అందుకోసం ప్రతీ సబ్‌స్టేషన్‌కు సెల్‌ఫోన్ ఇవ్వడం జరిగిందన్నారు. సంస్థను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రతీ ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా పర్వతగిరి మండలం ఏనుగల్‌కు చెందిన అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్ అస్లావత్ బాలాజీ విద్యుత్ ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోగా టీఎస్ఈఈయూ- 327 ఆధ్వర్యంలో రూ. 70,000 ఆర్థిక సహాయాన్ని సీఎండీ చేతుల మీదుగా బాధితుడి భార్య లలితకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో 327 నాయకులు నీలం ఐలేశ్, శ్రీనువాస్‌గౌడ్, పి. మహేందర్‌రెడ్డి, శ్రీనువాస్, భూపాల్‌రెడ్డి, మాధవరావు, తులసి, సికిందర్, నరేందర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, యుగేందర్, వెంకటేశ్వర్లు, సైదులు, శ్రీనువాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ మాజీ వైస్ చైర్మన్‌పై కేసు

ఐనవోలు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఐనవోలు జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గజ్జెలి శ్రీరాములుపై ఐనవోలు పోలీసులు చీటింగ్. ఫోర్జరీ కేసులు నమోదు చేశారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం నందనం గ్రామ శివారులో సర్వే నెంబర్ 86లో సాన మల్లేశం పేరు మీద ఉన్న 4.31 ఎకరాల భూమిని బుర్ర మాధవి అనే మహిళా కొనుగోలు చేశారు. భూమిని విక్రయించిన మల్లేశం మృతి చెందగా ఆ భూమిని కాజేయడానికి జడ్పీ మాజీ వైస్ చైర్మన్ శ్రీరాములు నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించి మృతుడి వేలిముద్ర, సంతకాన్ని ఫోర్జరీ చేసి తప్పుడు సాక్షులతో బలవంతంగా సంతకాలను చేయించాడు. మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసి శ్రీరాములుపై ఫోర్జరీ 468, 420 చీటింగ్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఐటీఐ ఏటీసీల్లో ప్రవేశాలు షురూ

» దరఖాస్తులకు ఆహ్వానం » 31 వరకు గడువు

» ఒక్కో ఏటీసీలో 172 సీట్లు

హనుమకొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఐటీఐలలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ఏటీసీ)లలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలో కాజీపేట ఐటీఐతో సహా మొత్తం తొమ్మిది ఐటీఐలలో ఆరు కొత్త కోర్సులలో ప్రవేశాలు జరుగుతాయి. కాజీపేట ఐటీఐ ఏటీసీ స్థలాభావం వల్ల ములుగు రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐలోనే ఏర్పాటవుతోంది. హనుమకొండ, వరంగల్ ఏటీసీల షెడ్లను కూడా ఈ ప్రాంగణంలోనే నిర్మిస్తున్నారు. వీటి నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావడంతో ఉపాధి శిక్షణా డైరెక్టర్ వీటిల్లో నిర్వహించే అత్యాధునిక ట్రేడ్లలో ప్రవేశాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. రెండో దశలో భాగంగా జరిగే ఈ ప్రవేశాలకు సంబంధించిన పోర్టల్ సోమవారం తెరుచుకుందని కాజీపేట ఐటీఐ ప్రిన్సిపాల్ వి.వెంకటేశ్వర్ రావు తెలిపారు. కాజీపేట ఐటీఐ ఏటీసీకి సంబంధించిన వివరాలకు టోల్ ఫ్రీ నెం 080 69434343 లేక 7013988677, 7013397132కి ఫోన్ చేసి వివరాలను తెలుసుకోవచ్చునని పేర్కొన్నారు.

హత్యకేసులో ఒకరికి జీవిత ఖైదు

వరంగల్ లీగల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు, రూ. 30 వేల జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా రెండో అదనపు సెషన్స్ జడ్జి మనీషా శ్రావన్ ఉన్నమ్ మంగళవారం తీర్పు చెప్పారు. మృతుడి తల్లి కున్సోతు వీరమ్మకు రూ. 8 లక్షల పరిహారం చెల్లించాలని న్యాయమూర్తి ప్రభుత్వాన్ని ఆదేశించారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. ఖానాపూర్ మండలం బుధరావుపేట శివారులోని బోడియా తండాకు చెందిన కున్సోతు రవి భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఆరు సంవత్సరాల నుంచి బుధరావుపేటకు చెందిన షేక్ దావూద్ వద్ద రవి ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో షేక్ దావూద్ తరచూ కున్సోత్ రవి ఇంటికి వచ్చిపోతుండేవాడు. ఈ క్రమంలో రవి భార్యతో దావూద్‌కు వివాహేతర సంబంధం ఏర్పడింది. గమనించిన రవి తన భార్యను హెచ్చరించి ఇంటికే పరిమితం చేశాడు. దీంతో రవి భార్య, షేక్ దావూద్ ఇద్దరు కలిసి రవి అడ్డుతొలగించుకోవాలని నిర్ణయించుకున్నారు. 2021 ఏప్రిల్ 23న రవికి షేక్ దావూద్ మద్యం తాగించాడు. అనంతరం స్పృహ తప్పిపడిపోయిన రవి తలపై కర్రతో కొట్టి బావిలో పడేశాడు. కోర్టు పీసీ నమిండ్ల మహేష్ సాక్ష్యులను ప్రవేశపెట్టగా లైజన్ అధికారిగా ఏఎస్సై హరికృష్ణ, ఫోరెన్సిక్ నిపుణుడు డాక్టర్ జి. పాండు కేసులో సహకరించారు. దర్యాప్తు అధికారులుగా ఏసీపీ సీహెచ్. ఆర్‌వీ ఫణీందర్, నర్సంపేట ప్రస్తుత ఏసీపీ పి. రవీందర్‌రెడ్డి వ్యవహరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఎం.సత్యనారాయణ, సంతోషిని కేసు వాదించారు.

కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయం తనిఖీ

వరంగల్ కార్పొరేషన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ పరిధిలోని కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయాన్ని మేయర్ గుండు సుధారాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ పని చేస్తున్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనుల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలతో సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. అనంతరం అక్కడి రిజిస్టర్, హాజరు పట్టికలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాశిబుగ్గ డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఆర్‌వో షహజాది బేగంతో పాటు అక్కడి సిబ్బంది ఉన్నారు.

అంగట్లో 'అమ్మ'తనం

(5వ పేజీ తరువాయి)

ఉంటుంది. కానీ ఇలాంటి పరీక్షలు జరగకుండానే వీర్యాన్ని నేరుగా ఇస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అదే విధంగా అండం దానం చేసే మహిళ 21 సంవత్సరాలు నిండి ఉండటంతోపాటు ఒక శిశువుకు జన్మనిచ్చి ఉండాలని నిబంధన కూడా ఉంది. వీటిని తుంగలో తొక్కుతూ ఇష్టారాజ్యంగా సంతాన సాఫల్య కేంద్రాలు వ్యవహరిస్తున్నట్లు సమాచారం. కొందరు వైద్యులు అయితే వీర్యకణాల సంఖ్య తక్కువ ఉన్నాయి.. మందులు వాడమంటూ చికిత్స ఇస్తూ కొన్ని రోజుల తరువాత వీర్యకణాలు పెరిగాయి అంటూ డబ్బులు దండుకుంటున్నట్లు తెలుస్తోంది.

నిర్లక్ష్యంగా ఆరోగ్యశాఖ..

నగరంలోని సంతాన సాఫల్య కేంద్రాలపై నిఘా పెట్టాల్సిన వైద్య ఆరోగ్యశాఖ మామూళ్ల మత్తులో నిద్రపోతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నగరంలోని ఏ సంతాన సాఫల్య కేంద్రం కూడా సరైన రికార్డులు పంపడం లేదని తెలుస్తోంది. డోనర్ బ్యాంకులు డోనర్ల ఐడీల వివరాలు కూడా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిశీలన చేయడం లేదు. ఇప్పటికైనా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇలాంటి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారిక సెంటర్లు కొన్నే..

హనుమకొండ జిల్లాలో 12 ఏఆర్‌టీ సెంటర్లు, వరంగల్ జిల్లా పరిధిలో నాలుగు సెంటర్లు మాత్రమే అధికారికంగా గుర్తింపు పొందాయి. ఈ సెంటర్లలో కొన్నింటిలో ఏఆర్‌టి 1 సేవలు, మరికొన్నింటిలో ఏఆర్‌టీ 2 సేవలతోపాటు సరోగసి బ్యాంక్ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఇవన్నీ నిబంధనల ప్రకారం పని చేస్తున్నాయా లేదా అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తరుచూ తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ తనిఖీలు లేకపోవడం వల్ల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపణలు వినవస్తున్నాయి.



59వ డివిజన్‌లో పర్యటిస్తున్న కమిషనర్ చహత్, అధికారులు

ప్లాస్టిక్ కవర్లను వినియోగించొద్దు

బల్దియా కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

జూలైవాడ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కవర్లను వినియోగించరాదని బల్దియా కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ సూచించారు. మంగళవారం గ్రేటర్ 59వ డివిజన్‌లోని రైతుబజార్, రాజీవ్ పార్క్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ పర్యావరణానికి హానికరమైన ప్లాస్టిక్ కవర్ల రైతు బజార్‌లో నిషేధించాలని ఇందుకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రాజీవ్‌పార్కు ట్రాక్, మెయింటనెన్స్, కనకదుర్గ కాలనీలోని పార్కును పరిశీలించారు. డ్రెయినేజీలు, రోడ్లు, పారిశుధ్య పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ గుజ్జుల వసంత కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో గుజ్జుల మహేందర్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ రాజారెడ్డి, డీఈ సారంగపాణి, ఏఈ మేనక, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ రమేశ్, భరత్‌బాబు, శ్రీనివాస్, జవాన్లు సతీష్, మహేశ్, భిక్షపతి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

కేఎంసీలో ఎథిక్స్ తరగతులు

వరంగల్ మెడికల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మెడికల్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం ఎథిక్స్ అవేర్‌నెస్ ప్రోగ్రాంను మంగళవారం కేఎంసీలోని ఎన్ఆర్ఐ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య నిర్వహించగా, ముఖ్య అతిథులుగా టీజీఎంసీ చైర్మన్ డాక్టర్ నరేశ్ కుమార్, ఎథిక్స్ కమిటీ సభ్యులు డాక్టర్ శేషమాధవ్‌లు తరగతులను నిర్వహించారు. జూనియర్ డాక్టర్లు విలువలతో కూడిన వైద్యం అందించాల్సిన అవసరం ఉందని, ఎన్ఎంసీ, టీజీఎంసీ విధించిన నిబంధనలు పాటిస్తూ మానవత్వంతో కూడిన వైద్య సేవలను సమాజానికి అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 500 మందికి పైగా పోస్ట్ గ్రాడ్యుయేట్ జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

వరంగల్ మెడికల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రిలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ. 15,600 చెల్లించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి సింగారపు బాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఎంజీఎం ఆస్పత్రి ఆవరణలో శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ గార్డ్, కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సింగారపు బాబు మాట్లాడుతూ.. జీవో 60 ప్రకారం రూ. 15,600 చెల్లిస్తామని అగ్రిమెంట్ చేసుకొని రూ. 11 వేలు ఇవ్వడం అన్యాయమన్నారు. అనంతరం ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నమిండ్ల సుమన్, కుమార్, చింతం అశోక్, సమ్మయ్య, భిక్షపతి, పి.రమాదేవి, పుష్ప, వినోద, సాంబరాజు, మహేందర్, సతీష్, రమేశ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాల సేకరణకు టెండర్

వరంగల్ కార్పొరేషన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని కాజీపేట, కాశిబుగ్గ సర్కిల్ పరిధిలోని చికెన్ వ్యర్థాల సేకరణకు టెండరు నిర్వహించారు. మంగళవారం ప్రధాన కార్యాలయంలోని అదనపు కమిషనర్ చాంబర్‌లో బహిరంగా వేలం పాట నిర్వహించినట్లు ఏసీ జోనా వెల్లడించారు. కాశిబుగ్గ సర్కిల్ పరిధిలో ఇద్దరు పోటీ పడగా ఎమ్డీ మహబూబ్ అనే వ్యక్తి రూ. 21.10 లక్షలు, కాజీపేట సర్కిల్ పరిధిలో ఇద్దరు పోటీ పడగా ఎమ్డీ రియాజ్ రూ. 21.50 లక్షలకు టెండర్లు దక్కించుకున్నారు. ఈ వేలం పాట కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డీసీ ప్రసన్నరాణి, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, సూపరింటెండెంట్ ఉమా దేవేందర్ పల్గొన్నారు.

వినియోగదారుల సమన్వయ సమితి

చైర్మన్‌గా చక్రపాణి



చక్రపాణి సుదర్శన్

హనుమకొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి చైర్మన్‌గా సాంబరాజు చక్రపాణి ఎన్నికయ్యారు. ఈనెల 26, 27 తేదీల్లో తిరుపతిలో వినియోగదారుల ప్రతినిధుల జాతీయ సమావేశం జరిగింది. ఇందులో దక్షిణాది రాష్ట్రాల సమన్వయ సమితి నూతన కమిటీ ఎన్నికైంది. చైర్మన్ చక్రపాణితో పాటు వైస్ చైర్మన్‌గా న్యాయవాది రాయబారపు భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా మొగిలిచెర్ల సుదర్శన్, సంయుక్త కార్యదర్శిగా మురహరి కార్తీక్, చీఫ్ ప్యాట్రన్‌గా విఖ్యాత్ సేనాయ్, చీఫ్ అడ్వయిజరీగా జయాశర్మ ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలిగా గంటా రజినీ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ మేదా రామకృష్ణ, గోవా రాష్ట్ర కన్వీనర్‌గా ప్రవీణ్ తన్వాడే, కర్నాటక రాష్ట్ర కన్వీనర్‌గా కార్తీక్, కేరళ కన్వీనర్‌గా వివేక్, తమిళనాడు కన్వీనర్‌గా జకరీస్, కో కన్వీనర్‌గా విఘ్నేష్, మోతుల ఎంపికయ్యారు. దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి పూర్తి కార్యవర్గ కాలపరిమితి మూడు సంవత్సరాలు. ఏడు రాష్ట్రాల్లో వినియోగదారుల సంఘాల పటిష్ఠత, హక్కుల పరిరక్షణ, వినియోగదారుల రక్షణ చట్టాల్లో వినియోగదారుల కమిషన్లకు మరింత అధికారాల కోసం కృషి చేయనున్నట్టు చక్రపాణి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

» ఆలయాల్లో సందడి
» ప్రత్యేక పూజలు చేసిన భక్తులు

మడికొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో మంగళవారం నాగ పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కొలువై ఉన్న నాగేంద్రస్వామికి భక్తులు పల, పంచామృతాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో అభిషేకాలు చేశారు. శివాలయం, రామాలయం ఈవోలు శేషభారతి, సత్యనారాయణ ఆధ్వర్యంలో అర్చకులు అభిలాష్‌శర్మ, విష్ణువర్ధనాచార్యులు, సత్యనారాయణశర్మ శాస్త్రోక్తంగా నిర్వహించిన పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నాగేంద్రస్వామిని దర్శించుకొని చల్లగా చూడాలంటూ మొక్కుకున్నారు.

హసన్‌పర్తి : మండల కేంద్రంలోని బొత్తలకుంట నాగమయ్య దేవాలయంలో మంగళవారం ఆలయ చైర్మన్ వీసం పాపిరెడ్డి ఆధ్వర్యంలో నాగుల పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు నాగమయ్యల ఆలయ ప్రాంగణంలోని పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగుల పంచమి సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.



హసన్‌పర్తిలో పూజలు చేస్తున్న భక్తులు

వడ్డెపల్లి : హనుమకొండ 56వ డివిజన్ గోపాల్‌పూర్ జవహర్‌కాలనీలోని నాగమయ్య గుడిలో నాగుల పంచమి వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు నాగమయ్య గుడిలోని పుట్టలో పాలు పోసి స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేసి నైవేద్యా న్ని సమర్పించుకున్నారు. కార్యక్రమంలో జవహర్‌కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బైరి సోమయ్య, ప్రధాన కార్యదర్శి యతిరాజుల సునీల్, స్థానిక నాయకులు బండి హరీష్ ముదిరాజ్, పులి రాజేష్, తమ్మల శోభారాణి, కొత్తపల్లి అమర్‌నాథ్, అన్న విజయ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ గార్డెన్‌లో..

వడ్డెపల్లి (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో నాగులపంచమి వేడుకలు శివాలయం అర్చకులు సీతారాం వినాయకుడి గుడి పూజారి రత్నాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళలు గార్డెన్‌లోని పాలుపోసి నాగేంద్రస్వామిని భక్తి ప్రపత్తులతో కొలిచారు. కార్యక్రమంలో పబ్లిక్ గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ బూర గాంధీ, గౌరవ అధ్యక్షుడు చల్లా లింగారెడ్డి, ప్రతినిధులు దాసు, రమణాచారి, గిరిజ, అన్నపూర్ణ, స్వర్ణలత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సేవా స్ఫూర్తి... స్పృహార్తి

వైద్యురాలిగా స్థిరపడాలని కన్న కలలు ఆమెను కాస్మోటాలజీ వైపు నడిపించాయి. ఎందరికో ఉచితంగా శిక్షణ ఇచ్చినా ఏదో వెలితి... అదే తనను సామాజిక సేవ వైపు నడిపించిందంటారు వీరంకి భారతీదేవి. 'స్పృహార్తి చారిటబుల్ ట్రస్ట్' ద్వారా చేపడుతున్న కార్యక్రమాల గురించి 'నవ్య'తో ప్రత్యేకంగా మాట్లాడారు.



"నా పుట్టినిల్లు హైదరాబాద్. మెట్టినిల్లు విజయవాడ. నాన్న ఈడే విష్ణువర్ధనరావు సొంత ఊరు గుడివాడ. ఆయన ఎల్ఐసీలో బ్రాంచ్ మేనేజర్‌గా ఉద్యోగం చేసేవారు. ఉద్యోగ రీత్యా మా కుటుంబం సికింద్రాబాద్‌లోని వెస్ట్ మారేడ్‌పల్లిలో స్థిరపడింది. అమ్మ కోకిలాదేవి పరోపకారిణి బాలిక ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేశారు. వారి నలుగురు పిల్లల్లో నేను మూడో సంతానం. నా పాఠశాల విద్యంతా సికింద్రాబాద్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ హైస్కూల్‌లో పూర్తయింది. కస్తూర్బా గాంధీ కాలేజీలో ఇంటర్ చదివాను. కీస్ డిగ్రీ కాలేజీలో బీఏ సైకాలజీ పూర్తి చేశాను. డిగ్రీ మూడో సంవత్సరం చదువుతుండగా వివాహమైంది. నా భర్త వీరంకి రాజశేఖరరావు... పటమటలో ఒక ప్రైవేటు విద్యా సంస్థను నడుపుతున్నారు.

శ్రీమంతంతో శ్రీకారం

వైద్యురాలిగా స్థిరపడాలనేది నా కల. అయితే ఇంటర్మీడియట్‌లో అనారోగ్యం కారణంగా అది సాధ్యం కాలేదు. నాకు పాఠశాల నుంచే బ్యూటీషియన్ కోర్సు నేర్చుకోవాలని ఉండేది. నా ఆసక్తిని గమనించిన అమ్మ సంబంధిత కోర్సులకు పంపేది. పెళ్లయిన తర్వాత బెంగళూరులో కాస్మోటాలజీలో డిప్లమో చేశాను. ఆ తరువాత ఎందరికో శిక్షణ అందించాను. కానీ ఏదో వెలితిగా అనిపించేది. సమాజానికి ఏదైనా చేయాలనే తపన పెరిగింది. కాగా... విజయవాడలో టెర్రస్ గార్డెన్ ప్రియుల గ్రూప్ ఒకటుంది. అందులో నేనొక సభ్యురాల్ని. ఈ గ్రూపులోనే తిరుమలశెట్టి మాధురి అనే ఐటీ ప్రొఫెషనల్ పరిచయమ్యారు. మేమిద్దరం స్నేహంగా ఉండేవాళ్లం. ఒక రోజు మాకు పరిచయం ఉన్న వారు వచ్చి "విజయవాడలోని ఒక పేద గర్భిణికి సీమంతం చేయించుకోవాలని కోరిక. కానీ ఆ ఆమె తల్లిదండ్రులకు ఆ స్తోమత లేదు. మీరు సాయపడతారా?" అని అడిగారు. నేను, మాధురి.. మాకు పరిచయం ఉన్న మరికొందరి సాయంతో ఆ గర్భిణికి శ్రీమంతం చేశాం. ఆ క్షణం ఆమె కళ్లలో ఆనందబాష్పాలు మా అందరినీ కదిలించాయి. ఆమె తల్లిదండ్రులు తర్వాత మాకు ఫోన్ చేసి చాలా భావోద్వేగానికి లోనయ్యారు. ఇది జరిగిన కొన్ని రోజులకు సామాజిక సేవలోకి దిగితే బాగుంటుందని మా అందరికీ అనిపించింది. ముందుగా



ఐదుగురితో ఒక గ్రూప్ ఏర్పాటు చేశాం.

గుప్పెడు బియ్యం...

మా సేవా కార్యక్రమాలను మా ఇళ్ల నుంచే మొదలుపెట్టాలని భావించాం. దీనికి 'గుప్పెడు బియ్యం' అని నామకరణం చేశాం. మాకు పరిచయం ఉన్న స్కూళ్లకు మా పిల్లలు చదువుతున్న స్కూళ్లకు వెళ్లి యాజమాన్యాలను సంప్రతించాం. ఆ స్కూళ్లలో ఒక ప్లాస్టిక్ డబ్బాను ఏర్పాటు చేశాం. విద్యార్థులు ప్రతినెలా ఇంటి నుంచి గుప్పెడు బియ్యం తీసుకొచ్చి ఆ డబ్బాలో వేయాలని చెప్పాం. డబ్బా నిండగానే మేము ఆ బియ్యాన్ని తీసుకునేవాళ్లం. వాటితో టమాటా రైస్, పులిహోర, బిసిబెలా బాత్, కిచిడీ, సాంబార్ అన్నం తయారు చేయించేవాళ్లం. దాన్ని విద్యార్థులతోనే పేదలకు పంపిణీ చేయించేవాళ్లం. ఇది కొనసాగుతూ ఉండగా... మా సేవా కార్యక్రమాలకు ఒక వేదిక ఉండాలని సంకల్పించాం. ఆ సంకల్పం నుంచే 'స్పృహార్తి చారిటబుల్ ట్రస్ట్' ఆవిర్భవించింది. స్పృహతో చేసే సేవ పరిపూర్ణంగా ఉండాలని ఆలోచించి ఈ పేరు పెట్టాం. ఇప్పుడు మా ట్రస్ట్‌లో మొత్తం 50 మంది వరకు సభ్యులు ఉన్నారు. ఇప్పటికీ 'గుప్పెడు బియ్యం' ప్రాజెక్టును కొనసాగిస్తున్నాం. మేము ఎవరి నుంచీ విరాళాలు సేకరించడం లేదు. ఏదైనా కార్యక్రమం చేయాలనుకున్నప్పుడు మా సభ్యులంతా కలిసి చర్చించుకుంటాం. దానికి అయ్యే ఖర్చును మేమే భరిస్తాం. ప్రతి ఏడాది ఆగస్టు 15వ తేదీన ప్రభుత్వాసుపత్రిలో జన్మించిన... పేద కుటుంబాల శిశువులకు బేబీ కిట్లు అందజేస్తున్నాం. ఆ కిట్‌లో ఒక నెలకు సరిపడా సరుకులు ఉంటాయి.

'ఆత్మీయం'గా...

మేము 'ఆత్మీయులు' పేరుతో వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నాం. ట్రస్ట్‌లోని సభ్యులు ఎప్పుడు ఏ కార్యక్రమం చేయాలో పోస్టు చేస్తారు. దానిపై చర్చించుకుని ముందుకు సాగుతాం. బడికి, ఇంటికి, ట్యూషన్‌కు మధ్య దూరం కారణంగా ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాల్లోని ఆడపిల్లలకు ఉచితంగా సైకిళ్లు అందజేశాం. దీని కోసం 'సంప్రదాయ వస్త్రధారణ' పేరుతో కళాశాల విద్యార్థులకు ఫ్యాషన్ షో నిర్వహించి, దానికి టికెట్ నిర్ణయించాం. వచ్చిన డబ్బుతో సైకిళ్లు కొనుగోలు చేసి పంపిణీ చేశాం. మూగ, చెవుడు, అంధత్వం ఉన్న వారిని ఆదుకోవడానికి దివ్యాంగులతో సంగీత విభావరి ఏర్పాటు చేశాం. తద్వారా పోగయిన మొత్తంతో వారికి అవసరమైన పరికరాలు తయారు చేయించి ఇచ్చాం. గత ఏడాది సెప్టెంబరులో విజయవాడను వరదలు ముంచేసినప్పుడు... జక్కంపూడిలోని వైఎస్సార్ కాలనీని మా ట్రస్ట్ దత్తత తీసుకుంది. అక్కడ ఉన్న నిర్వాసితులకు అల్పాహారాన్ని, భోజన వసతిని 'స్పృహార్తి' కల్పించింది.

• గుడాల శ్రీనివాస
ఫొటోలు: పి.రాజేష్

అభిరుచితో అధిగమించా..

మతిస్థిమితం లేని పిల్లగా ముద్ర పడిన ఒక అమ్మాయి, చిత్రకళతో మానసిక ఆరోగ్యం మీద పైచేయి సాధించింది. అంతటితో ఆగిపోకుండా, 'ది రెడ్ డోర్' అనే ఆన్‌లైన్ వేదిక ద్వారా తన లాంటి మానసిక రోగులకు బాసటగా నిలుస్తోంది. ఆమే పూణేకు చెందిన 22 ఏళ్ల రేష్మా వల్లియప్పన్. స్కిజోఫ్రేనియా(ఎవరో ఉన్నట్టు, మాట్లాడుతున్నట్టు ఊహించుకునే మానసిక రుగ్మత)ను అధిగమించి కళారంగం వైపు సాగిన రేష్మా ప్రయాణం ఆమె మాటల్లోనే...



"మా నాన్నది తమిళనాడు. అమ్మది మహారాష్ట్ర. ఇంట్లో నిరంతరం గొడవలు జరుగుతుండేవి. అమ్మతో నాకు ఏదో ఒక విషయంలో వాదులాట జరిగేది. దాంతో ప్రశాంతత లేకుండా పోయేది. మరోపక్క ఏదో భయం నన్ను వెంటాడుతుండేది. ఎవరో పక్కన ఉన్నట్లు, మాట్లాడుతున్నట్లు అనిపించేది. దాంతో నరకం అనుభవించా. వీటికితోడు పాఠశాలలో సీనియర్ అబ్బాయిల నుంచి లైంగిక వేధింపులు. వీటన్నిటినీ తప్పించుకోవాలని 14 ఏళ్ల వయసులోనే ఇంట్లో నుంచి పారిపోయా. అమ్మాయి అని తెలిస్తే ఇబ్బందులు ఎదురవుతాయని అబ్బాయిలా జుట్టు కత్తిరించుకుని, టీ షర్ట్, ప్యాంట్ వేసుకున్నా. అన్ని జాగ్రత్తలు తీసుకున్నా అత్యాచారానికి బలయ్యాను. ఎవరికి చెప్పాలో, ఎలా చెప్పాలో అర్థంకాక చాలా రోజులు నాలో నేనే కుమిలిపోయా. తిరిగి ఇంటికి వచ్చాక కూడా మానసికంగా కుంగిపోయా.

జబ్బు బయటపడిందిలా...

వయసు పెరుగుతోంది. కానీ గత అనుభవాల నేపథ్యంలో భయం నన్ను వెంటాడుతూనే ఉంది. నాలో నేనే మాట్లాడుతుండడం చూసి స్నేహితులు నవ్వుకునేవారు. వెక్కిరించేవారు. ఈ అవమానాలు, అవహేళనలు తట్టుకోలేక ఆత్మహత్యకు ప్రయత్నించా. కానీ బతికి బయటపడ్డా. ఆత్మహత్యా ప్రయత్నం చేసి ఆస్పత్రిలో ఉన్నప్పుడే నాకు స్కిజోఫ్రేనియా అనే మానసిక వ్యాధి ఉందని వైద్యులు గుర్తించారు. దీని నుంచి బయటపడేందుకు చాలా మందులు వాడాను. ఆ మందుల వలన రోజుకు దాదాపు 20 గంటలు నిద్రపోయేదాన్ని. ఎన్నో ప్రతికూల ప్రభావాలు కూడా ఎదుర్కొన్నా. చివరికి మందులన్నీ మానేయాలని నిర్ణయించుకున్నా. అప్పుడు మా నాన్న తోడుగా నిలిచారు. నాలో నాకు వినిపించే మాటలే నన్ను బొమ్మలు వేయమని ప్రోత్సహించాయి. దాంతో మందులను పక్కన పెట్టి నాకిష్టమైన చిత్రకళ మీద దృష్టి సారించి, నా ఆలోచనలకు బొమ్మల రూపం ఇవ్వడం ప్రారంభించా. ఆ బొమ్మలను గమనించిన మా నాన్న బొమ్మలు వేయడానికి అవసరమైన వస్తువులను కొనుక్కొచ్చి ఇచ్చారు. కాలం గడిచే కొద్దీ చిత్రకళతో నాలో మార్పు వచ్చింది. స్కిజోఫ్రేనియా నుంచి బయటపడ్డా. నేను గీసిన చిత్రాలను పూణే, ఢిల్లీ, నేపాల్‌లలో జరిగిన పలు ఎగ్జిబిషన్లలో ప్రదర్శించా.





అభిరుచితో సాధ్యమే!

"అభిరుచులు మానసిక సమస్యలను దూరం చేయడంలో ఎంతో ఉపయోగపడతాయి. ఇష్టమైన పని చేస్తే మనసుకు హాయిగా అనిపిస్తుంది. ఈ ప్రశాంతత మరే చికిత్స తీసుకున్నా లభించదు. నాకు ఇష్టమైన చిత్రకళ నాకు ఓ థెరపీలా పని చేసింది. అయితే అందరికీ బొమ్మలు గీయడం ఇష్టం ఉండకపోవచ్చు. ఎవరికి నచ్చిన పని వారు చేసి ఇలాంటి సమస్యలను దూరం చేసుకోవచ్చు. కానీ అసలు అన్నింటి కన్నా పెద్ద సమస్య ఏంటంటే చాలా మంది తమకు మానసిక సమస్య ఉందని ఒప్పుకోవడానికి గానీ, ఎవరికీ చెప్పడానికి గానీ ఇష్టపడరు. తెలిస్తే అందరూ ఏమనుకుంటారో, ఏమంటారో అనే భయం. కానీ నిజానికి సమస్యలను పంచుకున్నప్పుడే అందరిలో మానసిక సమస్యల గురించి ఉన్న అపోహలు, భయాలు దూరమవుతాయి. సరైన చికిత్స అందుతుంది."

అవగాహన కల్పించేందుకు..

అసలు చాలామందికి స్కిజోఫ్రేనియా గురించి తెలియదు. ఈ సమస్య ఉన్నవారిని పిచ్చివాళ్లని చూసినట్లు చూస్తారు. అందుకే నాలా మానసిక సమస్యలతో బాధపడేవారికి అండగా నిలవాలని మానసిక రుగ్మతలపై అవగాహన కల్పించేందుకు 'ది రెడ్ డోర్' అనే వేదికను నెలకొల్పా. ఇందులో వర్క్‌షాప్‌లు, నిపుణుల ద్వారా మానసిక సమస్యలపై అవగాహన కల్పిస్తా. అంతే కాకుండా నా చిత్రకళలను బహిరంగ ప్రదేశాల్లో ప్రదర్శించి, అక్కడి వారితో నా అనుభవాలు పంచుకుంటా. ఇలా ప్రజల్లో మానసిక రుగ్మతలపై అవగాహన కల్పిస్తున్నా. ప్రజలు మా వద్దకు వచ్చి రుగ్మతల గురించి తెలుసుకోవాలని వేచి ఉండకుండా, మేం వారి వద్దకు వెళ్లి వివరిస్తాం. అలాగే మానసిక సమస్యలున్న వారు, వాటిని అధిగమించిన వారు తమ అనుభవాలను పంచుకునేందుకు 'మైండ్ ఆర్క్స్' అనే ఆన్‌లైన్ వేదిక ఏర్పాటు చేశా. 'మైటీస్ ఆఫ్ లైఫ్', 'ట్విన్ బుద్ధా'.. వంటి నా ప్రసిద్ధ చిత్రకళలు నేను ఎదుర్కొన్న గాయాలను, పరిస్థితులను ప్రతిబింబిస్తాయి. ఇక స్కిజోఫ్రేనియా నేపథ్యంలో చిత్రీకరించిన 'ఏ డ్రాప్ ఆఫ్ సన్‌షైన్' అనే డాక్యుమెంటరీలో నటించా. ఈ డాక్యుమెంటరీకి బెస్ట్ ఎడ్యుకేషనల్ ఫిల్మ్ విభాగంలో జాతీయ అవార్డు కూడా దక్కింది."

చదరంగంలో దివ్య శకం

దివ్యా దేశ్‌ముఖ్... ఇప్పుడు దేశమంతా మారుమోగుతున్న పేరు. 'మహిళల చెస్ వరల్డ్ కప్' గెలిచి, 'గ్రాండ్‌మాస్టర్' హోదా సాధించిన 19 ఏళ్ల దివ్యకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభిస్తున్నాయి. 'ఆలోచించాల్సింది ప్రత్యర్థి ఎవరనేది కాదు, ఆటలో ఎలా గెలవాలనే దాని గురించే' అంటుంది దివ్య.



- "క్రీడాకారిణిగా ఎప్పటికప్పుడు నా లక్ష్యాలు మారుతూ ఉంటాయి. కానీ ఆటలో నేను పొందే ఆనందం మాత్రం శాశ్వతం. దాన్ని ఎల్లప్పుడూ ఆస్వాదిస్తాను"
- ఇష్టమైన ఆటలు(చెస్ కాకుండా) - ఫుట్‌బాల్, సైక్లింగ్, ట్రెక్కింగ్

దివ్య తండ్రి జితేంద్ర వైద్య కళాశాలలో ప్రొఫెసర్. తల్లి నమ్రత కూడా డాక్టరే! దివ్యను, ఆమె అక్కను బ్యాడ్మింటన్ ఆటగాళ్లను చేయాలని తల్లితండ్రులు ప్రయత్నించారు. కానీ దివ్య చిన్నప్పుడు బలహీనంగా ఉండేది. బ్యాడ్మింటన్ ఆడే శక్తి ఉండేది కాదు. దీనితో దివ్య బ్యాడ్మింటన్‌కు గుడ్‌బై చెప్పేసింది. ఇంట్లో కూర్చుని ఆడే గేమ్ కాబట్టి చదరంగం వైపు ఆమె దృష్టి మళ్లింది. దివ్యకు చదరంగంలో తొలి కోచ్ ఆమె తండ్రే! కాలేజీ నుంచి వచ్చిన తర్వాత దివ్యతో ప్రతి రోజూ గేమ్ ఆడేవారు. దివ్య వేస్తున్న ఎత్తులకు చిత్తయిన జితేంద్ర ఆమెను సుప్రసిద్ధ కోచ్ రాహుల్ జోషి దగ్గర చేర్చారు. ఆ తర్వాత దివ్య ఎప్పుడూ వెనక్కి తిరిగి చూడలేదు.

ఇంతింతై...

'ఇంతింతై... వటుడింతై' అన్నట్లు చిన్నప్పుడే అసాధారణ ప్రజ్ఞ కనబరచిన దివ్య చెస్ సర్క్యూట్స్‌లో ఎదగటం మొదలుపెట్టింది. 2023 నాటికి 'ఇంటర్నేషన్ మాస్టర్ హోదా' సాధించింది. ఆ ఏడాది జరిగిన ఆసియా ఉమెన్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో కోనేరు హంపీని ఓడించి సంచలనం సృష్టించి ఛాంపియన్‌గా నిలిచింది. 2024లో వరల్డ్ జూనియర్ గర్ల్స్ ఛాంపియన్ టైటిల్‌ను కూడా గెలుచుకుంది.

అభిప్రాయాలు స్పష్టంగా...

చెస్ ఆడటానికి వేసే ఎత్తుల పట్ల స్పష్టత ఉండాలి. దివ్య తన మనస్సులోని అభిప్రాయాలను ఎప్పుడూ దాచుకోలేదు. గత ఏడాది జనవరిలో నెదర్లాండ్స్‌లో జరిగిన టాటా స్టీల్ మాస్టర్స్ టోర్నమెంట్‌లో తనకు ఎదురయిన అనుభవాలను ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. ఆ సమయంలో ఆ పోస్ట్ ప్రపంచవ్యాప్తంగా పెద్ద సంచలనంగా మారింది. "చాలా మందికి నా ఆట కన్నా.. నేను వేసుకున్న దుస్తులు.. మాట్లాడేటప్పుడు నా యాస.. నా జుట్టు వంటి అనవసర విషయాలపైనే ఆసక్తి ఎక్కువ. కొందరు అనుచిత వ్యాఖ్యలు కూడా చేస్తున్నారు. క్రీడాకారిణుల మీద అభిప్రాయాలు ఏర్పరుచుకోవటానికి ఆట ప్రాతిపదిక కావాలి. నా వేషభాషలు కాకూడదు" అని ఆమె పెట్టిన పోస్ట్‌తో... క్రీడా లోకంలో ఒక చర్చ ప్రారంభమయింది. కొందరు ఆమెకు మద్దతుగా నిలిచారు. మరికొందరు విమర్శించారు. కానీ దివ్య వాటిని పట్టించుకోలేదు.

ఇవి పాటించండి..!

రోజూ వంట చేసేటప్పుడు కొన్ని పొరబాట్ల వల్ల సమయం, గ్యాస్ వృథా అవుతూ ఉంటాయి. అలాకాకుండా వంటచేసేటప్పుడు ఏ జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం...



- కూరగాయలు, ఆకుకూరలు ఉడికించేటప్పుడు పాత్రల మీద మూతలు పెట్టాలి. చిన్న లేదా మధ్య స్థాయి మంట ఉండేలా చూసుకోవాలి. దీనివల్ల వాటిలోని పోషకాలు నశించిపోకుండా ఉంటాయి. చాలా వరకు గ్యాస్ ఆదా అవుతుంది.
- తాలింపు కోసం కరివేపాకు, ఉల్లిపాయలు, వెల్లుల్లి రెబ్బలు తదితరాలతోపాటు అవసరమైన వాటిని సిద్ధం చేసుకున్న తరవాతనే స్టవ్‌ను వెలిగించడం మంచిది. అలాగే కూరగాయలను కూడా ముందుగానే తరిగి పెట్టుకోవాలి. ఇలా చేయడం వల్ల గ్యాస్ వృథా కాకుండా ఉంటుంది.
- వండిన ఆహారాన్ని పదేపదే వేడిచేయకూడదు. దీనివల్ల గ్యాస్ వృథాకావడంతోపాటు అనారోగ్య సమస్యలు రావచ్చు.

హుందాతనాన్ని పెంచే ఎ-లైన్ డ్రెస్‌లు











ఫ్యాషన్‌తోపాటు సౌకర్యవంతంగా ఉండే దుస్తులకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు నేటి మహిళలు. ఈ కోవలోనే 'ఎ- లైన్ డ్రెస్‌లు ట్రెండింగ్‌లోకి వచ్చేశాయి. పేరుకు తగ్గట్టు ఇవి A ఆకారంలో కనిపిస్తుంటాయి. మినీలు, మిడ్డీలు, స్కర్టులు, మ్యాక్సీలు, లాంగ్ గౌన్లు అందుబాటులో ఉన్నాయి. కాలేజీలకు వెళ్లే యువతులతోపాటు కార్యాలయాలకు వెళ్లే మధ్య వయసు మహిళలు కూడా వీటిని ధరించడానికి ఇష్టపడుతున్నారు.

డ్రెస్ ఎలా ఉంటుందంటే...

ఎ- లైన్ డ్రెస్‌ను పై భాగంలో సన్నగా కింది భాగంలో వెడల్పుగా త్రిభుజాకారంలో ఉండేలా డిజైన్ చేస్తారు. మెడ, భుజాలు, నడుము భాగాలకు చక్కగా అమరేలా డ్రెస్ ఉంటుంది. నడుము నుంచి కాస్త వెడల్పుగా చూడడానికి చక్కని గౌన్‌లా కనిపిస్తుంది. శరీరాన్ని పట్టి ఉంచకుండా కాస్త వదులుగా హాయిగా అనిపించేలా ఉంటుంది. ఇష్టానుసారం డ్రెస్ పొడవును పెంచుకోవచ్చు లేదా తగ్గించుకోవచ్చు. ఈ డ్రెస్‌కు మ్యాచ్ అయ్యేలా లెగ్గింగ్స్ లేదా ఏ రకమైన ప్యాంట్ అయినా వేసుకోవచ్చు.

అందంగా ఇలా...

ఎ- లైన్ డ్రెస్‌లు ఎలాంటి శరీరాకృతి ఉన్నవారికైనా చక్కగా నప్పుతాయి. బొద్దుగా, సన్నగా, పొడవుగా, పొట్టిగా ఎలా ఉన్నవారైనా ఈ డ్రెస్‌ను ఎంపిక చేసుకోవచ్చు. మేని ఛాయను బట్టి రంగులు, డిజైన్లు ఎంచుకుంటే సొగసుగా కనిపిస్తారు. డెనిమ్, కాటన్, పాలిస్టర్, షిఫాన్, సిల్క్, నైలాన్, లెనిన్.. ఇలా అన్ని రకాల ఫ్యాబ్రిక్‌లతో ఎ- లైన్ డ్రెస్‌లను రూపొందిస్తున్నారు. స్లీవ్‌లెస్, పొడవు చేతులు, పొట్టి చేతులు, నడుముభాగంలో బెల్ట్ ఉండే రకాలు అందుబాటులో ఉన్నాయి. వి, యు, కాలర్ నెక్‌లు డ్రెస్ అందాన్ని పెంచుతాయి. ఫ్లోరల్ ప్రింట్‌లు, సాదా రంగులో ఉండే గౌన్, స్కర్ట్ టైప్ డ్రెస్‌లను యువతులు రోజువారీ వేసుకోవడానికి మొగ్గుచూపుతున్నారు. పెద్ద బోర్డర్ డిజైన్లు, అదనపు హంగులతో కూడిన లాంగ్ గౌన్లను ఫంక్షన్లలో ధరిస్తున్నారు. ఎ-లైన్ డ్రెస్‌ల మీద పెద్దగా ఆభరణాలు పెట్టుకోనవసరం లేదు. చేతులకు చక్కని వాచ్, అందమైన బ్యాంగిల్ లేదా బ్రాస్‌లెట్, చెవులకు జుమ్కీలు పెట్టుకుని పాదాలకు ఆకర్షణీయమైన శాండల్స్ వేసుకుంటే హుందాగా కనిపిస్తారు. మంచి హెయిర్ స్టయిల్, లైట్ మేకప్‌తో అందంగా మెరిసిపోవచ్చు.


రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన బస్సు

ఝార్ఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

» కన్వర్ యాత్రికుల బస్సును ఢీకొన్న ట్రక్కు..18 మంది మృతి

రాంచీ, జూలై 29: ఝార్ఖండ్‌లోని దేవగఢ్ జిల్లాలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కన్వర్ యాత్రికులు ప్రయాణిస్తున్న బస్సును ఓ ట్రక్కు ఢీ కొనడంతో 18 మంది మృతి చెందారు. మరో 10 మంది గాయపడ్డారు. ఝార్ఖండ్‌లో ప్రతి ఏడాది ఈ సమయంలో శ్రావణి మేళా జరుగుతుంది. ఈ సందర్భంగా దేవగఢ్‌లోని బాబా బైద్యనాథ్ ధామ్ ఆలయానికి భక్తులు వెళ్తుంటారు. ఈ క్రమంలో 35 మంది భక్తులు బస్సులో బైద్యనాథ్ ఆలయానికి బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న బస్సు జామునియా గ్రామ సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా ఎల్పీజీ సిలిండర్లతో వస్తున్న ట్రక్కు ఢీ కొట్టింది. ట్రక్కు ఢీ కొట్టిన వేగానికి బస్సు బోల్తా పడి నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో 18 మంది భక్తులు మృతి చెందారు, మరో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు.

న్యూయార్క్‌లో దుండగుడి కాల్పులు

» నలుగురి మృతి.. తర్వాత నిందితుడి ఆత్మహత్య

న్యూయార్క్, జూలై 27: ఎప్పుడూ రద్దీగా ఉండే అమెరికా న్యూయార్క్‌లోని మన్‌హట్టన్‌లో కాల్పుల కలకలం రేగింది. ఓ దుండగుడు కాల్పులకు పాల్పడంతో ఓ పోలీసు అధికారి సహా నలుగురు మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. అనంతరం దుండగుడు తనని తాను కాల్చుకొని మరణించాడు. సోమవారం ఈ ఘటన జరిగింది. బుల్లెట్ ప్రూఫ్ ధరించి ఏఆర్ రైఫిల్‌తో దుండగుడు వచ్చాడని, 345 పార్క్ అవెన్యూ భవనంలోకి ప్రవేశించి కాల్పులకు తెగబడ్డాడని పోలీసులు చెప్పారు. కాల్పుల శబ్దం విని ప్రజలు భవనం నుంచి పరుగులు తీశారని, ఆ తర్వాత దుండగుడు తనని తాను కాల్చుకొని మరణించాడని అధికారులు వెల్లడించారు. దుండగుడి వద్ద ఉన్న రైఫిల్‌కు లైసెన్స్ ఉందని, అయితే దాని గడువు ముగిసిందని గుర్తించారు. కాగా, కాల్పులకు గల కారణాలు తెలియరాలేదు.

పూరీ ఆలయంలో రహస్య గది లేదు: ఏఎస్ఐ

పూరీ, జూలై 29: ఒడిశాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పూరీలోని జగన్నాథ ఆలయంలో ఉన్న రత్న భాండాగారంలో ఎలాంటి రహస్య గది లేదని ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) స్పష్టం చేసింది. గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) సర్వే ఆధారంగా ఈ విషయాన్ని నిర్ధారించినట్లు 'ఎక్స్'లో పోస్టు చేసింది. పూరీ ఆలయంలోని రత్న భాండాగారం పునరుద్ధరణ, మరమ్మతు పనులను ఏఎస్ఐ ఇటీవల పూర్తి చేసింది. భీతర, బాహర అనే రెండు భాగాలుగా రత్న భాండాగారం (ఖజానా) ఉందని, వీటిని ఒక ఇనుప గేటుతో వేరు చేసి, బయట నుంచి తాళం వేశారని తెలిపింది. ఈ గదులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత గోడల్లో, భూమి కింద భాగంలో ఏవైనా రహస్య గదులు, అరలు ఉన్నాయేమో నిర్ధారించడానికి జీపీఆర్ సర్వే చేపట్టాలని నిర్ణయించామని పేర్కొంది.

కేరళలో విద్యార్థినులకు హెచ్‌పీవీ వ్యాక్సిన్లు

తిరువనంతపురం, జూలై 29: గర్భాశయ ముఖ ద్వార కేన్సర్ (సర్వైకల్ కేన్సర్) నివారణకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని మంగళవారం కేరళ ప్రభుత్వం నిర్ణయించింది. 11, 12 తరగతులు చదువుతున్న విద్యార్థినులకు హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (హెచ్‌పీవీ) వ్యాక్సిన్లు ఇచ్చేందుకు కార్యక్రమాన్ని రూపొందించనుంది. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి భేటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

భారీగా ఓట్లు తొలగిస్తే..

వెంటనే జోక్యం చేసుకుంటాం!

» ముసాయిదా జాబితాలో తప్పులుంటే.. ఆధారాలతో మా దృష్టికి తీసుకురండి
» పిటిషనర్లకు సుప్రీంకోర్టు సూచన
» బిహార్ 'ఎస్ఐఆర్' సవాల్ పిటిషన్లపై ఆగస్టు 12, 13 తేదీల్లో విచారణ



న్యూఢిల్లీ, జూలై 29: బిహార్ ఎన్నికల నేపథ్యంలో ఈసీ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై సుప్రీంకోర్టు మంగళవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఎస్ఐఆర్‌లో భారీగా ఓట్లు తొలగింపునకు గురైతే.. తాము వెంటనే జోక్యం చేసుకుంటామని స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం అనేది రాజ్యాంగ సంస్థ అని, అది చట్టప్రకారం పనిచేస్తుందని భావిస్తున్నామని జస్టిస్ సూర్యకాంత మిశ్రా, జస్టిస్ బాగ్చి ధర్మాసనం పేర్కొంది. ఎస్ఐఆర్ ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఆగస్టు 12, 13 తేదీల్లో విచారణ చేపడుతామని పేర్కొంది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. ఆగస్టు 1న ఎన్నికల కమిషన్ ప్రచురించే ఓటర్ల ముసాయిదా జాబితాలో అనేక మందిని ఓటర్లను తొలగిస్తున్నారని, దీని వలన కీలకమైన వారి ఓటు హక్కును కోల్పోతారని ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ సమయంలో 65 లక్షల మంది ఎన్యూమరేషన్ పత్రాలు సమర్పించలేదని, వారు చనిపోవడమో లేదా వేరే ప్రాంతాలకు వెళ్లిపోవడమే జరిగిందంటూ ఈసీ ఒక ప్రకటన చేసిందని భూషణ్ పేర్కొన్నారు. వీరంతా ఓటర్ల జాబితాలో చేరడానికి కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. దీనిపై జస్టిస్ సూర్యకాంత్ర మిశ్రా స్పందిస్తూ.. 'ఒక రాజ్యాంగబద్ధ సంస్థగా ఈసీ చట్టప్రకారం నడుచుకుంటుందని భావిస్తున్నాం. ఏమైనా తప్పు జరిగితే, ఆధారాలతో మీరు కోర్టు దృష్టికి తీసుకురండి. మీ వాదనలను వింటాం' అని స్పష్టం చేశారు. '65 లక్షల మంది ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితాలో ఉండవని మీ అనుమానం. ఓటర్ల జాబితాలో సవరణలు చేయాలని ఈసీ కోరుకుంటోంది. ఒకవేళ భారీఎత్తున ఓట్లు తొలగింపునకు గురైతే.. వెంటనే మేం జోక్యం చేసుకుంటాం. వారు చనిపోయారని చెబుతున్న వారిలో 15 మంది బతికున్నట్లుగా మీరు చూపించండి' అని జస్టిస్ బాగ్చి పేర్కొన్నారు. ఈసీ తరఫున రాకేశ్ ద్వివేది వాదనలు వినిపించారు. ముసాయిదా జాబితా ప్రచురణ తర్వాత కూడా ఎన్యూమరేషన్ పత్రాలను సమర్పించవచ్చన్నారు. ఈ నేపథ్యంలో ఈ అంశాలపై పిటిషనర్లు, ఈసీ ఆగస్టు 8లోగా రాతపూర్వక సమర్పణలు దాఖలు చేయాలని ధర్మాసనం సూచించింది.

న్యాయ సలహా ఇచ్చిన లాయర్లకు సమన్లు పంపొద్దు

న్యూఢిల్లీ, జూలై 29: క్రిమినల్ కేసుల్లో నిందితులకు న్యాయ సలహా ఇచ్చినంత మాత్రాన న్యాయవాదులను దర్యాప్తు సంస్థలు విచారణకు రావాలంటూ సమన్లు పంపకూడదని మంగళవారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఒకవేళ నేరానికి సహకారం అందించి ఉంటే లాయర్లకు సమన్లు పంపించవచ్చని తెలిపింది. క్లయింట్లకు న్యాయ సలహా ఇచ్చిన, విచారణ సందర్భంగా వారి తరఫున హాజరైన లాయర్లకు దర్యాప్తు సంస్థలు సమన్లు జారీ చేయడంపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టింది. ఓ కేసులో న్యాయ సలహా ఇచ్చినందుకు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు అరవింద్ దాతర్, ప్రతాప్ వేణుగోపాల్‌లకు ఈడీ సమన్లు పంపడంపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. సమన్లను ఈడీ ఉపసంహరించుకున్నప్పటికీ, లాయర్లను కేసులో భాగంగా చూడడాన్ని తీవ్రంగా పరిగణించి, దీనిపై స్పష్టత ఇవ్వాలని నిర్ణయించింది. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ తరఫున ఆ సంఘం అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ వాదనలు వినిపిస్తూ దర్యాప్తు సంస్థలు ఏకపక్షంగా సమన్లు పంపించడం న్యాయవాద వృత్తిని వణికిస్తుందని తెలిపారు. ఇదే కొనసాగితే సున్నితమైన క్రిమినల్ కేసులను ఎవరూ చేపట్టరని అన్నారు.

ప్రముఖ ఆర్థికశాస్త్రవేత్త మేఘ్‌నాథ్ దేశాయ్ కన్నుమూత



న్యూఢిల్లీ, జూలై 31: బ్రిటన్‌లో స్థిరపడ్డ ప్రముఖ భారతీయ ఆర్థిక శాస్త్రవేత్త మేఘ్‌నాథ్ దేశాయ్ (85) మంగళవారం కన్నుమూశారు. 2009లో పద్మ భూషణ్ అవార్డు అందుకున్న ఆయన ఆర్థికశాస్త్రంపై పలు పుస్తకాలు రాశారు. 1940లో గుజరాత్‌లోని వడోదరలో జన్మించిన ఆయన 1963లో పెన్సిల్వేనియా యూనివర్సిటీ నుంచి ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీ పట్టా పొందారు. రెండేళ్ల అనంతరం లండన్ వెళ్లారు. అక్కడి లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో లెక్చరర్‌గా చేరారు. 1991లో లేబర్ పార్టీ తరఫున హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో సభ్యునిగా నియమితులయ్యారు. 2022లో 'రాజకీయ ఆర్థిక వ్యవస్థ దారిద్ర్యం' పేరుతో చివరి పుస్తకం రాశారు.

ప్రళయ్ క్షిపణి పరీక్షలు విజయవంతం



బాలాసోర్/న్యూఢిల్లీ, జూలై 29: డీఆర్‌డీవో కొత్తగా అభివృద్ధి చేసిన వ్యూహాత్మక క్షిపణి 'ప్రళయ్'ను భారత్ విజయవంతంగా పరీక్షించింది. సంప్రదాయ వార్‌హెడ్‌లను మోసుకెళ్లే సామర్థ్యం కలిగిన ఈ స్వల్పశ్రేణి మిస్సైల్‌కు సోమ, మంగళవారాల్లో ఒడిసా తీరంలోని ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపంలో వరుస పరీక్షలు నిర్వహించినట్టు రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఉపరితలం నుంచి ఉపరితలంపై ఉన్న లక్ష్యాలను ఛేదించగల ఈ క్షిపణి 500 నుంచి 1000 కిలోల వార్‌హెడ్‌లను మోసుకెళ్లగలదు. ఇది 150- 500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు.

అయ్యో.. అని ఆస్పత్రిలో చేర్పిస్తే

చంపేశాడని 13నెలలు జైల్లో వేశారు!


రాజేశ్

భోపాల్, జూలై 29: పుణ్యం చేయబోతే పాపం ఎదురైందన్నట్లు.. అతడు అయ్యో పాపం అని అనారోగ్యంతో ఉన్న ఓ మహిళను ఆస్పత్రిలో చేర్పిస్తే, ఆమెను అతడే చంపేశాడంటూ పోలీసులు అరెస్టు చేశారు. సాయం చేసిన పాపానికి ఆ నిరుపేద కూలీ 13నెలల పాటు జైలు శిక్ష అనుభవించాల్సి వచ్చింది. మధ్యప్రదేశ్‌లో ఈ ఘటన జరిగింది. భోపాల్‌లోని ఆదర్శనగర్ మురికివాడలో ఉండే రాజేశ్ దినసరి కూలీ. అద్దె ఇంట్లో ఉండేవాడు. గతేడాది జూన్ 16న తన ఇంటి పక్క ఇంట్లో మహిళ అనారోగ్యంతో బాధపడుతూ.. ఆస్పత్రికి తీసుకువెళ్లాలని రాజేశ్‌ను కోరింది. అతడు ఆమెను దగ్గర్లోని ఆస్పత్రిలో చేర్పాడు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ అదే రోజు సాయంత్రం చనిపోయింది. పోలీసులు రాజేశ్‌ను విచారించారు. భయంభయంగా సమాధానం చెప్పడంతో అతడే ఆమెను చంపేసి ఉంటాడని అరెస్టు చేశారు. 9రోజుల పాటు పోలీస్ స్టేషన్‌లోనే ఉంచారు. తర్వాత కోర్టులో హాజరుపరిచారు. అప్పటివరకు రాజేశ్ కుటుంబసభ్యులకు కూడా సమాచారం ఇవ్వలేదు. లాయర్‌ను పెట్టుకోవడానికి రాజేశ్ దగ్గర డబ్బు లేకపోవడంతో కోర్టే అతని కోసం రీనా వర్మ అనే న్యాయవాదిని కేటాయించింది. సదరు మహిళ మరణానికి కారణం అనారోగ్యం అని మెడికల్ రిపోర్టుల్లో ఉండటం, గొంతు పిసకడం వల్లే చనిపోయిందని పోస్టుమార్టం రిపోర్టులో ఉండటాన్ని రీనా వర్మ గుర్తించారు. తర్వాత పోలీసుల నుంచి వివరాలు సేకరించగా, వారు ఆస్పత్రిలోని సీసీటీవీ ఫుటేజీలను చూడలేదని తేలింది. ఆ మహిళ ఆస్పత్రిలోనే చనిపోయినట్లు ఫుటేజీల్లో ఉండటంతో కోర్టు రాజేశ్‌ను నిర్దోషిగా ప్రకటించింది. అయితే, తనను అరెస్టు చేసినప్పుడు పోలీసులు తన అద్దె ఇంటికి తాళం వేశారని, ఇప్పుడు 13నెలల అద్దె ఎలా కట్టాలని రాజేశ్ వాపోతున్నాడు. జైలుకు వెళ్లొచ్చానని ఎవరూ తనకు పని కూడా ఇవ్వడం లేదని బాధపడుతున్నాడు.

నేడే నింగిలోకి నిసార్ నిఘా నేత్రం

సూళ్లూరుపేట, తిరుమల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఇస్రో మరో ప్రతిష్ఠాత్మక ప్రయోగానికి సిద్ధమైంది. భూమి అణువణువునూ స్కాన్ చేసి.. అడవులు, మైదానాలు, కొండలు, పర్వతాలు, పంటలు, జలవనరులు.. ఇలా అన్నింటినీ జల్లెడ పట్టే భూపరిశీలన ఉపగ్రహం నిసార్ (నాసా-ఇస్రో సింథటిక్ అపార్చర్ రాడార్) ప్రయోగానికి అన్ని ఏర్పాట్లూ పూర్తిచేసింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి బుధవారం సాయంత్రం 5:40 గంటలకు జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్ ద్వారా 2,392 కిలోల బరువున్న నిసార్ ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టనుంది. ఈ ప్రయోగానికి సంబంధించిన కౌంట్‌డౌన్‌ను మంగళవారం మధ్యాహ్నం 2:10 గంటలకు ప్రారంభించారు. కౌంట్‌డౌన్ 27:30 గంటలు కొనసాగిన తర్వాత షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్ నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లనుంది. ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ ఈ ప్రయోగం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో పూజలు చేశారు. ఇస్రో-నాసా సంయుక్తంగా తొలిసారిగా రూపొందించి ప్రయోగిస్తున్న ఉపగ్రహం కావడంతో ఇస్రో శాస్త్రవేత్తలతో పాటు అమెరికా నుంచి నాసా శాస్త్రవేత్తలు కూడా షార్‌కు చేరుకున్నారు. గతంలో చేపట్టిన రెండు ప్రయోగాలూ విఫలం కావడంతో శాస్త్రవేత్తలు జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్ ప్రయోగ విషయంలో అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నారు.


షార్‌లోని రెండో ప్రయోగ వేదికపై జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

యుద్ధంలో ప్రణయం



జూనియర్ ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ప్రధానపాత్రల్లో అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్న చిత్రం 'వార్ 2'. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచేశాయి. తాజాగా, ఫస్ట్ సింగిల్ గురించి అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. 'ఆవన్ జావన్' అంటూ సాగే ఈ పాటను ఈ వారంలోనే విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఇది 'బ్రహ్మాస్త్ర'లోని 'కేసరియా' (కుంకుమలా నువ్వే) పాట కంటే మరింత ఆకట్టుకుంటుందని చెప్పారు. హృతిక్ రోషన్, కియారా అడ్వానీపై చిత్రీకరించిన ఈ రొమాంటిక్ సాంగ్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని అన్నారు. ఆదిత్య చోప్రా నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు వస్తోంది.

ఉస్తాద్ క్లైమాక్స్ పూర్తి



తన సినిమాలను వరుస పెట్టి అభిమానుల ముందుకు తెచ్చేందుకు కొన్నాళ్లుగా సెట్స్‌లోనే ఎక్కువగా గడుపుతున్నారు పవన్ కల్యాణ్. చాలాకాలంగా ప్రేక్షకులు ఎదురుచూస్తున్న 'హరిహర వీరమల్లు' ఇటీవలే విడుదలైంది. మరోవైపు 'ఓజీ' చిత్రం షూటింగ్‌ను సైతం ఆయన పూర్తి చేశారు. ఇక ఆయన నటిస్తున్న మరో చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్' షూటింగ్ కూడా పూర్తయింది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ తెలిపింది. 'ఉస్తాద్ భగత్‌సింగ్ క్లైమాక్స్ షూట్‌ను పవన్ కల్యాణ్ పూర్తి చేశారు. నబకాంత మాస్టర్ పర్యవేక్షణలో ఎమోషనల్ యాక్షన్‌తో కూడిన ఎలక్ట్రిఫైయింగ్ క్లైమాక్స్ పూర్తయింది. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎంగా బిజీగా ఉన్నా, ఈ చిత్రం షూటింగ్‌ను ఆయన వేగంగా పూర్తి చేశారు. ఆయన అంకితభావం, శ్రమించే తత్వానికి ఇది నిదర్శనం' అని పేర్కొంది. ఈ సందర్భంగా సెట్‌లో దర్శకుడు హరీశ్ శంకర్ సూచనలను ఆసక్తిగా వింటున్న పవన్ కల్యాణ్ ఫొటోను విడుదల చేసింది. ఈ చిత్రంలో పవన్ కల్యాణ్ శక్తిమంతమైన పోలీసాఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన శ్రీలీల, రాశీఖన్నా కథానాయికలుగా నటిస్తున్నారు.

సంజూ బాబా లుక్కొచ్చింది



ప్రభాస్ హీరోగా మారుతి తెరకెక్కిస్తున్న హారర్ థ్రిల్లర్ 'రాజాసాబ్'. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ ఓ కీలక పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. మంగళవారం ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా చిత్రంలో ఆయన పోషిస్తున్న లుక్‌ను విడుదల చేసింది చిత్రబృందం. 'విలక్షణతకు, ఎనర్జీకి పర్యాయపదమైన సంజూ బాబాకు పుట్టిన రోజు శుభాకాంక్షలు' అని పేర్కొంది. టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచేసింది. డిసెంబర్ 5న చిత్రం విడుదలవుతోంది.

అందరినీ ఆకట్టుకుంటుంది



జగదీశ్ ఆమంచి కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తోన్న చిత్రం 'యముడు'. 'ధర్మో రక్షతి రక్షితః' దీని ట్యాగ్‌లైన్. శ్రావణి శెట్టి కథానాయిక. ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమంలో నిర్మాత బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ 'ఈ మధ్య విడుదలవుతున్న చిన్న చిత్రాలు అద్భుతాలు సృష్టిస్తున్నాయి. ఈ 'యముడు' చిత్రం కూడా విజయవంతం అవుతుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. జగదీశ్ ఆమంచి మాట్లాడుతూ 'ప్రస్తుతం ఎక్కడ చూసినా కుట్రలు, హత్యలు, అక్రమ సంబంధాలకు సంబంధించిన వార్తలే కనిపిస్తున్నాయి. ఆ అంశాలతోనే ఈ చిత్రాన్ని తీశాం. అందరినీ ఆకట్టుకునేలా మా చిత్రం ఉంటుంది' అని అన్నారు. కార్యక్రమంలో శ్రీమల్లిక, ఆకాశ్, భవానీ రాకేశ్ తదితరులు మాట్లాడారు.

నటి రమ్యకు శివరాజ్‌కుమార్ మద్దతు



నటుడు దర్శన్ అభిమానులు తనకు వ్యతిరేకంగా పెట్టిన అసభ్య పోస్టులపై నటి రమ్య నగర పోలీస్ కమిషనర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. 43 సోషల్ మీడియా ఖాతాలను ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన సీపీ సీమంత్ కుమార్ సింగ్ విచారించాలని సీఈఎన్ పోలీసులను ఆదేశించారు. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కాగా, నటి రమ్యకు శివరాజ్‌కుమార్, ఆయన భార్య గీతా శివరాజ్ మద్దతు ప్రకటించారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

కబడ్డీ ఆటగాడి కథ



విజయరామరాజు టైటిల్ రోల్ పోషిస్తున్న సినిమా 'అర్జున్ చక్రవర్తి'. విక్రాంత్ రుద్ర దర్శకత్వంలో శ్రీని గుబ్బల నిర్మిస్తున్నారు. సిజ్జా రోజ్ కథానాయిక. తాజాగా ఈ చిత్ర ట్రైలర్‌ని దర్శకుడు హను రాఘవపూడి లాంచ్ చేశారు. ఓ కబడ్డీ ఆటగాడి జీవితం ఆధారంగా రూపొందించిన ట్రైలర్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విక్రాంత్ రుద్ర మాట్లాడుతూ 'ఈ సినిమాని అంతర్జాతీయ ప్రమాణాల స్థాయిలో 120 లొకేషన్లలో చిత్రీకరించాం' అని చెప్పారు. విజయరామరాజు మాట్లాడుతూ 'నా జీవితంలో గుర్తుండిపోయే సినిమా ఇది. మంచి క్యారెక్టర్ ఉన్న చిత్రం రావడం చాలా అరుదు. మీరందరూ సపోర్ట్ చేసి ముందుకు తీసుకెళ్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని అన్నారు.



నాలుగేళ్లలో రుణవితరణ రెట్టింపు: కొలియెర్స్

రియల్టీతో బ్యాంకుల 'రుణా'నుబంధం

న్యూఢిల్లీ: రియల్ ఎస్టేట్ రంగానికి బ్యాంకుల రుణ వితరణ గత నాలుగేళ్లలో రెట్టింపై 2025 మార్చి నాటికి రూ.35.4 లక్షల కోట్లకు చేరింది. రియల్టీ కన్సల్టెంట్ కొలియెర్స్ తాజా నివేదికలో ఈ విషయం తెలిపింది. రియల్టీ రంగంలో కార్యకలాపాలు సాగిస్తున్న టాప్ 50 లిస్టెడ్ కంపెనీల లాభదాయకత, అవి ప్రదర్శిస్తున్న వేగం, మార్కెట్లో వాటి స్థాయి వంటివి మదింపు చేసి ఈ నివేదిక రూపొందించినట్లు కొలియెర్స్ తెలిపింది. 2021 ఆర్థిక సంవత్సరంలో రియల్టీ రంగానికి స్థూల బ్యాంకు రుణాలు రూ.17.8 లక్షల కోట్లుండగా ఈ ఏడాది మార్చి నాటికి రూ.35.4 లక్షల కోట్లకు చేరినట్లు తెలియచేసింది. తీవ్ర ఆటుపోట్ల మధ్యన కూడా ఈ రంగం ఆర్థిక స్వస్థత ఎంతగానో మెరుగుపడిందని, ఆర్థిక రంగంలోని ఇతర విభాగాల కన్నా మెరుగైన పనితీరు ప్రదర్శిస్తోందని పేర్కొంది. బ్యాంకులు అందిస్తున్న మొత్తం రుణాల్లో సుమారు ఐదింట ఒక శాతం రియల్టీ రంగానికే అందుతున్నట్లు తెలిపింది. ఇతర రంగాల్లోని కంపెనీలతో పోల్చితే పరపతి రేటింగ్ పెంచుకున్న కంపెనీల్లో రియల్టీ రంగానికి చెందినవే అధికంగా ఉన్నట్లు కొలియెర్స్ సీఈఓ బాదల్ యాజ్ఞిక్ అన్నారు. 2025 ఆర్థిక సంవత్సరంలో టాప్ 50 కంపెనీల్లో 62% కంపెనీల లాభదాయకత పెరిగిందని, 60 శాతం పైగా కంపెనీల రుణభార స్థాయిలు కూడా సౌకర్యవంతంగా ఉన్నాయని ఆయన చెప్పారు.

ఇండస్ట్రియల్, వేర్‌హౌసింగ్ జోరు

ఈ ఏడాది జూన్‌తో ముగిసిన ఆరు నెలల కాలంలో దేశంలో ఇండస్ట్రియల్, వేర్‌హౌసింగ్ విభాగాల లీజింగ్ 63% వృద్ధితో 2.71 కోట్ల చదరపు అడుగులకు పెరిగినట్టు సీబీఆర్ఈ తెలిపింది. ప్రధానంగా 25 శాతం వాటాతో ఇ-కామర్స్ కంపెనీలు డిమాండులో వృద్ధికి దోహదపడినట్టు తెలియచేసింది. ద్వితీయ శ్రేణి నగరాల్లో డిమాండ్ మరింతగా పెరిగినట్టు కంపెనీ సీఈఓ, చైర్మన్ అన్షుమన్ మాగజైన్ అన్నారు. నగరాలవారీగా చూసినట్టయితే 73 లక్షల చదరపు అడుగులతో ఢిల్లీ-ఎన్‌సీఆర్ అగ్రస్థానంలో నిలిచింది. 36 లక్షల చదరపు అడుగులతో హైదరాబాద్ మూడో స్థానంలో నిలిచింది.

వృద్ధిపై ఆశావహ దృక్పథం

రాబోయే ఆరు నెలల కాలానికి దేశీయ ప్రాపర్టీ మార్కెట్ వృద్ధిపై రియల్ ఎస్టేట్ డెవలపర్లు, ఆర్థిక సంస్థలు ఆశావహ దృక్పథంతో ఉన్నట్టు నరెడ్కో, నైట్‌ఫ్రాంక్ అధ్యయనంలో తేలింది. మంగళవారం ఈ సంస్థలు 45వ ఎడిషన్ రియల్ ఎస్టేట్ సెంటిమెంట్ ఇండెక్స్‌ను విడుదల చేశాయి. నాలుగు త్రైమాసికాల పతన క్రమానికి స్వస్తి చెప్పిన ఈ సూచీ జనవరి-మార్చి త్రైమాసికంతో పోల్చితే ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 54 పాయింట్ల నుంచి 56 పాయింట్లకు పెరిగింది. రియల్టీ రంగంలో పెరిగిన ఆశావహ వైఖరికి ఇది దర్పణమని నరెడ్కో ప్రెసిడెంట్ హరిబాబు అన్నారు.

పీ & జీ పగ్గాలు భారతీయుడి చేతికి..



కొత్త సీఈఓగా శైలేష్ జెజురికర్
2026 జనవరి 1 నుంచి బాధ్యతలు

న్యూఢిల్లీ: మరో ప్రముఖ బహుళజాతి కంపెనీకి భారతీయుడు సారథ్యం వహించనున్నారు. అమెరికన్ ఎఫ్ఎంసీజీ దిగ్గజం ప్రాక్టర్ అండ్ గాంబుల్ (పీ అండ్ జీ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా శైలేష్ జెజురికర్ నియమితులయ్యారు. 58 ఏళ్ల జెజురికర్ వచ్చే ఏడాది జనవరి 1 నుంచి కొత్త బాధ్యతలను చేపట్టనున్నారు. 1989లో ఈ కంపెనీలో అసిస్టెంట్ బ్రాండ్ మేనేజర్‌గా చేరిన శైలేష్.. అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చారు. గత ఆరేళ్లుగా కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ప్రముఖ లిఫ్టల తయారీ సంస్థ ఓటిస్ ఎలివేటర్స్ కంపెనీ బోర్డు సభ్యుడిగా కూడా కొనసాగుతున్నారు. నాయకత్వ మార్పులో భాగంగా పీ అండ్ జీ ప్రస్తుత సీఈఓ జాన్ మోల్లెర్ స్థానంలో శైలేష్ నియమితులయ్యారు. ఈ అక్టోబరులో జరగనున్న వాటాదారుల సమావేశంలో డైరెక్టర్ పదవికి పోటీ చేసేందుకు సైతం కంపెనీ బోర్డు జెజురికర్‌ను నామినేట్ చేసినట్లు పీ అండ్ జీ తెలిపింది.

శైలేష్ సోదరుడూ సీఈఓనే.. : మహీంద్రా అండ్ మహీంద్రా లిమిటెడ్ ఆటో, వ్యవసాయ యంత్రాల విభాగ సీఈఓ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేశ్ జెజురికర్ చిన్న తమ్ముడే శైలేష్. కాగా, భారతీయ సంతతి నాయకులు కేవలం సాంకేతికతనే కాదు, అమెరికన్ వినియోగదారుల హృదయాలను, మనస్సులను కూడా దోచుకోగలరని పీ అండ్ జీ సీఈఓగా శైలేష్ నియామకం మరోసారి నిరూపించిందని మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా అన్నారు.

హెచ్‌పీఎస్ పూర్వ విద్యార్థి.. నాదెళ్ల క్లాస్‌మేట్

శైలేష్ జెజురికర్‌కు హైదరాబాద్‌తోనూ ప్రత్యేక అనుబంధం ఉంది. ఆయన బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదువుకున్నారు. అంతే కాదు, హెచ్‌పీఎస్‌లోనే చదువుకున్న మైక్రోసాఫ్ట్ చైర్మన్ సత్య నాదెళ్ల క్లాస్‌మేట్ కూడా. వీరిద్దరూ స్నేహితులని కూడా తెలిసింది. జెజురికర్, నాదెళ్లతోపాటు వరల్డ్ బ్యాంక్ ప్రస్తుత ప్రెసిడెంట్, అమెరికన్ ఎక్స్‌ప్రెస్ మాజీ సీఈఓ అజయ్ బంగా, అడోబ్ సీఈఓ శాంతను నారాయణ్ కూడా హెచ్‌పీఎస్ పూర్వ విద్యార్థులే. జెజురికర్ విషయానికొస్తే, హెచ్‌పీఎస్‌లో విద్యాభ్యాసం అనంతరం ముంబై యూనివర్సిటీ నుంచి బీఏ ఎకనామిక్స్, ఆ తర్వాత ఐఐఎం లక్నో నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు.

3 రోజుల తర్వాత లాభాల్లోకి

447 పాయింట్లు బలపడిన సెన్సెక్స్

ముంబై: మూడు రోజుల వరుస నష్టాల నుంచి స్టాక్ మార్కెట్‌కు కాస్త ఊరట లభించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి దిగ్గజ షేర్లలో కొనుగోళ్లతో మార్కెట్ మంగళవారం మళ్లీ లాభాలబాట పట్టింది. ఒకదశలో 539 పాయింట్ల వరకు ఎగబాకిన సెన్సెక్స్.. చివరికి 446.93 పాయింట్ల లాభంతో 81,337.95 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 140.20 పాయింట్ల వృద్ధితో 24,821.10 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 19 లాభపడగా.. రిలయన్స్ షేరు 2.21 శాతం పెరిగి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది.

4 నెలల కనిష్ఠానికి రూపాయి: భారత కరెన్సీ విలువ నాలుగు నెలలకు పైగా కనిష్ఠ స్థాయికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 21 పైసల నష్టంతో రూ.86.91 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా డాలర్ బలపడటంతోపాటు ముడిచమురు ధరల పెరుగుదల మన కరెన్సీపై ఒత్తిడి పెంచింది.

టీసీఎస్ షేరు మరింత పతనం: 12,000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు గత వారాంతంలో ప్రకటించిన టీసీఎస్ షేరు విలువ మరో 0.73 శాతం తగ్గింది. క్రితం సెషన్‌లో దాదాపు 2 శాతం జారుకుంది. దాంతో గడిచిన రెండు రోజుల్లో కంపెనీ షేరు ధర 2.48 శాతం క్షీణించగా.. మార్కెట్ విలువ రూ.28,148 కోట్లకు పైగా తగ్గి రూ.11.05 లక్షల కోట్లకు పరిమితమైంది.

ఐపీఓకు లెన్స్‌కార్ట్

కళ్ల జోళ్ల విక్రయ కేంద్రాల నిర్వహణ స్టార్టప్ లెన్స్‌కార్ట్ కూడా ఐపీఓ జారీకి అనుమతి కోరుతూ సెబీకి దరఖాస్తు చేసింది. ఇష్యూ ద్వారా 100 కోట్ల డాలర్ల (సుమారు రూ.8,650 కోట్లు) వరకు సమీకరించే అవకాశం ఉందని బ్లూంబర్గ్ కథనం వెల్లడించింది. ఐపీఓలో భాగంగా రూ.2,150 కోట్ల తాజా ఈక్విటీని జారీ చేయనుంది.

- స్వర్ణాభరణాల తయారీ సంస్థ శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్ ఐపీఓకు అపూర్వ స్పందన లభించింది. మంగళవారం ఇష్యూ చివరి రోజు నాటికి ఏకంగా 80.80 రెట్ల బిడ్లు దాఖలయ్యాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

30వ తేదీ			
హైదరాబాద్	405	విజయవాడ	475
వరంగల్	407	గోదావరి	450
చిత్తూరు	463	విశాఖపట్నం	450
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	110	విజయవాడ	109
వరంగల్	110	గుంటూరు	114
కరీంనగర్	110	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	107
కర్నూలు	110	నెల్లూరు	112
విశాఖపట్నం	97	అనంతపురం	112
గోదావరి	109		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,820 ▼	91,500 ▼	1,26,000 ▲
విజయవాడ	1,01,200 ▼	96,000 ▼	1,16,600 ▲
విశాఖపట్నం	1,01,250 ▼	91,500 ▲	1,26,000 ▼
రాజమండ్రి	99,820 ▼	91,500 ▼	1,16,000 ▼
ప్రొద్దుటూరు	99,200 ▲	91,260 ▲	1,16,500 ▲
ముంబై	98,300 ▼	90,040 ▼	1,13,310 ▲

అమెరికాకు స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల్లో చైనాను మించిన భారత్

న్యూఢిల్లీ: 'భారత్‌లో తయారీ' ఊపందుకుంది. స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల్లో మన దేశం సత్తా చాటుతోంది. జూన్ త్రైమాసికంలో అమెరికాకు స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల్లో తొలిసారిగా చైనాను అధిగమించింది. 700 కోట్ల డాలర్ల (సుమారు రూ.60,774 కోట్లు) విలువైన స్మార్ట్‌ఫోన్లు అమెరికాకు ఎగుమతి చేసింది. దీంతో గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఈ త్రైమాసికంలో అమెరికా స్మార్ట్‌ఫోన్ల మార్కెట్‌లో మన దేశం వాటా 13% నుంచి 44 శాతానికి (240% వృద్ధి) చేరింది. ఇదే సమయంలో చైనా వాటా 61% నుంచి 25 శాతానికి పడిపోయింది. 'జూన్ త్రైమాసికంలో తొలిసారిగా అమెరికాకు స్మార్ట్‌ఫోన్ల ఎగుమతిలో మన దేశం చైనాను మించిపోయింది. యాపిల్ పెద్ద ఎత్తున ఎగుమతులు పెంచడం, అమెరికా-చైనా వాణిజ్య ఉద్రిక్తతలు ఇందుకు ప్రధాన కారణం' అని కెనాలిస్ సంస్థ ప్రిన్సిపల్ అనలిస్ట్ సన్యం చౌరాసియా చెప్పారు.

యాపిల్‌దే హవా: గత త్రైమాసికంలో మన దేశం నుంచి అమెరికాకు ఎగుమతైన 700 కోట్ల డాలర్ల విలువైన స్మార్ట్‌ఫోన్లలో యాపిల్ కంపెనీ వాటా 70% వరకు ఉంది. తరువాతి స్థానంలో సామ్‌సంగ్, మోటారోలా కంపెనీలున్నాయి. యాపిల్ లేటెస్ట్ మోడల్ ఐఫోన్ 16 ప్రోను చైనాలో అసెంబుల్ చేయిస్తున్నా, మిగతా మోడల్స్‌ను మాత్రం ఎక్కువగా భారత్‌లోనే అసెంబుల్ చేయిస్తోంది. త్వరలో విడుదలయ్యే ఐఫోన్ 17 మోడల్‌నీ ఎక్కువగా భారత్‌లో అసెంబుల్ చేయించేందుకు సిద్ధమవుతోంది.

రూటు మార్చిన కంపెనీలు : గతంలో యాపిల్‌తో సహా ప్రధాన స్మార్ట్‌ఫోన్ల కంపెనీలు చైనా నుంచే ఎక్కువగా స్మార్ట్‌ఫోన్లను దిగుమతి చేసుకునేవి. కొవిడ్ తర్వాత యాపిల్‌తో సహా ప్రధాన కంపెనీలు రూటు మార్చాయి. చైనాపై ఎక్కువగా ఆధారపడడాన్ని తగ్గించుకుంటున్నాయి. ఇందుకోసం 'చైనా ప్లస్ వన్' విధానం అనుసరిస్తున్నాయి.

హైదరాబాద్‌లో బ్రిగేడ్ గ్రూప్ కొత్త ప్రాజెక్టులు

రూ.970 కోట్ల ఆదాయానికి అవకాశం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ బ్రిగేడ్ గ్రూప్ హైదరాబాద్‌లో మరో రెండు లగ్జరీ రెసిడెన్షియల్ ప్రాజెక్టులు చేపట్టింది. నగరంలోని మోతీనగర్ ప్రాంతంలో పది ఎకరాల్లో ఈ రెండు ప్రాజెక్టులు చేపట్టినట్టు తెలిపింది. ఈ గ్రూప్ ఇప్పటికే మోతీనగర్‌లో బ్రిగేడ్ సిటాడెల్ పేరుతో ఒక ప్రీమియం రెసిడెన్షియల్ ప్రాజెక్టు నిర్మిస్తోంది. దీనికి సమీపంలోనే బ్రిగేడ్ సిటాడెల్ 2, సిటాడెల్ 3 పేరుతో 10 లక్షల ఎస్ఎఫ్‌టీలో మరో రెండు రెసిడెన్షియల్ ప్రాజెక్టులు చేపడుతోంది.

ప్రాజెక్టు ప్రత్యేకతలు

- 10 లక్షల ఎస్ఎఫ్‌టీలో 405 లగ్జరీ 3 బీహెచ్‌కే, 4 బీహెచ్‌కే ఫ్లాట్లు.
- రూ.970 కోట్ల ఆదాయానికి అవకాశం
- రెండు ప్రాజెక్టుల్లోనూ అత్యాధునిక సదుపాయాలు.

స్పోర్ట్స్

భారత్‌కు కఠిన డ్రా

మహిళల ఆసియాకప్

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది ఆస్ట్రేలియాలో జరిగే మహిళల ఫుట్‌బాల్ ఆసియాకప్‌లో భారత జట్టుకు కఠిన డ్రా ఎదురైంది. 12 జట్లు పాల్గొనే ఈ టోర్నీలో భారత్ గ్రూప్ 'సి'లో తలపడనుంది. అయితే ఇందులో తమకంటే మెరుగైన ర్యాంకింగ్స్‌లో ఉన్న జపాన్, చైనీస్ తైపీ, వియత్నాం జట్లు కూడా చోటు దక్కించుకున్నాయి. మార్చి ఒకటి నుంచి 21 వరకు ఈ ఆసియాకప్ జరుగుతుంది. ఇందులో సెమీస్‌కు చేరిన నాలుగు జట్లు నేరుగా 2027 ఫిఫా మహిళల వరల్డ్‌కప్‌నకు అర్హత సాధిస్తాయి.

కేకేఆర్ కోచ్‌కు ఉద్వాసన


న్యూఢిల్లీ: చీఫ్ కోచ్ చంద్రకాంత్ పండిట్‌కు ఐపీఎల్ టీమ్ కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) ఉద్వాసన పలికింది. ఈ ఏడాది ఐపీఎల్‌లో పేలవ ప్రదర్శన నేపథ్యంలో సహాయ సిబ్బందిని ప్రక్షాళన చేయాలని కోల్‌కతా యాజమాన్యం నిర్ణయించింది. 2024లో పండిట్ హయాంలో కేకేఆర్ దశాబ్దం తర్వాత ఐపీఎల్ టైటిల్ గెలిచింది. కానీ, ఆ తర్వాతి సీజన్‌లో ఘోర ప్రదర్శనతో కేవలం ఐదు విజయాలతో ఎనిమిదో స్థానంలో నిలిచింది. మెకల్లమ్ స్థానంలో 2022లో కేకేఆర్ కోచ్‌గా చంద్రకాంత్ బాధ్యతలు చేపట్టాడు. పండిట్ కఠిన వ్యవహారశైలి కారణంగా కొందరు విదేశీ ప్లేయర్లు అసహనం వ్యక్తం చేశారు.

మంధాన వెనక్కి..బ్రంట్ ముందుకు



దుబాయ్: అంతర్జాతీయ మహిళల వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో స్మృతి మంధాన తన అగ్రస్థానాన్ని కోల్పోయింది. మంగళవారం ఐసీసీ ప్రకటించిన తాజా జాబితాలో ఇంగ్లండ్ కెప్టెన్ నాట్ సివర్ బ్రంట్ టాప్‌లోకి వెళ్లింది. భారత్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో బ్రంట్ 160 పరుగులతో ఫామ్‌ను చాటుకుంది. అటు మంధాన ర్యాంకు రెండో స్థానానికి తగ్గింది. భారత కెప్టెన్ హర్మన్ ప్రీత్ పది స్థానాలను మెరుగుపర్చుకుని 11కి, జెమీమా 13వ స్థానానికి చేరారు. బౌలింగ్ విభాగంలో స్పిన్నర్ సోఫీ ఎకెల్‌స్టోన్ టాప్‌లో కొనసాగుతోంది.





నువ్వేంటి మాకు చెప్పేది?

క్యూరేటర్‌తో గంభీర్ వాగ్వాదం

లండన్: టీమిండియా ప్రధాన కోచ్ గౌతం గంభీర్, స్థానిక ఓవల్ స్టేడియం చీఫ్ క్యూరేటర్ లీ ఫోర్టిస్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. జరిగిందేమిటంటే.. ఇంగ్లండ్‌తో ఐదో టెస్టు కోసం మంగళవారం తొలిసారిగా భారత జట్టు నెట్ సెషన్‌లో పాల్గొంది. దీనిలో భాగంగా ప్రాక్టీస్ కోసం టీమ్ ఉపయోగిస్తున్న పిచ్‌వద్ద ఆటగాళ్లు, కోచ్‌లు...అందరూ ఉండంపై క్యూరేటర్ అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. బ్యాటర్ తప్ప మిగతా వారంతా పిచ్‌కి దూరంగా నిలబడాలని చెప్పాడు. ఇదే విషయమై అతడు బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్‌తో మాట్లాడుతున్నప్పుడు.. గంభీర్ మధ్యలో కలుగజేసుకుని ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'మేమేం చేయాలో నీవు మాకు చెప్పాల్సిన అవసరం లేదు. నువ్విక్కడ కేవలం గ్రౌండ్స్‌మెన్ మాత్రమే. హద్దు మీరి ప్రవర్తించకు. ఏం చేయాలో మాకు తెలుసు' అని చేతి వేలు చూపించి మరీ ఘాటుగా సమాధానమిచ్చాడు. అయితే ఈ విషయాన్ని తాను రిపోర్ట్ చేస్తానని ఫోర్టిస్ చెప్పడంతో.. 'నువ్వేం చేయాలనుకుంటే అది చెయ్' అంటూ గౌతీ బదులిచ్చాడు. దీంతో సితాన్షు కోటక్.. ఫోర్టిస్‌ను పక్కకు తీసుకెళ్లి మాట్లాడాడు. ఒకవేళ పిచ్ దెబ్బతింటుందని ఫోర్టిస్ భావించినా, తాము స్పైక్ షూస్ కూడా ధరించలేదని కోటక్ తెలిపాడు. తమ కోచ్‌లు పిచ్‌ను పరిశీలించేందుకు వెళ్లినప్పుడు కూడా అక్కడి గ్రౌండ్ స్టాఫ్ ఒకరు వికెట్‌కు 2.5 మీటర్ల దూరంలో నిలబడాలని చెప్పడం ఆశ్చర్యపరిచిందని కోటక్ అన్నాడు. ఇలాంటి ప్రవర్తన గతంలో ఎక్కడా ఎదురుకాలేదని, అయినా ఫోర్టిస్‌పై భారత జట్టు ఫిర్యాదు చేయాలనుకోవడం లేదని తేల్చాడు.



కోటక్

కుల్దీప్, అర్ష్‌దీప్ ఖరారేనా?

- ఆసక్తికరంగా భారత జట్టు కూర్పు
- రేపటినుంచే ఆఖరి టెస్టు



కుల్దీప్

లండన్: వీరోచిత పోరాటంతో నాలుగో టెస్టును డ్రా చేసుకొన్న భారత్.. సిరీస్ ఆశలను సజీవంగా నిలబెట్టుకొంది. గురువారం నుంచి ఓవల్‌లో జరిగే ఐదో, ఆఖరి టెస్ట్‌లో గెలిచి సిరీస్‌ను సమం చేయాలన్న పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలో టీమిండియా తుది జట్టు కూర్పు ఆసక్తిగా మారింది. అయితే, పరిస్థితులను బట్టి ఊహించిన దానికంటే ఎక్కువ మార్పులు చోటు చేసుకొనే అవకాశం ఉందని సమాచారం. ముఖ్యంగా వికెట్లు పడగొట్టగల బౌలర్ కోసం భారత్ వెదుకుతోంది. స్టార్ పేసర్ బుమ్రా విషయం సస్పెన్స్‌గా మారింది. మాంచెస్టర్ టెస్ట్‌లో పేస్ తగ్గించి బౌలింగ్ చేయడంతో అతడి ఫిట్‌నెస్‌పై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కానీ, బుమ్రా బౌలింగ్ చేసేంత ఫిట్‌గా ఉన్నాడని బ్యాటింగ్ కోచ్ సితాన్షు కొటక్ చెప్పాడు. కానీ, టీమ్ మేనేజ్‌మెంట్ మాత్రం మ్యాచ్ ముందు మాత్రమే బుమ్రాపై ఓ నిర్ణయానికి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. నాలుగు టెస్ట్‌ల్లో కలిపి బుమ్రా దాదాపు 120 ఓవర్లు బౌల్ చేశాడు. ఒక్క ఓల్డ్ ట్రాఫోర్డ్‌లోనే 33 ఓవర్లు వేశాడు. ఒకవేళ బుమ్రాకు విశ్రాంతినిస్తే.. అతడి స్థానాన్ని ఎవరితో భర్తీ చేయాలనేది పిచ్ పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది. కాగా, స్పెషలిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను గత నాలుగు మ్యాచ్‌లుగా బెంచ్‌కే పరిమితం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అతడికి ఆఖరి టెస్ట్‌లో ఆడించడం ఖాయంగా భావిస్తున్నారు. గాయపడిన పేసర్లు అర్ష్‌దీప్, ఆకాశ్‌దీప్ కూడా ఫిట్‌నెస్ సాధించారని కోచ్ గంభీర్ తెలిపాడు. అయితే, అన్షుల్ కాంబోజ్, శార్దూల్ ఠాకూర్‌పై వేటు పడుతుందన్న ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. కాంబోజ్ స్థానంలో ఆకాశ్‌దీప్ రీఎంట్రీ ఇవ్వనుండగా.. బుమ్రా దూరమైతే ఆ స్థానం కోసం అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ పోటీలో ఉన్నారు. అయితే అర్ష్‌దీప్ ఎంపిక దాదాపు ఖరారైనట్టే చెబుతున్నారు. ఇక శార్దూల్ బంతితో తీవ్రంగా నిరాశపర్చడం.. కుల్దీప్‌కు మార్గం సుగమం చేసిందని భావిస్తున్నారు. బ్యాటింగ్ విభాగంలో పెద్దగా మార్పులు లేవని తెలుస్తోంది. గాయపడిన రిషబ్ పంత్ సిరీస్ నుంచి అవుట్ కాగా.. అతడి స్థానంలో ధ్రువ్ జురెల్ ఆడడం దాదాపుగా ఖరారైంది.



అర్ష్‌దీప్

ఐపీఎల్ జెర్సీల చోరీ

ముంబై: స్థానిక వాంఖడే స్టేడియంలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో జరిగిన చోరీ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత నెల 13న అక్కడి సెక్యూరిటీ గార్డు 261 ఐపీఎల్ జెర్సీలను దొంగతనం చేశాడు. వీటి విలువ రూ.6.5 లక్షలు. హరియాణాకు చెందిన ఆన్‌లైన్ డీలర్‌కు ఈ జెర్సీలను అమ్మినట్టు పోలీసులు తెలిపారు. అయితే అవి చోరీ చేసి అమ్మినట్టుగా తనకు తెలియదని ఆ డీలర్ పోలీసులకు తెలిపాడు. ఇక చోరీకి గురైన వాటిలో 50 జెర్సీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దొంగతనంపై బోర్డు ఈనెల 17న ఫిర్యాదు చేయగా, సీసీ ఫుటేజిని పరిశీలించి గార్డును అరెస్ట్ చేశారు.

ఆసీస్ క్లీన్‌స్వీప్

ఐదో టీ20లోనూ విండీస్ చిత్తు



సెయింట్ కిట్స్: వెస్టిండీస్‌తో ఐదు టీ20ల సిరీస్‌ను పర్యాటక ఆస్ట్రేలియా 5-0తో క్లీన్‌స్వీప్ చేసింది. సోమవారం రాత్రి జరిగిన ఐదవ, ఆఖరి టీ20లో ఆసీస్ 3 వికెట్ల తేడాతో విండీస్‌ను చిత్తు చేసింది. తొలుత విండీస్ 19.4 ఓవర్లలో 170 పరుగులకు ఆలౌటైంది. హెట్‌మయెర్(52), షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ (35) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. బెన్ డ్వార్షుయిస్ మూడు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో ఆసీస్ 17 ఓవర్లలో 173/7 స్కోరు చేసి గెలిచింది. మిచెల్ ఓవెన్ (37), కామెరూన్ గ్రీన్ (32), టిమ్ డేవిడ్ (30) వేగంగా ఆడారు. అకిల్ హొస్సేన్ 3 వికెట్లు పడగొట్టాడు.

తేజేష్‌కు మూడు పతకాలు



న్యూఢిల్లీ: కొరియాలో జరుగుతున్న ఆసియా రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన పడిగ తేజేష్ మూడు పతకాలతో మెరిశాడు. షో గ్రూప్ స్కేటింగ్‌లో తేజేష్ బంగారు పతకాన్ని సొంతం చేసుకొన్నాడు. పెయిర్ స్కేటింగ్, క్వార్టెట్ స్కేటింగ్ విభాగాల్లో రజతాలు దక్కించుకొన్నాడు.

భారత్-పాక్ జట్లు ఆడతాయి!

ఆసియాకప్



న్యూఢిల్లీ: వచ్చే నెలలో జరగాల్సిన ఆసియాకప్ టీ20 టోర్నీపై ఇటీవలి వరకు సందిగ్ధత కొనసాగింది. అయితే ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) షెడ్యూల్‌ను ప్రకటించడంతో అందరి సందేహాలు తీరాయి. సెప్టెంబరు 9 నుంచి 28 వరకు తటస్థ వేదిక దుబాయ్‌లో ఈ టోర్నీ జరగనుంది. ఒకే గ్రూపులో ఉన్న భారత్-పాక్ జట్లు అదే నెల 14న మ్యాచ్‌లో తలపడతాయి. కానీ పహల్గాం ఉగ్రదాడుల తర్వాత కూడా పాక్‌తో మ్యాచ్ ఆడడమేంటన్న విమర్శలు సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో బీసీసీఐ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే ఆసక్తి వ్యక్తమవుతోంది. అటు జాతీయ క్రీడా బిల్లు ఇంకా ఆమోదం పొందలేదు కాబట్టి బోర్డు క్రీడా మంత్రిత్వ శాఖ పరిధిలోకి రాదని, ప్రజల మనోభావాలపై వారు ఎలా స్పందిస్తారో చూడాల్సిందేనని క్రీడా శాఖ వర్గాలు తెలిపాయి. మరోవైపు ఆసియాకప్‌లో పాక్‌తో మ్యాచ్‌ను ఆడకుంటే భారత్‌కే నష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే ఇది ద్వైపాక్షిక సిరీస్ కాదు కాబట్టి వాకోవర్ ఇస్తే కీలక పాయింట్లు కోల్పోవాల్సి ఉంటుందని, అది పాక్‌కే లాభిస్తుందని చెబుతున్నారు. అందుకే ఈ మ్యాచ్ రద్దు కాకపోవచ్చని తేల్చారు. అంతేకాకుండా ఈ రెండు జట్లు తలపడితే వ్యాపార పరంగా భారీ ఆదాయం చేకూరుతుందని, కానీ రద్దయితే బ్రాడ్‌కాస్టర్‌కే కాకుండా ఇతర ఏసీసీ సభ్య దేశాలకు కూడా ఆర్థికంగా నష్టం చేకూరినట్టేనని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.

ప్రీక్వార్టర్స్‌కు సాత్విక్ ద్వయం

మకావు ఓపెన్

మకావు: సాత్విక్-చిరాగ్ జోడీ మకావు ఓపెన్‌లో ప్రీక్వార్టర్స్‌కు చేరుకోగా.. గాయత్రి జంటకు తొలి రౌండ్‌లోనే షాక్ తగిలింది. పురుషుల డబుల్స్‌లో మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో రెండో సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి జంట 21-13, 21-15తో మలేసియాకు చెందిన లో హాంగ్ యి-ఎన్‌జి ఇంగ్ చియాంగ్‌పై సునాయాసంగా గెలిచింది. కాగా, మహిళల డబుల్స్‌లో టాప్ సీడ్ గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ జంట 21-16, 20-22, 15-21తో చైనీస్ తైపీకి చెందిన లింగ్ గ్జియో మిన్-పెంగ్ యు వి చేతిలో ఓడింది..



టాప్-10లోకి సాత్విక్ జోడీ..: బీడబ్ల్యూఎఫ్ పురుషుల డబుల్స్ ర్యాంకింగ్స్‌లో సాత్విక్ జోడీ మళ్లీ టాప్-10లోకి దూసుకొచ్చింది. తాజా ర్యాంక్‌ల జాబితాలో సాత్విక్-చిరాగ్ జంట మూడు స్థానాలు మెరుగుపర్చుకొని 9వ ర్యాంక్‌లో నిలిచింది. సింగిల్స్‌లో లక్ష్య సేన్ రెండు ర్యాంక్‌లు మెరుగుపర్చుకొని 17వ స్థానంలో, ప్రణయ్ 33వ ర్యాంక్‌లో ఉన్నారు. పీవీ సింధు 15వ ర్యాంక్‌లో నిలకడగా కొనసాగుతుండగా.. 17 ఏళ్ల ఉన్నతి హుడా కెరీర్ బెస్ట్ 31వ ర్యాంక్ సాధించింది.

ఖమ్మం, నల్లగొండ మంత్రులు సీఎంను పని చెయ్యనివ్వట్లే

19 నెలల్లోనే ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

కమ్యూనిస్టులు బీజేపీలో చేరాలని పిలుపు



ఖమ్మం, జూలై 29 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు చెందిన మంత్రుల బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పని చెయ్యనివ్వడం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆరోపించారు. 19 నెలల కాంగ్రెస్ పాలనలో రైతు బంధు సహా ఏ సంక్షేమ పథకం సక్రమంగా అమలు కావడం లేదన్నారు. దాంతో ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని పేర్కొన్నారు. ఎరువుల పంపిణీ అంశంలో చర్చకు సిద్ధమా అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సవాలు విసిరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో మంగళవారం తొలిసారి ఖమ్మం వచ్చిన ఆయన స్థానికంగా నిర్వహించిన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడికి బదులుగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ రాష్ట్రంలో పాదయాత్రలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన 42 శాతం బీసీ రిజర్వేషన్ బీసీలకు కాదని ముస్లిం రిజర్వేషన్ అని ఆరోపించారు. ముస్లింలకు బీజేపీ వ్యతిరేకం కాదన్న ఆయన.. ముస్లింలకు 10 శాతం ఈబీసీ రిజర్వేషన్, 4 శాతం రిజర్వేషన్ అమలులో ఉందని తెలిపారు. బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని, ఆర్డినెన్సు చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు కేంద్రంపై బురద చల్లుతూ ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. హైదరాబాద్ జీహెచ్ఎంసీలో బీసీల సీట్లలో 32మంది ఎంఐఎం అభ్యర్థులు గెలిచారని, తద్వారా బీసీల రిజర్వేషన్ కోటా బీసీలకు దక్కకుండా పోయే పరిస్థితి ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీల పని అయిపోయిందన్న రాంచందర్‌రావు.. పశ్చిమబెంగాల్ నాయకులను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రంలోని కమ్యూనిస్టు నేతలు బీజేపీలో చేరాలని పిలుపునిచ్చారు. ఖమ్మంను ఒకప్పుడు కమ్యూనిస్టుల గడ్డ అనేవారని, ఇకపై ఖమ్మం బీజేపీ అడ్డా కాబోతుందని తెలిపారు. ఇక, కేంద్ర ప్రభుత్వం ఎరువులు సక్రమంగా సరఫరా చేయడం లేదని జరుగుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టాలని కార్యకర్తలకు సూచన చేశారు. 2024-25లో 9.80 లక్షల మెట్రిక్‌టన్నుల యూరియా రాష్ట్రానికి వచ్చిందని, 2024లో 12.47లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం యూరియా అసలు ధర రూ.1990 ఉంటే బస్తాకు రూ.1423 సబ్సిడీ ఇచ్చిందని, డీఏపీ బస్తా రూ.2440 ఉంటే కేంద్రం రూ.1090 సబ్సిడీ ఇస్తోందన్నారు. ఎరువుల పంపిణీపై తనకు అవగాహన లేదన్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. దమ్ముంటే ఎరువులపై తనతో చర్చకు రావాలని సవాలు చేశారు. తాను చెప్పేది అసత్యమైతే బీజేపీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తానని, అదే తుమ్మల తప్పయితే ఆయన తన పదవికి రాజీనామా చేయాలని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని, ఇందుకు నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.



తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తలసాని

ఆగస్టు 8న బీఆర్ఎస్ బీసీ బహిరంగ సభ

- కరీంనగర్‌లో నిర్వహణ.. ఆ తరువాత రాష్ట్రపతిని కలుస్తాం
- బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్, బీజేపీ డ్రామాలాడుతున్నాయి
- బిల్లును ఆమోదించాలని ప్రధాని మోదీని రేవంత్ అడిగారా?
- ఈసారి ఢిల్లీకి వెళ్తే.. రిజర్వేషన్లు లేకుండా రాష్ట్రానికి రావొద్దు
- మాజీ మంత్రులు తలసాని, గంగుల, శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలన్న డిమాండ్‌తో ఆగస్టు 8న కరీంనగర్‌లో బహిరంగ సభ నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఆ తరువాత ఇదే అంశంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలవాలని భావిస్తోంది. ఈ విషయాలపై మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, బండ ప్రకాశ్ మంగళవారం బీఆర్ఎస్ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ఎండగట్టేందుకు బీసీల ఆధ్వర్యంలో ఆగస్టు 8న కరీంనగర్‌లో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ తరువాత రాష్ట్రపతిని కలుస్తామని చెప్పారు. రిజర్వేషన్ల విషయంలో బీజేపీ, కాంగ్రెస్ డ్రామాలాడుతున్నాయని విమర్శించారు. ఢిల్లీకి వెళ్లి తమ పార్టీ పెద్దలను కలిస్తే ప్రయోజనం లేదని, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత అధికార కాంగ్రెస్‌పై ఉందన్నారు. 'ఎన్నోసార్లు ఢిల్లీకి వెళ్లి ప్రధానిని కలిసిన సీఎం రేవంత్ రెడ్డి... బీసీ బిల్లులను ఆమోదింపచేయాలని అడిగారా? ప్రైవేటు పనులు, ప్రభుత్వ పనుల గురించి మాట్లాడటం తప్ప బీసీల పట్ల బాధ్యతగా కేంద్రంలోని పెద్దలతో సీఎం చర్చలు జరిపారా?' అని వారు ప్రశ్నించారు. రిజర్వేషన్ల కోసం ఢిల్లీ వెళతామంటున్న కాంగ్రెస్.. రిజర్వేషన్లు లేకుండా తిరిగి రాష్ట్రానికి రావొద్దని డిమాండ్ చేశారు. బీసీలకు శ్రీరామరక్ష బీఆర్ఎస్ ఒక్కటేనని వారన్నారు.

బీజేపీ ఎప్పుడూ బీసీ వ్యతిరేకే: జాజుల

హైదరాబాద్, జూలై 29(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎప్పుడూ బీసీలకు వ్యతిరేకమేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రాష్ట్రంలో కులగణన రాజ్యాంగం ప్రకారం జరగలేదంటూ ఆ పార్టీ నేతలు చేస్తోన్న వ్యాఖ్యలు వారి మూర్ఖత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలు, రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళిక శాఖ ద్వారా ప్రభుత్వ ఉద్యోగులతో చట్టబద్ధంగా జరిపిన కులగణన రాజ్యాంగబద్ధంగా జరగలేదనడం సిగ్గుమాలిన చర్య అని ఎద్దేవా చేశారు. బీసీ రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చకుండా, ఆర్డినెన్స్ రాకుండా రాజ్‌భవన్‌పై ఒత్తిడి తెస్తూ బీజేపీ నేతలు బీసీ రిజర్వేషన్ అమలును అడ్డుకుంటున్నారని జాజుల ఆరోపించారు. రాష్ట్రానికి చెందిన బీజేపీ నేతలు రాంచందర్ రావు, కిషన్‌రెడ్డి, బండి సంజయ్ బీసీ రిజర్వేషన్లపై తల, తోక లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల పెంపు బాధ్యతను తీసుకోవాల్సిన బండి సంజయ్ ముస్లింలను సాకుగా చూపించి బీసీ రిజర్వేషన్లపై వ్యతిరేకంగా మాట్లాడడం దురదృష్టకరమని వాపోయారు. బండి సంజయ్ బీసీ అయినందుకు రాష్ట్రంలోని బీసీలంతా బాధపడుతున్నారన్నారు. వారం రోజుల్లో రిజర్వేషన్ల బిల్లు ఆమోదం తెలిపితేనే బీజేపీకి తెలంగాణలో భవిష్యత్తు ఉంటుందని, లేనిపక్షంలో ఆ పార్టీని బీసీలే రాజకీయంగా భూస్థాపితం చేస్తారని హెచ్చరించారు.

ధాన్యం టెండర్లలో భారీ కుంభకోణం జరిగింది!

- రేవంత్, ఉత్తమ్, అధికారుల పాత్ర
- ఈడీకి బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు

హైదరాబాద్, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు టెండర్లలో భారీ కుంభకోణం జరిగిందని, ప్రభుత్వ ఖజానాలోకి రావాల్సిన డబ్బులు.. ప్రైవేటు వ్యక్తుల ఖాతాల్లోకి వెళ్లాయని బీఆర్ఎస్ నేతలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు ఫిర్యాదు చేశారు. 18 నెలల కిందట జరిగిన ఈ వ్యవహారంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పౌర సరఫరాల కమిషనర్, అధికారుల పాత్ర ఉందని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు పెద్ది సుదర్శన్ రెడ్డి, గంగుల కమలాకర్ మంగళవారం ఈడీ కార్యాలయంలో అధికారులను కలిసి ఫిర్యాదు అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. బిడ్డర్లు ధాన్యం టన్నుకు రూ.2,230 ఎక్కువగా రైస్ మిల్లర్ల నుంచి వసూలు చేసి కాంగ్రెస్ పెద్దలకు పంపారని ఆరోపించారు. రూ.423 కోట్లు అక్రమంగా వివిధ ఖాతాల్లోకి బదిలీ అయ్యాయన్నారు. త్వరలో సీబీఐ, డీఆర్ఐకు కూడా ఫిర్యాదు చేస్తామని, 700 పేజీల బుక్‌లెట్ తయారుచేసి దర్యాప్తు సంస్థలకు పంపుతామని చెప్పారు. ఈ కుంభకోణంపై బీజేపీ స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందని, కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి ఇప్పటికైనా నోరు తెరవాలని డిమాండ్ చేశారు. పౌర సరఫరాల శాఖలో ధాన్యం కొనుగోళ్లలో పెద్దఎత్తున అవినీతి జరిగిందని, అందుకు కారకులైన సీఎం రేవంత్ రెడ్డి, ఆ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, అధికారులపై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టాలని కోరుతూ ఏసీబీకి బీఆర్ఎస్ నేత, రెడ్కో మాజీ చైర్మన్ సతీశ్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. దాదాపు రూ.1,100 కోట్ల అవినీతి జరిగిందని, దానికి సాక్ష్యాలు అంటూ 175 పేజీల డాక్యుమెంట్లను ఏసీబీ అందజేశారు.

3న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో వైశ్య రాజకీయ రణభేరి

బర్కత్‌పుర, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో వైశ్యులకు వాటా కల్పించాలని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లలో వర్గీకరణ అమలు చేయాలని, వైశ్య కమిషన్ ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లతో వైశ్య రాజకీయ రణభేరి నిర్వహిస్తున్నట్లు వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ కాచం సత్యనారాయణ గుప్తా తెలిపారు. నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆగస్టు 3న సాయంత్రం 3 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. కులగణన నివేదికలో అగ్రవర్ణాల వివరాలు కులాల వారీగా ప్రకటించాలని, నామినేటెడ్ పదవుల్లో వైశ్యులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇంజనీరింగ్ రెండో విడత

- కౌన్సెలింగ్‌లో 23509 మందికి సీట్లు
- ప్రైవేటులో 92%, యూనివర్సిటీల్లో 80% సీట్ల భర్తీ
- ఆగస్టు 8 నుంచి చివరి విడత కౌన్సెలింగ్

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ రెండో విడత కౌన్సెలింగ్ సీట్లను సాంకేతిక విద్యాశాఖ మంగళవారం ప్రకటించింది. రెండో విడతలో మొత్తం 23509 మందికి సీట్లు కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా కన్వీనర్ కోటాలో మొత్తం 91495 సీట్లు ఉండగా.. మొదటి, రెండో విడతలో మొత్తం 83521 (91.2%) సీట్లు భర్తీ అయ్యాయని, 7974 సీట్లు మిగిలాయని ఎప్‌సెట్ కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 6445 మంది ఈడబ్ల్యూఎస్ కోటాలో సీట్లు పొందారు. రెండో విడతలో 6377 మంది ఆప్షన్లు ఇచ్చినా సీటు దక్కలేదు. మొత్తం 72 ప్రైవేటు కాలేజీలు, 5 వర్సిటీల్లో 100శాతం సీట్లు భర్తీ అయ్యాయి. రెండు ప్రైవేటు యునివర్సిటీల్లో 1386 సీట్లలో 1380 (99.5%) సీట్లు భర్తీ అయ్యాయి. అలాగే 155 ప్రైవేటు కాలేజీల్లో 83713 సీట్లలో 77158 (92.1%), 20 యునివర్సిటీ కాలేజీల్లో 6198 సీట్లలో 4942 (79.7%), ఒక ప్రభుత్వ కాలేజీలో 198 సీట్లలో 41 (20.7%) సీట్లు భర్తీ అయ్యాయి. సీటు పొందినవారు ఆగస్టు-1లోపు ట్యూషన్ ఫీజు చెల్లించి, ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి, లేదంటే సీటు రద్దవుతుంది. రెండో విడతలో సీటు సాధించినా చేరని విద్యార్థులు చివరి విడత కౌన్సెలింగ్‌లో పాల్గొనలేరు. రెండో విడతలో భర్తీ తర్వాత సీఎస్ఈలో 95.42%, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ 84.96%, సివిల్, మెకానికల్‌లో 74%, ఇతర విభాగాల్లో 73% సీట్లు భర్తీ అయ్యాయి. ఆగసు 8 నుంచి చివరి విడత కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది.

రాష్ట్రంలో కొత్త మద్యం పాలసీ!

దరఖాస్తు రుసుం రూ.3లక్షలకు పెంపు.. గడువును మూడేళ్లకు పెంచే చాన్స్!

'స్థానిక' ఎన్నికల కంటే ముందే దుకాణాల కేటాయింపు



హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్త మద్యం పాలసీని తీసుకరావడానికి రంగం సిద్ధం చేసింది..! స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియను పూర్తి పూర్తిచేసే దిశలో వడివడిగా అడుగులు వేస్తోంది. ఈ సారి మద్యం వ్యాపార నిబంధనల్లో కూడా కొన్ని కీలక మార్పులు రానున్నాయి. మద్యం దుకాణాలకు దరఖాస్తు రుసుమును ప్రస్తుతం ఉన్న రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచాలని నిర్ణయించినట్లు సమాచారం. ప్రస్తుతం రెండేళ్ల గడువుతో లైసెన్సులు ఇస్తుండగా.. పెంచిన రుసుంకు అనుగుణంగా మూడేళ్ల గడువు ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలిసింది. సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంతోపాటు మంగళవారం కూడా ప్రభుత్వం దీనిపై చర్చించినట్లు తెలిసింది.

రాష్ట్ర వ్యాప్తంగా 2,620 వరకు వైన్ షాపు(ఏ4)లున్నాయి. ఒక్క హైదరాబాద్‌లోనే 690 మద్యం దుకాణాలున్నాయి. ప్రతి రెండేళ్లకు ఒకసారి మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించి.. పోటీ నేపథ్యంలో లాటరీ పద్ధతిన కేటాయిస్తారు. 2023-25 లైసెన్స్ కాలానికి ఆ ఏడాది డిసెంబరు ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. కానీ.. గత ప్రభుత్వం అప్పట్లో మద్యం దుకాణాల కోసం ఆగస్టు 4వ తేదీ నుంచి 18 వరకు దరఖాస్తులను స్వీకరించి.. ఆగస్టు 21న లాటరీ డ్రా నిర్వహించింది. కొత్త పాలసీలో మొత్తం 2,620 మద్యం దుకాణాలను వ్యాపారులకు కేటాయించింది. వీటిలో గౌడ్, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు కల్పించింది. ఆ దుకాణాల గడువు ఈ ఏడాది నవంబరు 30తో ముగియనుంది. అయితే.. సెప్టెంబరులోపు స్థానిక సంస్థలకు ఎన్నికలు ఉంటాయనే ప్రచారంతో ఈ సారి ఆ ఎన్నికల కంటే ముందే.. దుకాణాల కేటాయింపు ప్రక్రియను పూర్తిచేయాలని ఎక్సైజ్‌శాఖ యోచిస్తోంది. అంటే.. ఆగస్టులోనే దరఖాస్తుల స్వీకరణను పూర్తిచేసి.. లాటరీ పద్ధతిలో దుకాణాలు కేటాయించడానికి ఎక్సైజ్‌శాఖ ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఒకవేళ స్థానిక సంస్థల ఎన్నికల గడువు పెరిగితే.. లిక్కర్ దుకాణాల కేటాయింపులో మార్పులు ఉండొచ్చు.

దరఖాస్తులతోనే 3,500కోట్ల ఆదాయం?

దరఖాస్తుల విక్రయాల ద్వారానే భారీగా ఆదాయాన్ని రాబట్టుకోవాలని ఎక్సైజ్‌శాఖ భావిస్తోంది. 2023-25 లైసెన్స్ కాలానికి కేవలం దరఖాస్తుల విక్రయం ద్వారానే రూ.2,460 కోట్ల ఆదాయం సమకూరింది. ఈసారి డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని రూ.3,500 కోట్ల మేర ఆదాయం వస్తుందని ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సారి దరఖాస్తు రుసుమును రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచాలని నిర్ణయించిన నేపథ్యంలో.. ఒకేసారి అదనపు ఆదాయం వస్తుందని భావిస్తున్నారు. 2019లో చివరిసారిగా దరఖాస్తు రుసుమును పెంచారు. 2015లో రూ.50 వేలు.. 2017లో రూ.లక్షగా ఉన్న రుసుము.. 2019లో రూ.2 లక్షలకు పెరిగింది. 2023లో దీన్నే కొనసాగించగా.. ఆరేళ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ దరఖాస్తు ఫీజు పెరగనుంది. ఈ పెంపు వల్ల మద్యం వ్యాపారులు నష్టపోకుండా.. లైసెన్సు గడువును పెంచాలని నిర్ణయించింది. అంటే.. గతంలో రూ.2లక్షల ఫీజుతో రెండేళ్ల గడువు ఉండగా.. ఇప్పుడు రూ.3లక్షల ఫీజుకు మూడేళ్ల గడువు ఇవ్వాలని భావిస్తున్నట్లు సమాచారం.

దుకాణాల సంఖ్య పెరుగుతుందా?

సాధారణంగా జనాభా ప్రాతిపదికన మద్యం దుకాణాల సంఖ్యను నిర్ణయిస్తారు. 2011 జనాభా లెక్కల ప్రకారమే రాష్ట్ర వ్యాప్తంగా 2,620 దుకాణాలను కేటాయించారు. జనాభా పెరుగుదలతో దుకాణాల సంఖ్యను పెంచుకోవచ్చు. అయితే.. నిన్నమొన్నటి వరకు ఓఆర్ఆర్ పరిధిలో ఉన్న అన్ని గ్రామపంచాయతీలు జీహెచ్ఎంసీ లేదా.. సమీప మునిసిపాలిటీలు, మునిసిపల్ కార్పొరేషన్ల పరిధిలోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో దుకాణాల సంఖ్యను పెంచవచ్చా? అనే విషయాన్ని ఎక్సైజ్ అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఎక్కడ మద్యం దుకాణాన్ని కేటాయిస్తే.. అక్కడే నడుపుకోవాలనే నిబంధన ప్రస్తుతం ఉండగా.. తాజాగా ఆ నిబంధనను సడలించి, ఆ ప్రాంతంలో ఎక్కడికైనా మార్చుకునే వెసులుబాటు కల్పించే అంశాన్ని కూడా అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

ఏం చేసినా.. కవితను బీసీలు నమ్మరు

- కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం సాధ్యం
- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్



హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల అధికారంలో ఉండి, ఏనాడూ బీసీల గురించి మాట్లాడని కవిత.. ఇప్పుడు బీసీల పట్ల ఎంత ప్రేమ ఒలకబోసినా ఎవరూ నమ్మరని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. విద్య, ఉద్యోగాలు, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లులను ఆమోదించడమే కాకుండా, వచ్చే స్థానిక ఎన్నికల్లోనే బీసీ రిజర్వేషన్‌ను అమలు చేసేందుకు ఆర్డినెన్స్‌ను రూపొందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. ఎవరెన్ని చెప్పినా కాంగ్రెస్‌తోనే బీసీలకు న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం సాధ్యమనడానికి టీపీసీసీ అధ్యక్షుడిగా తాను, ఉప ముఖ్యమంత్రిగా భట్టి విక్రమార్క ఉండడమే ఉదాహరణ అని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు తగ్గిస్తే.. అప్పుడు మంత్రిగా ఉన్న గంగుల కమలాకర్ ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. కాగా, బీసీలకు రిజర్వేషన్ల పెంపుపై కవితకు చిత్తశుద్ధి ఉంటే.. 72 గంటల దీక్షను గల్లీలో కాదు.. ఢిల్లీలో చేపట్టాలని ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య హితవు పలికారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీకి వెళ్లి కేంద్రంపై పోరాటం చేస్తామని తాము ప్రకటించగానే.. కవిత డ్రామాలకు సిద్ధమైందని మండిపడ్డారు. పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు కవితకు బీసీలు కనిపించలేదా? అని నిలదీశారు. బీసీ రిజర్వేషన్లు పెంచే విషయంలో గత పాలకులు కనీస ప్రయత్నం కూడా చేయలేదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్‌గౌడ్ విమర్శించారు.

కాంగ్రెస్‌లో పదవుల పండగ!

- వారంలోపే నామినేటెడ్ పోస్టుల భర్తీకి చాన్స్
- గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీలు కూడా
- మీనాక్షి, మహేశ్‌గౌడ్‌కు నివేదికలు
- నియోజకవర్గానికి రెండు చొప్పున పేర్లు
- నేడు సీఎంతో మీనాక్షి, మహేశ్ భేటీ



హైదరాబాద్, జూలై 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో పదవుల పండగకు రంగం సిద్ధమైంది. వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, ఇతర నామినేటెడ్ పోస్టుల భర్తీ కోసం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు చొప్పున పేర్లతో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఈ ప్రతిపాదనలపైన బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ భేటీ అయి చర్చించనున్నారు. ఇందులోనే పదవుల భర్తీకి సంబంధించి మరింత స్పష్టత రానుంది. నామినేటెడ్ పోస్టుల భర్తీకి సంబంధించి ఎంత త్వరగా ప్రతిపాదనలు పంపిస్తే.. అంత త్వరగా ఆమోదించి పంపుతానంటూ ఇటీవల టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ భేటీల్లో సీఎం రేవంత్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. జాబితా రూపకల్పనలో ఇన్‌చార్జి మంత్రులు అలసత్వం వహిస్తున్నారంటూ ఓ సందర్భంలో అసహనం వ్యక్తం చేశారు. తాజాగా సీఎం వద్దకు జాబితా చేరనున్న నేపథ్యంలో ఆమోదం లాంఛనమేనని, వారంలోపే పోస్టుల భర్తీ ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అలాగే, గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీలను కూడా వారం లోపే ప్రకటించనున్నట్లు పేర్కొంటున్నాయి. పార్టీ కమిటీల కూర్పుతోపాటు నామినేటెడ్ పదవుల భర్తీకి పేర్లు ప్రతిపాదించేందుకు టీపీసీసీ నియమించిన పరిశీలకులతో మంగళవారం మీనాక్షీ నటరాజన్, మహేశ్‌కుమార్‌గౌడ్ భేటీ అయ్యారు. ఉదయం పదిన్నర నుంచి సాయంత్రం ఏడు గంటల దాకా ఉమ్మడి జిల్లాల వారీగా జరిగిన సమావేశాల్లో ప్రతిపాదించిన పేర్లు, ఇతర అంశాలకు సంబంధించి మీనాక్షి, మహేశ్‌గౌడ్ లేవనెత్తిన సందేహాలను పరిశీలకులు నివృత్తి చేశారు. నామినేటెడ్ పోస్టులకు సంబంధించి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఇద్దరి పేర్లను ప్రతిపాదించగా, పార్టీ కమిటీల కూర్పు, పదవుల్లో యువతకు ప్రాధాన్యం ఇచ్చామని, సామాజిక న్యాయానికీ పెద్ద పీట వేశామని వివరించారు. కాగా, నామినేటెడ్ పోస్టుల భర్తీపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి.. నిర్ణయం తీసుకుంటామని టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ తెలిపారు. పరిశీలకులు, నేతలతో సమావేశాల తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి, ప్రజలకు సుదీర్ఘంగా సేవలందించిన ముఖేశ్‌గౌడ్, శివశంకర్‌ల విగ్రహాలను హైదరాబాద్‌లో పెట్టాలని కార్యకర్తలు అడుగుతున్నారని, ఈ విషయమై సీఎంతో మాట్లాడతానని తెలిపారు.

కేంద్రం బీసీ బిల్లును క్లియర్ చేయాలి

- కొత్త రేషన్ కార్డులకు.. 10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ వర్తింపు
- తాండూరులో డిప్యూటీ సీఎం భట్టి



లబ్ధిదారులకు ఆహార భద్రత కార్డును అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి దుద్దిళ్ల, స్పీకర్ ప్రసాద్ కుమార్

తాండూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : దశాబ్ద కాలం తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు లబ్ధిదారులకు రూ.10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలో రూ.230 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. బలహీన వర్గాలకు విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు కల్పించాలని బీసీ బిల్లును శాసన సభలో పెట్టి గవర్నర్‌కు, కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్రపతికి పంపడం జరిగిందన్నారు. ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం ఆ బిల్లును వెంటనే క్లియర్ చేయాలన్నారు. ఇందుకోసం సీఎం రేవంత్ నాయకత్వంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్టీ ప్రజాప్రతినిధులు అందరం కలిసి ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తామన్నారు. కొత్తగా రాష్ట్ర వ్యాప్తంగా 95 లక్షల రేషన్ కార్డులు, 4.50 లక్షల ఇళ్లకు రూ.22,500 కోట్లు కేటాయించామన్నారు. ఈ ఏడాది మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలుగా రూ. 21 వేల కోట్లు కేటాయించామని ఆయన వివరించారు. బహిరంగ సభలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు అభివృద్ధిని చూడలేని కబోదులని విమర్శించారు. పథకాల అమలును చూసి కూడా విమర్శించడం దారుణమన్నారు. అంతకు ముందు డిప్యూటీ సీఎం జుంటుపల్లి సీతారామస్వామి దేవాలయాన్ని సందర్శించారు. తర్వాత రూ.200 కోట్ల వ్యయంతో దౌలాపూర్ వద్ద ఏర్పాటు చేసే 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, రూ.7.37 కోట్లతో తాండూరు పట్టణంలో చేపట్టే అభివృద్ధి పనులకు, 20కోట్ల వ్యయంతో చేపట్టే 6 విద్యుత్ సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన చేశారు. కాగా విద్యుత్ అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి ఫొటో, పేరు లేకపోవడంపై ఆయన అనుచర వర్గం మండిపడ్డారు. దీంతో పోలీసులు వారికి నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు. అనంతరం భట్టి యాలాల మండలం జుంటుపల్లి గ్రామంలో ఉన్న తన చిన్ననాటి స్నేహితుడు డాక్టర్ రవీందర్‌రావు ఇంటికి వెళ్లారు. ఆయన కుటుంబసభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం చిన్ననాటి చిత్రాన్ని ప్రత్యేకంగా గీయించి ఆయనకు స్నేహితులు అందజేశారు.

బనకచర్లపై సుప్రీంకోర్టుకు బీఆర్ఎస్!

- కేసీఆర్‌తో కేటీఆర్, హరీశ్ భేటీ
- ఫామ్‌హౌజ్‌లో ఉదయం నుంచి రాత్రి దాకా సుదీర్ఘ మంతనాలు

సంగారెడ్డి, హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గోదావరిపై ఏపీ సర్కారు నిర్మించతలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవడానికి సుప్రీంకోర్టును ఆశ్రయించాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించినట్లు తెలిసింది. మంగళవారం సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి ఫామ్‌హౌజ్‌లో మాజీ సీఎం కేసీఆర్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి భేటీ అయ్యారు. ఉదయం 9గంటల నుంచి రాత్రి 10 గంటల దాకా అనేక అంశాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. ఇప్పటికే బనకచర్లపై ప్రజలకు అనేక రకాలుగా అవగాహన కల్పించామని, ఇక ప్రాజెక్టును అడ్డుకోవాలంటే సుప్రీంకోర్టుకు వెళ్లడమే మార్గమని వారు ఈ భేటీలో ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. కాగా.. ఇక్కడ ఏపీ సీఎం చంద్రబాబు, అక్కడ ప్రధాని మోదీ ప్రయోజనాలను కాపాడేందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తహతహలాడుతున్నారని, ఈ విషయాన్ని తెలంగాణ సమాజం గమనిస్తోందని కేసీఆర్ ఈ భేటీలో వ్యాఖ్యానించినట్లు తెలిసింది. రాష్ట్ర రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి ఆంధ్రా ప్రయోజనాలను కాపాడే విధానాలను రాష్ట్ర ప్రభుత్వమే అమలుచేయం దుర్మార్గమని.. తెలంగాణ సాగునీటి రంగాన్ని ఆగం చేసే బనకచర్ల ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లో నిలువరించాల్సిందేనని ఆయన స్పష్టం చేసినట్టు సమాచారం. దీంతోపాటు రాష్ట్రానికి సంబంధించిన అనేక అంశాలపై కేటీఆర్, హరీశ్, జగదీశ్‌రెడ్డికి కేసీఆర్ పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్ర రైతాంగ సంక్షేమానికి, వ్యవసాయ సంక్షోభం నివారణకు పోరాటాలు చేయాలని సూచించారు. ఈ అంశాలపై ఇప్పటికే పార్టీ చేస్తున్న పోరాటాలను మరింత ఉధృతం చేయాలన్నారు. వానాకాలం నాట్లు అయిపోవస్తున్నా.. ఇంతవరకూ రైతాంగానికి సాగునీరు అందించలేని రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ప్రజాక్షేత్రంలో నిలదీయాలని నేతలకు సూచించారు. కన్నేపల్లి పంప్‌హౌజ్ దగ్గర గోదావరి జలాలను ఎత్తిపోయాలని, పంపులను ఆన్ చేసి, చెరువులు, నీటి కుంటలను నింపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఉందని, నాట్లు పడుతున్న సమయంలో ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయడం క్షమించరాని నేరమని కేసీఆర్ ధ్వజమెత్తారు. దీనిపై పరస్పర విమర్శలతో కాలయాపన చేస్తూ ప్రజాసమస్యలను గాలికొదిలేస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను గట్టిగా నిలదీయాలని సూచించారు. ప్రజా సమస్యలపై పోరాటం చేసేందుకు బీఆర్ఎస్ విద్యార్థి విభాగాన్ని బలోపేతం చేస్తున్నట్టుగానే.. మిగిలిన పార్టీ అనుబంధ వ్యవస్థలను కూడా బలోపేతం చేసి, క్షేత్రస్థాయి పోరాటంలో ప్రజలతో మమేకం చేయాలన్నారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అనుసరించాల్సిన వ్యూహాలు, బీసీ రిజర్వేషన్లపై పార్టీ వైఖరికి సంబంధించి కూడా కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. బీజేపీలో బీఆర్ఎస్‌ను విలీనం చేస్తామని కేటీఆర్ అన్నట్లుగా ఎంపీ సీఎం రమేశ్ చేసిన వ్యాఖ్యలు సైతం ఈ భేటీలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికకు బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపికతోపాటు ఇతర పార్టీలు ఎవరిని బరిలో దించే అవకాశాలు ఉన్నాయనే అంశంపైనా చర్చించారు.

ప్రజల్లోనే ఉండాలంటూ..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అమలవుతున్న సంక్షేమ పథకాల లోటుపాట్లపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, పార్టీ శ్రేణులంతా క్షేత్రస్థాయిలో శ్రమించాలని కేసీఆర్ ఈ భేటీలో సూచించినట్లు తెలిసింది. ముఖ్యంగా గ్రామాల్లో నిధులు లేక పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైందని, వ్యవసాయ రంగం కూడా ఆశాజనకంగా లేదని.. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రిజర్వాయర్లు డెడ్ స్టోరేజీలో ఉన్నాయనే విషయాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పినట్లుగా సమాచారం. కాగా తెలంగాణ ప్రజలకు ఏనాడైనా అండగా నిలబడేది బీఆర్ఎస్ పార్టీనేనని కేసీఆర్ స్పష్టం చేశారని ఆయన కార్యాలయం ఒక ప్రకటన ద్వారా తెలిపింది.

డిసెంబరు వరకూ తెలంగాణకే

నాగార్జున సాగర్ నిర్వహణ బాధ్యత

» అధికారుల వివరాల కోసం కృష్ణాబోర్డు లేఖ

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే డిసెంబరు 24వ తేదీ దాకా నాగార్జునసాగర్ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ ఎం) పనులతోపాటు వానాకాలంలో స్పిల్‌వే గేట్ల ఆపరేషన్ బాధ్యతలను తెలంగాణకు అప్పగించేందుకు కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) అంగీకరించింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వానికి బోర్డు మంగళవారం లేఖ రాసింది. హిల్‌కాలనీ ఇరిగేషన్ సర్కిల్‌లో పనిచేసే అధికారులతో పాటు రాత్రిపూట విధులు నిర్వర్తించే డీఈఈ/ఏఈఈలు, ఏఈల వివరాలు అందించాలని కోరింది. సాగర్ ప్రస్తుతం కృష్ణా బోర్డు పాక్షిక పర్యవేక్షణతోపాటు సీఆర్‌పీఎఫ్ రక్షణలో ఉంది. .

కాళేశ్వరం విచారణ గడువు 3 దాకా పొడిగింపు

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం బ్యారేజీలపై న్యాయ విచారణ గడువును ఆగస్టు 3వ తేదీ దాకా పొడిగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 31వ తేదీతో విచారణ గడువు పూర్తికానుండగా... ఆ రోజు లేదా మరుసటి రోజు ఆగస్టు 1వ తేదీన నివేదికను ప్రభుత్వానికి కమిషన్ సమర్పించే అవకాశాలున్నాయి. ఇప్పటికే సిద్ధమైన నివేదికకు తుది రూపు ఇచ్చే పనిలో కమిషన్ పడింది.

నేడే బండ్లగూడ స్వగృహ ఫ్లాట్ల లాటరీ

» ఆగస్టు 1,2న పోచారంలో లాటరీలు : ఎండీ గౌతమ్

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ పరిధిలో బండ్లగూడ, పోచారంలో ఉన్న టవర్లలోని ఫ్లాట్లకు లాటరీ నిర్వహిస్తామని రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు బండ్లగూడలోని 159 ఫ్లాట్లకు, ఆగస్టు 1, 2 తేదీల్లో పోచారంలోని ఫ్లాట్లకు లాటరీ నిర్వహిస్తామని మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. తొర్రూర్, బహదూర్‌పల్లి, కుర్మల్‌గూడా ప్రాంతాల్లోని ఓపెన్ ప్లాట్లకు ఆగస్టు 4, 5, 6 తేదీల్లో వేలం నిర్వహిస్తున్నామన్నారు. బండ్లగూడలోని స్వగృహ ఫ్లాట్‌కు ఇచ్చిన రశీదుతోనే ఈ ఓపెన్ ప్లాట్ల వేలంలోనూ పాల్గొనవచ్చునని ఆయన పేర్కొన్నారు. బండ్లగూడ లాటరీలో ఫ్లాట్ దక్కని వారికి పోచారంలో అవకాశం కల్పిస్తున్నామని, బండ్లగూడలో ఇచ్చిన డీడీలతో దరఖాస్తు చేసుకుంటే సరిపోతుందన్నారు. పోచారంలో ఫ్లాట్ల దరఖాస్తుకు రేపటి వరకు గడువు ఉందన్నారు. ఈ లాటరీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం కూడా చేస్తున్నట్టు తెలిపారు. మరోవైపు, ఇందిరమ్మ ఇళ్ల పథకంపై జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ల (పీడీ)తో జరిగిన సమీక్షలో ఆ పథకం అమలుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగించాలని గృహ నిర్మాణ సంస్థ ఎండీ గౌతమ్ చెప్పారు.

గోదావరి బోర్డు చైర్మన్‌గా బీపీ పాండే

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : గోదావరి నది యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) చైర్మన్‌గా బీపీ పాండేను నియమిస్తూ కేంద్ర జలశక్తి శాఖ నిర్ణయం తీసుకుంది. ఈమేరకు మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుతం బోర్డు చైర్మన్‌గా పనిచేస్తున్న ఏకే ప్రధాన్ 31వ తేదీన పదవీ విరమణ చేయనున్నారు. దాంతో ఆయన స్థానంలో బీపీ పాండేకు బాధ్యతలు కట్టబెట్టారు. ఆగస్టు 1వ తేదీ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. గతంలో బోర్డులో సభ్యుడిగా పనిచేసిన అనుభవం పాండేకు ఉంది. అయితే ఆయన్ను కృష్ణానది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) చైర్మన్‌గా నియమించాలని యోచించగా... నిరాకరించినట్లు సమాచారం.

44 మంది డిప్యూటీ కలెక్టర్లకు పదోన్నతి

» ఏసీబీ కేసులున్నా, రాజీనామా చేసినా ప్రమోషన్లు ఇచ్చారంటూ అభ్యంతరాలు

రాష్ట్రంలో 44 మంది డిప్యూటీ కలెక్టర్లకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేష్ కుమార్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. వీరంతా 2005లో ఏపీపీఎస్సీ ద్వారా డిప్యూటీ తహసీల్దార్లుగా నియామకమైన ఉద్యోగులు. 2008లో తహసీల్దార్లుగా పదోన్నతి పొందారు. 2014లో కొంతమంది, 2017లో మరికొందరు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి పొందారు. మొత్తం 189 మందిలో ఇప్పుడు 44 మందికి స్పెషల్ గ్రేడ్ హోదాతో పదోన్నతి ఇచ్చారు. అయితే దీనిపై పదోన్నతి లభించని పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘించారని, అర్హులను పక్కనపెట్టి అనర్హులకు పదోన్నతులు ఇచ్చారని ఆరోపిస్తున్నారు. ఇందులో ఉద్యోగానికి రాజీనామా చేసి, నాలుగేళ్లకు పైగా విధులకు దూరంగా ఉన్న వ్యక్తి కూడా ఉన్నారని పేర్కొంటున్నారు. డిప్యూటీ కలెక్టర్లుగా మూడేళ్ల సర్వీసు పూర్తి చేయనివారికి, ఆరోపణలు ఉన్నవారికీ పదోన్నతులు ఇచ్చారని ఆరోపిస్తున్నారు.

రూ.3,500 కోట్ల అప్పు తీసుకున్న రాష్ట్రం

రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.3,500 కోట్ల రుణం తీసుకుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మంగళవారం నిర్వహించిన ఈ-వేలం ద్వారా ఈ అప్పును సేకరించింది. 2053లో అసలు సొమ్మును చెల్లించే గడువుతో 7.16 శాతం వార్షిక వడ్డీతో రూ.1000 కోట్లు, 2056లో అసలును చెల్లించేలా 7.16 శాతం వార్షిక వడ్డీతో రూ.1000 కోట్లు, 2057లో అసలును చెల్లించేలా 7.16 శాతం వార్షిక వడ్డీతో రూ.1000 కోట్లు, 2063లో అసలును చెల్లించేలా 7.13 శాతం వార్షిక వడ్డీతో రూ.500 కోట్ల రుణాన్ని తీసుకుంది.

డిజైన్ ఖరారవ్వగానే..

రేషన్ కార్డుల పంపిణీ

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చే మంజూరు పత్రాల ఆధారంగా వారికి సెప్టెంబరు నుంచి రేషన్ విడుదల అవుతుందని అధికారులు తెలిపారు. కార్డులు జారీ అయ్యేవరకు.. మంజూరు పత్రాలను సంక్షేమ పథకాలకు పరిగణనలోకి తీసుకుంటామని వివరించారు. గతంలో రేషన్‌కార్డుదారులు సంక్షేమ పథకాల కోసం టీఎస్-పీడీఎస్ పోర్టల్‌లో తమ కార్డు వివరాలను ప్రింట్ చేయించి, దాన్ని లామినేట్ చేసి వినియోగించేవారు. ఇప్పుడు మంజూరు పత్రం ఆధారంగా ఆరోగ్యశ్రీతోపాటు.. మహాలక్ష్మి పథకంలో భాగంగా అమలు చేస్తున్న గృహజ్యోతి(200 యూనిట్ల ఉచిత విద్యుత్తు), రూ. 500కే గ్యాస్ సిలిండర్, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాలు తదితర పథకాల ద్వారా లబ్ధి పొందవచ్చని చెబుతున్నారు.

ఢిల్లీలో ‘బీసీ’ ధర్నా వాయిదా!

11న నిర్వహించాలని నిర్ణయం?

» పార్లమెంటులో దేశ భద్రతపై చర్చ నడుస్తుండడమే కారణం!

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ ప్రభుత్వం ఢిల్లీలో ఆగస్టు 6న నిర్వహించతలపెట్టిన మహా ధర్నా 11కు వాయిదా పడింది. విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలన్న డిమాండ్‌తో ఈ ధర్నా నిర్వహించాలని రేవంత్ సర్కారు నిర్ణయించింది. అయితే, ప్రస్తుతం పార్లమెంటులో దేశ భద్రతకు సంబంధించిన చర్చలు జరుగుతుండడం, ఇతర కారణాల రీత్యా ధర్నాను వాయిదా వేసినట్లు తెలిసింది. బీసీ రిజర్వేషన్ల అంశంలో కేంద్రంపై ఒత్తిడి పెంచే కార్యాచరణలో భాగంగా ఆగస్టు 6న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మహా ధర్నా నిర్వహించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఆ ధర్నాలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధులు, బీసీ ప్రతినిధులూ పెద్ద ఎత్తున పాల్గొనాలన్న నిర్ణయం కూడా జరిగింది. మహా ధర్నాలో పాల్గొనేందుకు 5నే మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక రైల్లో హైదరాబాద్ నుంచి బయలుదేరి వెళ్లాలనుకున్నారు. 6న ధర్నా, 7న రాష్ట్రపతిని, కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలవాలని నిర్ణయించారు. కానీ, పార్లమెంటులో ఆపరేషన్ సిందూర్‌తో పాటు ఇతర అంశాలపై వాడీవేడి చర్చలు నడుస్తున్న తరుణంలో బీసీ బిల్లులపై ఒత్తిడి కార్యాచరణకు జాతీయ స్థాయిలో పెద్దగా ప్రాధాన్యం లభించకపోవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్లమెంటులో చర్చలు ముగిసిన తర్వాత ఈ అంశాన్ని చేపడితే బాగుంటుందని భావిస్తున్నారు. మరోవైపు క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తల్లో కదలికే లక్ష్యంగా ఈ నెల 31 నుంచి ఆగస్టు 6 వరకు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌లు పాదయాత్ర, శ్రమదానం కార్యక్రమాలను ప్రకటించారు. అలాగే సీఎం రేవంత్, మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొనే ధర్నా కార్యక్రమానికి ఢిల్లీలో రక్షణ కల్పించాల్సి ఉంటుంది. ధర్నాకు అనుమతులు, రాష్ట్రపతి, ప్రధాని, ప్రతిపక్ష నేతల అపాయింట్‌మెంట్లూ ఖరారు చేసుకుని పకడ్బందీగా కార్యక్రమాన్ని నిర్వహించేందుకే 11కు వాయిదా వేసినట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. 11న ధర్నా అనంతరం సీఎం, మంత్రులు మూడు, నాలుగు రోజులు ఢిల్లీలోనే ఉండి బీసీ బిల్లులపై ఒత్తిడి కార్యాచరణను అమలు చేయనున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా పార్లమెంటులో కాంగ్రెస్ ఎంపీలతో బీసీ బిల్లులపై వాయిదా తీర్మానాలు ఇప్పించనున్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ సహకారంతో ఇతర విపక్ష నేతలనూ కూడగట్టేందుకు రేవంత్ ప్రయత్నించనున్నట్లు చెబుతున్నారు. ఒకట్రెండు రోజుల్లో మంత్రులు, ముఖ్య నేతలతో రేవంత్ సమావేశమై, ఒత్తిడి కార్యాచరణను ఖరారు చేయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.



కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ అధికారులతో సమీక్షిస్తున్న సీఎం రేవంత్

ఆ నగరాల పరిస్థితి

హైదరాబాద్‌కు రావద్దు

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. హైదరాబాద్ నగరాన్ని కాలుష్యరహితంగా మార్చాలని, విపరీతమైన కాలుష్యంతో ఢిల్లీ, ముంబై, చెన్నై వంటి నగరాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆ పరిస్థితి హైదరాబాద్‌లో తలెత్తకూడదని నిర్దేశించారు. రానున్న 25 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఢిల్లీ, ముంబై, చెన్నై నగరాల్లో తలెత్తిన సమస్యలపై అధ్యయనం చేయాలని చెప్పారు. కోర్ సిటీలో ఉన్న కాలుష్యకారక పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలించాలని ఆదేశించారు. ఓఆర్ఆర్ పరిధిలో వారసత్వ కట్టడాల సంరక్షణ, పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి వీలుగా కులీకుతుబ్ షాహీ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మార్గదర్శకాలను సవరించి మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు.

మూసీ పరీవాహకంలో ఓ ల్యాండ్ మార్క్‌ను నిర్మించండి

మూసీ రివర్ ఫ్రంట్‌కు సంబంధించి హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు పనులు వేగవంతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఓఆర్ఆర్ నుంచి మూసీ వైపు వచ్చే క్రమంలో కొత్వాల్‌గూడ జంక్షన్లో మూసీ రివర్ ఫ్రంట్‌కు ప్రతీకగా ఇండియా గేట్, గేట్ వే ఆఫ్ ఇండియా, చార్మినార్ వంటి ఓ ల్యాండ్ మార్క్‌ను నిర్మించాలని, మూసీపై బ్రిడ్జి కం బ్యారేజీలకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. నెహ్రూ జూపార్క్, మీరాలం ట్యాంక్ అభివృద్ధి పనుల పురోగతిపైనా సీఎం సమీక్షించారు. మీరాలం ట్యాంకు ఎదురుగా ఏర్పాటు చేసిన ఎస్టీపీలు వాటి సామర్థ్యానికి అనుగుణంగా పని చేసేలా చూడాలని నిర్దేశించారు. జూ పార్క్, మీరాలం ట్యాంకు సమీపంలో పర్యాటకులు బస చేసేందుకు వీలుగా అధునాతన వసతులతో హోటల్ నిర్మించాలని, నగరాన్ని వీక్షించేలా అది ఉండాలని అభిప్రాయపడ్డారు.

మెట్రో పనులు వేగవంతం చేయాలి

పాతబస్తీలో మెట్రో పనుల పరిస్థితిని సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. మెట్రో రెండో దశ విస్తరణ పనుల్లో ఆలస్యం ఎందుకు జరుగుతోందని అధికారులను ప్రశ్నించారు. వాటికి నిధులు మంజూరు చేసినా జాప్యం జరగడమేంటని అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. పనుల్లో జరుగుతున్న జాప్యంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. స్థలాలు ఇవ్వడానికి పలువురు ముందుకొచ్చిన ప్రాంతాల్లోనూ పనులు ముందుకు వెళ్లకపోవడంపై అసహనం వ్యక్తం చేశారని సమాచారం. అవసరమైన నిధులు ఇప్పటికే విడుదల చేసినందున పనులను వేగవంతం చేయాలని, జాప్యం జరగనివ్వవద్దని అధికారులను ఆదేశించారు. మెట్రో అనుమతుల విషయంలో జాప్యాన్ని సహించబోమని హెచ్చరించారు. కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ పనులు వేగంగా పూర్తి చేసేలా చూడాలని సూచించారు. ప్యారడైజ్ కూడలి నుంచి శామీర్‌పేట ఓఆర్ఆర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, కార్యదర్శులు ఇలంబర్తి, శ్రీదేవి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, వాటర్ బోర్డు ఎండీ అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌కు సుప్రీంలో ఊరట

(మొదటిపేజీ తరువాయి)

జారీచేసింది. గోపన్‌పల్లి గ్రామం సర్వే నంబర్ 127లోని సొసైటీకి సంబంధించిన భూమిని ఆక్రమించడంతోపాటు.. నిర్మాణాలను జేసీబీతో కూల్చేశారంటూ గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో 2016లో కేసు నమోదైంది. ఈ కేసులో ఏ1గా కొండల్ రెడ్డి, ఏ2గా ఇ.లక్ష్మయ్య, ఏ3గా రేవంత్‌రెడ్డిని చేర్చారు. రంగారెడ్డి జిల్లా ఎస్సీ, ఎస్టీ కేసుల ప్రత్యేక కోర్టులో ఈ కేసు విచారణలో ఉండగా.. 2021లో రేవంత్‌రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో సుదీర్ఘ వాదనలు విన్న ధర్మాసనం.. రేవంత్ రెడ్డి ఘటనా స్థలంలో లేరనే విషయాన్ని ఫిర్యాదుదారు సైతం అంగీకరించారని పేర్కొంది. తాను లేను కాబట్టి తనపై కేసు కొట్టేయాలని అడుగుతున్నారని, మిగతా వారిపై కేసు కొట్టేయాలని అడగటం లేదని వ్యాఖ్యానించింది. రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకే నిందితులు దూషించారని ఆరోపిస్తున్నా.. అందుకు ఆధారాలు లేవని తెలుపుతూ రేవంత్ రెడ్డిపై దాఖలైన కేసును కొట్టివేసింది. అయితే.. ఈ కేసు విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరుతూ ఈ నెల 12వ తేదీన పిటిషనర్ పెద్దిరాజు సుప్రీంకోర్టులో ట్రాన్స్‌ఫర్ పిటిషన్(క్రిమినల్) దాఖలు చేశారు. ఈ పిటిషన్ మంగళవారం సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, పిటిషనర్ తరఫున న్యాయవాది రితేశ్ పాటిల్ హాజరయ్యారు. అయితే, కేసు విచారణ సందర్భంగా పిటిషనర్ తీరుపై సీజేఐ తీవ్రంగా స్పందించారు. హైకోర్టు సిటింగ్ జడ్జిపై అసభ్యకరమైన ఆరోపణలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిటిషనర్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు పంపిస్తున్నామని తెలిపారు. దీంతో ఈ పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అవకాశం ఇవ్వాలని పిటిషనర్ తరఫు న్యాయవాది ధర్మాసనాన్ని అభ్యర్థించారు. ఇందుకు చీఫ్ జస్టిస్ అంగీకరించలేదు. ఇదే తీరులో దాఖలైన పిటిషన్‌పై గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు మీకు తెలియవా? అని పిటిషనర్ తరఫు న్యాయవాదిని ప్రశ్నించారు. మరోవైపు హైకోర్టులో ఈ కేసు విచారణ జరిగిన తీరు, అనంతరం తీర్పులోని ముఖ్య అంశాలను సిద్ధార్థ్ లూథ్రా ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మరోసారి సీజేఐ పిటిషనర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఒక సిటింగ్ జడ్జిపై అభ్యంతరకరమైన ఆరోపణలు చేశారు. కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారు. ఇలాంటి పిటిషన్ వేసే ముందు, కనీసం సంతకం చేసేప్పుడైనా చూసుకోరా?" అని న్యాయవాదిని ప్రశ్నించారు. పిటిషనర్ పెద్దిరాజుతోపాటు ఆయన తరఫు న్యాయవాదులు రితేశ్ పాటిల్, ఏవోఆర్‌కు నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపారు. తదుపరి విచారణకు పెద్దిరాజు హాజరు కావాలని ఆదేశించారు. దీనిపై కోర్టు సాక్షిగా పిటిషనర్ తరఫు న్యాయవాది నితిన్ మిశ్రా క్షమాపణలు కోరారు. అయితే.. ఈ క్షమాపణలను పరిగణలోకి తీసుకోబోమని ధర్మాసనం స్పష్టంచేసింది. క్షమాపణలపై రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలని తేల్చిచెప్పింది "ఏదైనా పొరపాటు లేదా మిస్‌యూజ్ జరిగితే న్యాయవాదులను రక్షించే ప్రయత్నం చేస్తాం. అంతేకానీ.. జడ్జిలను ఒక పెట్టెలో బంధించేలా అసత్య, అభ్యంతరకర ఆరోపణలు చేస్తే అనుమతించేది లేదు. ఇది ముమ్మాటికీ నిర్లక్ష్యమే. గత సుప్రీంకోర్టు తీర్పులను అనుసరించి పిటిషనర్ పెద్దిరాజు, ఏవోఆర్ రితేశ్ పాటిల్, న్యాయవాది నితిన్ మిశ్రాలకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేస్తున్నాం. ముగ్గురూ దీనిపై వారంలో రాతపూర్వక సమాధానం ఇవ్వాలి. ఆగస్టు 11న కోర్టు ముందుకు హాజరు కావాలి" అని ఆదేశాల్లో స్పష్టం చేశారు. అలాగే, పెద్దిరాజు వేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్లు వెల్లడించారు.

రాష్ట్ర అతిథి గృహానికి నిధుల గ్రహణం!

నిర్మాణానికి తొలుత రూ. 19.48 కోట్లు మంజూరు

» అధునాతనంగా కట్టేందుకు మరో రూ.34 కోట్లు అవసరమని అంచనా

» ప్రత్యేక కమిటీ ఏర్పాటు.. నివేదిక ఇంకెప్పుడు? నిలిచిన పనులు



ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో నిర్మాణం జరుగుతున్న సీఎం క్యాంప్ కార్యాలయం

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రతినిధుల బస కోసం రూపుదిద్దుకుంటున్న ప్రత్యేక అతిథి గృహ నిర్మాణానికి నిధుల కొరత నెలకొంది! నిర్మాణ వ్యయం అంచనాలు పెరగడం.. నిర్మాణ ధరలు, అవసరపడే నిధులపై నియామకమైన కమిటీ నెలన్నర గడుస్తున్నా నివేదిక ఇవ్వకపోవడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ)లో ఈ అతిథి గృహాన్ని నిర్మించాలని సర్కారు సంకల్పించింది. ఇందుకు ఆర్‌అండ్‌బీ శాఖ ప్రతిపాదించిన డిజైన్లను సర్కారు ఆమోదించింది. అతిథి గృహ నిర్మాణానికి తొలుత రూ.19.48 కోట్లు అవసరపడతాయని అంచనా వేసి, ఆ మేరకు నిధులు మంజూరు చేస్తూ పరిపాలనాపరమైన అనుమతులు కూడా ఇచ్చారు. నిర్మాణం ప్రారంభమయ్యాక ఈ అతిథి గృహాన్ని మరింత అధునాతనంగా నిర్మించాలనే ఆలోచనకు సర్కారు వచ్చింది. ఇందుకోసం డిజైన్‌లో కొన్ని మార్పులు చేశారు. ఆ మేరకు తొలుత మంజూరు చేసిన రూ.19.48కోట్లకు అదనంగా మరో రూ.34కోట్ల మేర నిధులు అవసరమవుతాయని అధికారులు ప్రతిపాదనలు రూపొందించి సర్కారు నివేదించారు. అయితే అంత పెద్ద మొత్తంలో నిధులు ఎందుకు అవసరమవుతున్నాయనే విషయమ్మీద నెలన్నరక్రితం ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ.. నిర్మాణం జరుగుతున్న తీరు, నిర్మాణ ధరలు, అవసరమయ్యే నిధులపై నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. ఈ కమిటీ ఇప్పటిదాకా నిర్మాణ పనులను ఒక్కసారే పరిశీలించింది. సర్కారుకు ఎలాంటి నివేదికా ఇవ్వలేదు. కమిటీ రూపకల్పనకు 15 రోజుల ముందే పనులు ఆగిపోవడంతో.. రెండు నెలలుగా నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి.

ఎకరంన్నరలో గార్డెన్.. జీ ప్లస్ వన్ విధానంలో గెస్ట్‌హౌస్

రాష్ట్ర అతిథి గృహాన్ని జీ ప్లస్ వన్ విధానంలో అత్యంత అధునాతనంగా నిర్మిస్తున్నారు. ప్రతిపాదిత నమూనా ప్రకారం గ్రౌండ్ ఫ్లోర్‌లో కార్యాలయాన్ని, మొదటి అంతస్తులో మూడు బెడ్ రూమ్‌లను నిర్మిస్తున్నారు. దానిపై ఓపెన్ హాల్‌ను నిర్మిస్తారు. ఈ భవనం, ముందు వైపు, పక్కన దాదాపు ఎకరంన్నర మేర ఉన్న ఖాళీ స్థలాన్ని ఉద్యానవనంగా తీర్చిదిద్దాలని ప్రతిపాదించారు. అయితే ఈ స్థలం దాదాపు వంద మీటర్ల లోతులో ఉంది. దాన్నంతా పూడ్చుకుంటూ ఒక లెవల్‌కు తీసుకురావడానికే పెద్ద మొత్తంలో నిధులు అవసరపడతాయని భావిస్తున్నారు.



మంచిరేవుల-గోల్కొండ మార్గంలో

చిరుత సంచారం

సీసీ కెమెరాలో మరోసారి రికార్డు

నార్సింగ్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మంచిరేవుల నుంచి గోల్కొండ ఆర్మీ ప్రాంతం మధ్య తిరుగుతున్న ఓ చిరుతపులి మరోసారి సీసీ కెమెరాకు చిక్కింది. గోల్కొండ తారామరతి మిలటరీ ప్రాంతం నుంచి పక్కనే ఉన్న అటవీ భూమిలోకి ప్రవేశిస్తుండగా, మంచిరేవుల అటవీ పార్కులోకి వెళ్లే మార్గంలో అమర్చిన సీసీ కెమెరాలో ఇది రికార్డయింది. చిలుకూరి జింకల పార్కు, గ్రేహౌండ్స్ క్యాంపస్, పోలీస్ అకాడమీ, గోల్కొండ మిలటరీ కేంద్రం, మంచిరేవుల అటవీ ప్రాంతం అన్నీ కలిపి సుమారు 20 వేలు ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాంతం అటవీ వాతావరణాన్ని పోలి ఉండడంతో చిరుత స్వేచ్ఛగా సంచరిస్తోందని అటవీశాఖ అధికారులు తెలిపారు. చిరుతను పటుకునేందుకు పలు ప్రాంతాల్లో ఏడు బోన్లు, 20 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

ముద్ర కో ఆపరేటివ్ పేరిట 140 కోట్ల వసూళ్లు

(మొదటిపేజీ తరువాయి)



రామదాసప్ప నాయుడు

డైరెక్టర్ జనరల్ చారుసిన్హా కథనం ప్రకారం... రామదాసప్ప నాయుడు ముద్ర అగ్రికల్చరల్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ మల్టీలెవల్ కో ఆపరేటివ్ సొసైటీ పేరిట రాష్ట్ర వ్యాప్తంగా 330 కార్యాలయాలు తెరిచాడు. అందులో 1600 మంది సిబ్బందిని నియమించుకున్నాడు. ఉద్యోగంలో చేర్చుకునేముందు ప్రతి ఒక్కరి విద్యార్హత సర్టిఫికెట్లు, రూ.లక్ష చొప్పున డిపాజిట్ సేకరించాడు. తన సొసైటీ రెండేళ్లలో బ్యాంకుగా మారుతుందని ఉద్యోగులను నమ్మించి వారి ద్వారా ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించాడు. అందులో కొంత మొత్తాన్ని ముద్ర రుణాల పేరిట అవసరమైన వారికి ఇచ్చేవాడు. ఒక్కో ఉద్యోగికి నెలకు రూ.8వేల నుంచి రూ.12వేలు దాకా వేతనం ఇచ్చిన రామదాసప్ప.. ఉద్యోగులకు లక్ష్యాలు పెట్టి అవి సాధించకపోతే జీతంలో కోత పెట్టేవాడు. దీంతో కొందరు ఉద్యోగాలు మానేసి తమ సర్టిఫికెట్లు, డిపాజిట్ సొమ్ము ఇవ్వమని కోరితే వారిని వేధించేవాడు. తనకు చెందిన పత్రికల్లో ఆయా ఉద్యోగులకు మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయని వార్తలు రాయించేవాడు. ఈ క్రమంలో ఎవరైనా పోలీసులను ఆశ్రయిస్తే వారితో రాజీ కుదుర్చుకునేవాడు. కాగా, ముద్ర పథకం అంటూ ప్రజల నుంచి రూ.140 కోట్ల మేర సేకరించిన రామదాసప్ప.. ఆ సొమ్ములో అధిక భాగాన్ని ఏపీ రాజధాని అమరావతిలో స్థలాలపై పెట్టుబడిగా పెట్టాడు. రామదాసప్ప అక్రమాలపై 2020లో నల్లకుంట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదవ్వగా.. అరెస్టయి బెయిల్‌పై విడుదలయ్యాడు. ఆ తర్వాత కూడా తన వ్యాపారాన్ని కొనసాగించాడు. దీంతో కాచిగూడ, గంభీరావుపేట, రామాయంపేట, దుబ్బాక, కాచిగూడ, వేములవాడ, అచ్చంపేట, ఆత్మకూరు పోలీసు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. కొంతకాలంగా పరారీలో ఉన్న రామదాసప్ప నాయుడు, సాయి కిరణ్ ఎట్టకేలకు అరెస్టు చేసిన సీఐడీ అధికారులు వారిని కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించింది.

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు

దొడ్డా పద్మ కన్నుమూత

» మాజీ ఎమ్మెల్యే దొడ్డా నర్సయ్య సతీమణి

» నిజాం వ్యతిరేక, రైతాంగ పోరాటంలో పాత్ర

» సూర్యాపేట జిల్లా చిలుకూరులో నేడు అంత్యక్రియలు



హైదరాబాద్ సిటీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నిజాం వ్యతిరేక, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కొరియర్‌గా సేవలందించిన దొడ్డా పద్మ(99) కన్నుమూశారు. ఈ నెల 25న సూర్యాపేట జిల్లా చిలుకూరులోని స్వగృహంలో ఆమె కాలుజారి కిందపడడంతో తుంటి ఎముకకు ఫ్రాక్చర్ అయింది. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా, మంగళవారం శస్త్రచికిత్స అనంతరం రక్తపోటులో హెచ్చుతగ్గుల వల్ల పద్మ హఠాన్మరణం చెందారని కుమార్తె కల్పన కొడారు తెలిపారు. పద్మ భర్త దివంగత దొడ్డా నర్సయ్య భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) నాయకుడిగా, హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా పనిచేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలంలో నల్లమల ప్రాంతంలో మూడేళ్ల భర్తతో పాటు పద్మ అజ్ఞాతవాసం గడిపారు. ఆ సమయంలో కమ్యూనిస్టు పార్టీ సాహిత్యాన్ని బట్వాడా చేయడంలాంటి పనుల్లో ఆమె చురుగ్గా వ్యవహరించారు. పద్మ సొంతూరు ఏపీలోని ఉమ్మడి కృష్ణా జిల్లా బుద్ధవరం గ్రామం. వివాహానంతరం భర్త స్వగ్రామం ఉమ్మడి నల్లగొండ జిల్లా చిలుకూరులో స్థిరపడ్డారు. రహస్య జీవితం అనంతరం అఖిలభారత మహిళా సమాఖ్యలోనూ సుదీర్ఘకాలం పనిచేశారు. ఆంధ్రజ్యోతి పత్రిక చదవకుండా తన రోజు సాగదని, అందులోనూ 'కొత్త పలుకు' అంటే చాలా ఇష్టమని దొడ్డా పద్మ గతంలో ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. పద్మ మృతికి స్వాతంత్ర్య సమర యోధుడు కందిమళ్ల ప్రతాపరెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్, సీపీఐ నాయకులు, కార్యకర్తలు సంతాపం తెలిపారు. పద్మ అంత్యక్రియలు బుధవారం మధ్యాహ్నం చిలుకూరులో నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

వరంగల్‌కు స్పోర్ట్స్ స్కూల్..!

తాత్కాలికంగా జేఎన్ఎం స్టేడియంలో ఏర్పాటు

వరంగల్ ఎమ్మెల్యేల ప్రతిపాదనలకు సీఎం ఆమోదం

వరంగల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ స్టేడియం (జేఎన్ఎం)లో తాత్కాలికంగా స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. క్రీడా, యువజనుల సర్వీసులశాఖ అధికారులు జేఎన్ఎంలో ఉన్న వసతులను రెండు రోజులపాటు పరిశీలించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, యశస్వినిరెడ్డి ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వరంగల్‌లో స్పోర్ట్స్ స్కూల్‌తో పాటు అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియాన్ని మంజూరు చేయాలని కోరారు. క్రీడాశాఖ అధికారులకు సీఎం ఫోన్ చేసి వరంగల్‌లో స్పోర్ట్స్ స్కూల్, స్టేడియం కోసం డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశించారు. తర్వాత స్పోర్ట్స్ అండ్ యూత్ సర్వీసెస్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్‌ను ఎమ్మెల్యేల బృందం కలవగా.. వెంటనే డిప్యూటీ డైరెక్టర్ స్థాయి అధికారిని వరంగల్‌కు పంపించారు. తాత్కాలికంగా స్పోర్ట్స్ స్కూల్‌కు జేఎన్ఎం స్టేడియం అనుకూలంగా ఉందని అధికారులు అంచనా వేశారు. జయేశ్ రంజన్ మౌఖిక ఆదేశాలతో తాత్కాలికంగా స్పోర్ట్స్ స్కూల్ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఆగస్టు 15న సీఎం రేవంత్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు స్టేడియం కోసం ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల వద్ద జాతీయ రహదారి 163కు సమీపంలో 20ఎకరాలు, కూడకు సమీపంలో 30 ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఒకటి రెండు రోజుల్లో అధికారికంగా స్పోర్ట్స్ స్కూల్, స్టేడియానికి సంబంధించి ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉందని సమాచారం.



కుమరం భీం జిల్లా పెంచికలపేట అటవీ ప్రాంతంలోని డ్రోసెరా మొక్కలు

పెంచికలపేట అడవుల్లో కీటకాహార మొక్కలు

» డ్రోసెరా బర్మనీ రకం జాతిగా గుర్తింపు

పెంచికలపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం జిల్లా పెంచికలపేట అడవుల్లో అటవీ శాఖ అధికారులు అరుదైన కీటక ఆహార మొక్కలను కనుగొన్నారు. డ్రోసెరా బర్మనీ రకం వృక్ష జాతిగా దీనిని గుర్తించారు. ఈ మొక్కల ఆకులపై ఉండే వెంట్రుకల లాంటి నిర్మాణాలు జిగురును స్రవిస్తాయి. ఇవి కీటకాలను ఆకర్షిస్తాయి. చిన్న చిన్న పురుగులు వాలగానే వాటిని బంధిస్తాయి. మొక్క ఆ కీటకాలను జీర్ణం చేసుకుంటుంది. దీనిపై ఎఫ్ఆర్వో అనిల్ కుమార్‌ను వివరణ కోరగా.. అరుదైన కీటక ఆహార మొక్కలు పెంచికలపేట రేంజ్ పరిధిలో కనిపించడం ప్రత్యేకమని చెప్పారు.



కల్లూరు పీఏసీఎస్ ప్రాంగణంలో యూరియా కోసం క్యూ కట్టిన రైతులు

యూరియా కోసం 5 గంటలకే క్యూ

కల్లూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఉదయం 5 గంటలకే పంపిణీ కేంద్రాల వద్ద క్యూ కడుతున్నారు. ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని కల్లూరు, చెన్నూరు ప్రాథమిక సహకార సంఘాల వద్దకు మంగళవారం తెల్లవారుజామునే రైతులు భారీగా చేరుకున్నారు. దీంతో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. కూపన్లు పంపిణీ చేసే సమయంలో రైతుల మధ్య తోపులాట జరగటంతో సీఐ, ఎస్ఐ అదనపు సిబ్బందితో అక్కడికి వచ్చారు. పోలీసు బందోబస్తు నడుమ కూపన్లు పంచారు. కల్లూరు, చెన్నూరు పీఏసీఎస్‌లకు సగటున 20 టన్నుల వరకు యూరియా బస్తాలు రాగా గంటల వ్యవధిలోనే అయిపోయాయి. కల్లూరు మండలంలో అవసరమైన మేరకు యూరియా అందుబాటులో ఉందని ఏవో రూప తెలిపారు.

సెకండ్ హ్యాండ్ ఫోన్ కొంటున్నారా? జర జాగ్రత్త!

» తెలంగాణ పోలీసుల హెచ్చరిక

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కొంచెం తక్కువ ధరకు వస్తుందని చాలామంది సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లు కొంటుంటారు. అయితే, సెకండ్ హ్యాండ్ ఫోన్లను కొనేటప్పుడు ప్రజలు పాటించాల్సిన కొన్ని జాగ్రత్తలను సూచిస్తూ తెలంగాణ పోలీసులు ఎక్స్ వేదికగా హెచ్చరిక జారీ చేశారు. తెలియని వారు ఎవరైనా తక్కువ ధరకే ఫోన్ అమ్ముతానంటే అనుమానించాల్సిందేనని, చోరీకి గురైన ఫోన్ మీకు అమ్మవచ్చని హెచ్చరించారు. ఓ చిన్న జాగ్రత్తతో సెకండ్ హ్యాండ్ ఫోన్లను కొనుగోలు చేయవచ్చని, ఆ ఫోన్ ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ (ఐఎంఈఐ) నంబర్ తీసుకుని దానిని సంచార్ సాథీ.జీఓవి.ఇన్‌లోకి వెళ్లి స్టేటస్ చెక్ చేసుకోవాలని సూచించారు. సంచార్ సాథీ యాప్ లేదా వెబ్‌సైట్‌లోకి వెళ్లిన తర్వాత సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) ద్వారా మీరు కొనబోతున్న ఫోన్ ఐఎంఈఐ నంబర్ టైప్ చేసి వారు సూచించిన నంబర్‌కు ఎస్ఎంఎస్ పంపిస్తే క్షణాల్లో ఆ ఫోన్ బ్లాక్ లిస్టులో ఉందా? లేదా? అనే విషయం తెలిసిపోతుందని పోలీసులు వివరించారు.

లగచర్ల రైతులకు ఊరట

» కోర్టుకు హాజరు నుంచి మినహాయింపు

కొడంగల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలో వికారాబాద్ జిల్లా కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో పాటు మరో 70 మందికి కోర్టులో ఊరట లభించింది. వారు విచారణ నిమిత్తం కోర్టుకు హాజరుకాకుండా ప్రత్యేక న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చింది. కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం లగచర్లలో భూసేకరణ సమయంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఇతర అధికారులపై దాడి జరిగిన ఘటనలో మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డితో పాటు మరో 70 మంది రైతులపై కేసులు నమోదయ్యాయి. వారిని పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించగా అప్పట్లో షరతులతో కూడిన బెయిల్ మంజూరయింది. మంగళవారం నాంపల్లిలోని ప్రజా ఆస్తుల విధ్వంస నిరోధక చట్ట ప్రత్యేక న్యాయస్థానం (పీడీపీపీ స్పెషల్ కోర్టు)లో జరిగిన విచారణకు మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డితో పాటు మిగతా వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డితో పాటు మిగతా నిందితులు హాజరయ్యారు. వారి తరఫున న్యాయవాది జక్కుల లక్ష్మణ్ వాదిస్తూ పొలాలకు వెళ్లాల్సిన రైతులు కోర్టుకు వస్తున్నారని తెలిపారు. రోజువారీ పనులు చేసుకునేందుకు వీలుగా వారికి కోర్టు హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. దీంతో ఏకీభవించిన న్యాయస్థానం అనుకూలంగా ఆదేశాలు ఇచ్చింది.

డ్రంకెన్ డ్రైవ్ కేసు పెడతారా అంటూ.. పెట్రోల్‌తో నిప్పంటించుకున్న వ్యక్తి

» 40% కాలిన శరీరం.. ఉస్మానియా ఆస్పత్రికి తరలింపు

నల్లగొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో కేసులో పట్టుబడిన ఓ వ్యక్తి, పోలీస్‌స్టేషన్ ఎదుట పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. నల్లగొండలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. పట్టణానికి చెందిన రావిళ్ల నర్సింహా దేవరకొండ రోడ్డులో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో దొరికాడు. దీంతో పోలీసులు ద్విచక్రవాహనాన్ని పక్కన పెట్టించి అతడిని అక్కడి నుంచి పంపించారు. రాత్రి 11.30 గంటల ప్రాంతంలో శరీరంపై పెట్రోలు పోసుకుని పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న నర్సింహా.. 'నాపైనే కేసు పెడతారా' అంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగాడు. తన వెంట తెచ్చుకున్న లైటర్‌తో నిప్పంటించుకున్నాడు. దీంతో మంటలు చెలరేగాయి. విధుల్లో ఉన్న కానిస్టేబుల్ అంజత్ వెంటనే దుప్పటి కప్పి మంటలు ఆర్పాడు. అతడిని కాపాడే ప్రయత్నంలో ఓ హోంగార్డు కూడా గాయపడ్డాడు. 40 శాతం శరీరం కాలడంతో మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేరుతో మోసం

» లక్షల్లో వసూలు చేసి ఉడాయించిన మేస్త్రీ

చిన్నశంకరంపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేరుతో లబ్ధిదారులను మోసం చేసి డబ్బులు దండుకున్న ఓ మేస్త్రీ పరారైన ఘటన మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి తండాలో వెలుగులోకి వచ్చింది. మిర్జాపల్లి తండాలో మొత్తం 22 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయి. మొదటి విడతగా బేస్‌మెంట్ నిర్మాణం పూర్తైన తర్వాత ఒక్కో లబ్ధిదారుడి ఖాతాలో రూ.లక్ష చొప్పున జమ అయ్యాయి. ఈ క్రమంలోనే ఇళ్లు కట్టిస్తానని నమ్మబలికిన ఝార్ఖండ్‌కు చెందిన అబ్దుల్ యూనస్ అనే మేస్త్రీ లబ్ధిదారులతో ఒప్పందం చేసుకున్నాడు. కొంత మొత్తాన్ని ముందుగానే తీసుకున్న యూనస్.. పనులు ప్రారంభించిన తర్వాత మరింత డబ్బు వసూలు చేశాడు. ఒక్కో లబ్ధిదారుడు లక్షకుపైనే అతడికి చెల్లించారు. ఈనెల 26 నుంచి మేస్త్రీ కనిపించకుండా పోవడంతో, లబ్ధిదారులు అతడికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆందోళన చెందిన బాధితులు, మండల కేంద్రంలో అతడు అద్దెకు ఉంటున్న ఇంటికి వెళ్లగా..ఖాళీ చేసి వెళ్లిపోయినట్లు ఇంటి యజమాని తెలిపారు. దీంతో మోసపోయామని గ్రహించిన లబ్ధిదారులు పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు.



కదిలే విమానంలో విందు భోజనం

దుండిగల్/కుత్బుల్లాపూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మీరెప్పుడైనా విమానంలో విందు భోజనం చేశారా? మన దగ్గర విమానం ఎక్కినవారే తక్కువ, విందు భోజనం కూడానా అనిపిస్తోందా..! హైదరాబాద్ శివార్లలోని దుండిగల్‌లో డీపోచంపల్లికి వెళితే నిజమైన విమానంలో, నిజంగానే విందు ఆరగించవచ్చు. కాకపోతే గాలిలో ఎగురుతూ కాదు. భూమ్మీదే కాస్త కదులుతూ! అది 'టెర్మినల్-1 రెస్టారెంట్'. పశ్చిమగోదావరి జిల్లా తణుకు ప్రాంతానికి చెందిన వెంకట్రాంరెడ్డి దీనిని నిర్వహిస్తున్నారు. దుబాయ్‌లో సుమారు 18 ఏళ్లపాటు హోటల్ వ్యాపారం చేసిన ఆయన.. కరోనా సమయంలో తిరిగి వచ్చేసి ఈ రెస్టారెంట్‌ను ప్రారంభించారు. పాత విమానాన్ని కొనుగోలు చేసి, హైడ్రాలిక్ పరికరాల సహాయంతో కదులుతూ, విమానంలో ప్రయాణిస్తున్న అనుభూతి కలిగించేలా ఏర్పాట్లు చేశారు. ఇక్కడికి వచ్చేవారికి ఎయిర్‌హోస్టెస్‌ల తరహాలోనే స్వాగతం పలికి భోజనం వడ్డిస్తారు.



దిగువకు కృష్ణమ్మ పరవళ్లు

(మొదటిపేజీ తరువాయి)

విడుదల చేశారు. కృష్ణమ్మకు వాయినం సమర్పించారు. గేట్లు ఎత్తిన తర్వాత ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల్లో పూడిక తొలగించడంతో పాటు ఆధునికీకరిస్తామని చెప్పారు. సాగర్ ప్రాజెక్టు గేట్లు జూలై నెలలో ఎత్తడం 18 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి అన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 22 లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తోందని తెలిపారు. తాను ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా ఉంటూ ప్రస్తుతం మంత్రిగా ఉండి సాగర్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయడం సంతోషంగా ఉందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గత వానాకాలం, యాసంగి పంటలకు సాగు నీరు అందించామని.. ఫలితంగా 2.81 లక్షల టన్నుల ధాన్యాన్ని పండించి తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని గుర్తుచేశారు. సాగర్ ప్రధాన జలవిద్యుత్కేంద్రం ద్వారా గడిచిన నాలుగు రోజుల్లో రోజుకు 30వేల క్యూసెక్కుల నీటిని వాడుకుంటూ 700 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేశామని తెలిపారు. కాగా, ప్రాజెక్టు పరిధిలోని ఎడమ కాలువకు నీటి విడుదలను పెంచారు. ప్రస్తుతం 4 వేల క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా మంగళవారం మరో 2,500 క్యూసెక్కులను మంత్రి ఉత్తమ్ చేతుల మీదుగా పెంచి, విడుదల చేశారు. మంగళవారం ఉదయం మంత్రులు 6 గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు. ఆ తర్వాత ఎగువ నుంచి వరద పెరగడంతో సాయంత్రం 4 గంటలకల్లా 26 గేట్లనూ ఎత్తారు. సాగర్ పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా.. మంగళవారం సాయంత్రానికి 587.60అడుగులుగా నమోదైంది. 26 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి (2,30,804 క్యూసెక్కులు); కాలువలు, విద్యుదుత్పత్తి ద్వారా మొత్తం 2,75,194 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండగా.. ఎగువ నుంచి 2,55,811 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

మంత్రి కోమటిరెడ్డి గైర్హాజరు

సాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తే కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గైర్హాజరయ్యారు. షెడ్యూల్ ప్రకారం మంత్రి వెంకటరెడ్డి కూడా బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి హెలికాప్టర్‌లో సాగర్‌కు రావాల్సి ఉంది. అయితే మంత్రి వెంకటరెడ్డి గైర్హాజరవడంతో ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో పలు రకాల కథనాలు ప్రసారమయ్యాయి. బేగంపేట ఎయిర్‌పోర్ట్ వద్ద గంటసేపు వేచి ఉండాల్సి రావడంతో చిరాకుతో మంత్రి వెంకటరెడ్డి సాగర్‌కు రాకుండా వెనక్కి వెళ్లిపోయారని కథనాలు ప్రసారమయ్యాయి.

గేమ్‌ఛేంజర్‌గా సన్నబియ్యం, రేషన్‌కార్డులు

రాష్ట్ర రాజకీయాల్లో సన్నబియ్యం, రేషన్ కార్డుల పంపిణీ పథకాలు



యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలో రేషన్‌కార్డుల పంపిణీ సభలో మంత్రులు ఉత్తమ్, లక్ష్మణ్‌కుమార్

గేమ్‌ఛేంజర్‌గా మారాయని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని హుజూర్‌నగర్, భూదాన్‌పోచంపల్లి, ఆలేరు, కట్టంగూరుల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి ఉత్తమ్ నూతన రేషన్‌కార్డుల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రెండు పథకాలతో తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సన్నబియ్యం పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. గతంలో దొడ్డు బియ్యం అందిస్తే వాటిని రీసైక్లింగ్ చేసి కాకినాడ పోర్టుకు తరలించారని, కోళ్ల ఫారాలకు అమ్ముకున్నారని తెలిపారు. తెలంగాణలో అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డులు అందిస్తున్నామన్నారు. పేదల కడుపు నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదన్నారు. తమ ప్రభుత్వం 3.15 కోట్ల మందికి ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తోందని తెలిపారు. రాష్ట్రాన్ని శాసించే శక్తి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఉందని, ఈ జిల్లా కాంగ్రెస్ ఖిల్లా అని.. కాంగ్రెస్ పార్టీ శ్రేణుల త్యాగంతోనే ప్రభుత్వం ఏర్పడిందని ఉత్తమ్ అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, కాల్వల అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పేదలపై దృష్టి పెట్టలేదని, ప్రజాపాలనలో ప్రతి పేదవాడు కడుపు నిండా అన్నం తినాలన్న లక్ష్యంతో నూతనంగా రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

శ్రీశైలానికి పెరిగిన ఉధృతి!

» ప్రాజెక్టులోకి 2.89 లక్షల క్యూసెక్కులు

» దిగువకు 3.18 లక్షల క్యూసెక్కులు

కర్ణాటకలో కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరిగింది. మంగళవారం ప్రాజెక్టు సైట్ వద్ద 2.89 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా ఎనిమిది క్రస్ట్ గేట్లను పది ఫీట్ల మేర ఎత్తి 2.16 లక్షల క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి, పోతిరెడ్డిపాడు, హంద్రినీవా, ఎంజీకేఎల్ఐతో కలుపుకొని మొత్తం 3.18 లక్షల క్యూసెక్కులను ప్రాజెక్టు నుంచి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా ప్రస్తుతం 203.89 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన ఆలమట్టి రిజర్వాయర్‌కు 1.51 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 1.40లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. నారాయణపూర్ నుంచి 1.45లక్షల క్యూసెక్కులను జూరాలకు.. జూరాల నుంచి 1.48 లక్షల క్యూసెక్కులను శ్రీశైలానికి వదులుతున్నారు. తుంగభద్ర వద్ద 1.20 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా 1.24 లక్షల క్యూసెక్కులను శ్రీశైలానికి వదులుతున్నారు. ఇక నాగార్జునసాగర్ నుంచి నీటిని విడుదల చేయడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలంలోని టెయిల్‌పాండ్‌కు 2,38,468 క్యూసెక్కుల నీరు చేరుతోంది. ప్రాజెక్టు 20గేట్లలో 11గేట్లను ఎత్తి 2,36,727 క్యూసెక్కుల నీటిని పులిచింతల వైపు వదులుతున్నారు. టెయిల్‌పాండ్ నిల్వ సామర్థ్యం సుమారు 7.080 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.764 టీఎంసీల నీరు ఉంది. అటు.. పులిచింతల ప్రాజెక్టులోకి భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. ముందు జాగ్రత్తగా ప్రాజెక్టు అధికారులు మొత్తం 23 గేట్లలో మూడు రేడియల్ గేట్లు రెండు మీటర్ల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 175 అడుగులు (45.77 టీఎంసీలు) కాగా, మంగళవారం రాత్రి 165.123 అడుగులుగా (31.7965 టీఎంసీలు) నమోదైంది. ఎగువనుంచి ఇన్‌ఫ్లో 2,41,285 క్యూసెక్కుల నీరు వస్తుండగా, రేడియల్ గేట్ల ద్వారా 47,698 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కృష్ణా బేసిన్ పరిధిలో జలవిద్యుదుత్పత్తి జోరందుకుంది జూరాలలో 3.96 మిలియన్ యూనిట్లు, శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జలవిద్యుదుత్పత్తి కేంద్రంలో 17.14 మిలియన్ యూనిట్లు, నాగార్జునసాగర్ ప్రధాన జలవిద్యుత్తు కేంద్రంలో 17.19 మిలియన్ యూనిట్లు, సాగర్ ఎడమ కాల్వ కింద 0.73మిలియన్ యూనిట్లు, పులిచింతలలో 0.65మిలియన్ యూనిట్లు కలిపి 42.88 మిలియన్ యూనిట్ల జలవిద్యుదుత్పత్తి జరుగుతోంది. ఇక గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులకు వరద క్రమంగా పెరుగుతోంది. శ్రీరాంసాగర్‌కు ఈ సీజన్‌లో అత్యధికంగా 75 వేల క్యూసెక్కుల వరద వచ్చిచేరింది. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 80.50 టీఎంసీలు కాగా.. ప్రాజెక్టులో 32.90 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

- ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్

ఇండియన్ స్పెర్మ్‌టెక్ సెంటర్ సీజ్

» ఎనిమిది మంది అరెస్టు



సికింద్రాబాద్‌లోని ఇండియన్ స్పెర్మ్‌టెక్ సెంటర్

అడ్డగుట్ట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో పురుషుల నుంచి వీర్యాన్ని, మహిళల నుంచి అండాలను సేకరించి అహ్మదాబాద్‌కు తరలిస్తూ అక్రమ దందా కొనసాగిస్తున్న ఇండియన్ స్పెర్మ్‌టెక్ క్లినిక్‌ను వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. పంకజ్ సోని అనే వ్యక్తి ఇండియన్ స్పెర్మ్‌టెక్ కేంద్రాన్ని సికింద్రాబాద్‌లో నిర్వహిస్తున్నారు. ఏజెంట్ల సాయంతో డబ్బు ఎరగా వేసి పురుషుల నుంచి వీర్యం, మహిళల నుంచి అండాలను సేకరిస్తున్నారు. వీటిని అహ్మదాబాద్ లోని ఫెర్టిలిటీ సెంటర్‌కు తరలిస్తున్నారు. కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న ఈ వ్యవహారంపై ఇటీవల సమాచారం అందుకున్న గోపాలపురం పోలీసులు.. పంకజ్ సోని సహా ఏడుగురిని అరెస్టు చేశారు. ఈ క్రమంలో పోలీసుల సమక్షంలో మంగళవారం క్లినిక్‌లో సోదాలు నిర్వహించిన వైద్య అధికారులు క్లినిక్‌ను సీజ్ చేశారు. కాగా, అహ్మదాబాద్‌లో ఉన్న ఇండియన్ స్పెర్మ్‌టెక్ బ్యాంక్ లైసెన్సుతోనే సికింద్రాబాద్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. సికింద్రాబాద్‌కు రెండు నెలల క్రితం వైద్య ఆరోగ్యశాఖకు లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది.

పిల్లల్లేని దంపతులకు సోషల్ మీడియాతో ఎర

» ఉచిత పరీక్షల పేరిట మాయ

» సృష్టి ఫర్టిలిటీ సెంటర్ మోసం

హైదరాబాద్ సిటీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సృష్టి ఫర్టిలిటీ సెంటర్ కేసులో రోజుకో కొత్త కోణం వెలుగులోకి వస్తోంది. కొన్నేళ్ల క్రితం సృష్టి ఫర్టిలిటీ సెంటర్ పేరుతో ఓ కేంద్రాన్ని ప్రారంభించిన డాక్టర్ నమ్రత.. పిల్లలు లేని దంపతులే లక్ష్యంగా సోషల్ మీడియా ద్వారా తన కేంద్రానికి విస్తృత ప్రచారం చేసుకున్నారు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ట్విటర్, ఫేస్‌బుక్ ద్వారా రకరకాల వీడియోలు, పోస్టులు చేసేవారు. టెస్ట్ ట్యూబ్ బేబీ, సరగసీ విధానాల ద్వారా తల్లిదండ్రులు కావాలనే కోరికను తన ఆస్పత్రిలో నెరవేర్చుకోవచ్చని ప్రచారం చేసేవారు. అంతేకాక, తమ క్లినిక్‌లో ఉచిత పరీక్షలు అంటూ ఆకట్టుకునేవారు. డిజిటల్ ప్రచారంతో సృష్టి ఫర్టిలిటీ సెంటర్ పేరు మార్మోగేలా చేసి పిల్లలు లేని దంపతులు క్యూకట్టేలా చేసుకున్నారు. అనంతరం దంపతుల బలహీనతను ఆసరాగా చేసుకొని అక్రమ మార్గంలో చిన్నారులను కొనుగోలు చేసి వారికి అప్పగించినట్టు తెలుస్తోంది. ఈ తరహా కేసులను ఇప్పటికే మూడింటిని గుర్తించిన పోలీసులు ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి పోసి.. మూసీని కబ్జా చేసి..

వాహనాల పార్కింగ్‌కు ఇచ్చి ఫీజు వసూళ్లు.. షెడ్లు నిర్మించి ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసులకు అద్దెకు

» చాదర్‌ఘాట్ బ్రిడ్జి నుంచి ఉస్మానియా వరకు 10.22ఎకరాలు చెరబట్టిన వైనం

» ఆక్రమణలను కూల్చి.. ఫెన్సింగ్ వేసిన హైడ్రా

హైదరాబాద్ సిటీ/అఫ్జల్‌గంజ్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మూసీని మూసేసి దర్జాగా దందా చేస్తున్న అక్రమార్కులకు హైడ్రా చెక్ పెట్టింది. నదిని వ్యర్థాలతో నింపి నిర్మించిన ఆక్రమణలను తొలగించింది. చాదర్‌ఘాట్ బ్రిడ్జి నుంచి ఉస్మానియా ఆస్పత్రి మార్చురీ వరకు పలువురు 10.22 ఎకరాల భూమిని చెరబట్టారు. నదిలో 20 నుంచి 25 మీటర్ల మేర మట్టి, వ్యర్థాలతో నింపి రోడ్డుకు సమాంతరంగా చేశారు. ఉస్మానియా మార్చురీ పక్కన 3.10 ఎకరాల స్థలాన్ని తికారం సింగ్ అనే వ్యక్తి కబ్జా చేశాడు. షెడ్లు నిర్మించి అక్రమంగా వ్యాపారం నిర్వహిస్తున్నాడు. 1.30 ఎకరాలను చెరబట్టిన పూనం చంద్ యాదవ్.. ప్రైవేట్ బస్సులు, టాక్సీల పార్కింగ్ స్థలంగా కేటాయించడంతోపాటు.. షెడ్లు నిర్మించి నర్సరీ, ఇతరత్రా వ్యాపారాలు నిర్వహిస్తున్నాడు. జయకృష్ణ అనే వ్యక్తి 5.22 ఎకరాలు కబ్జా చేసి.. తాత్కాలిక నిర్మాణాలు చేపట్టి ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలకు అద్దెకిచ్చాడు. నదిని ఆక్రమించి వీళ్లంతా కొన్నేళ్లుగా వ్యాపారం చేస్తున్నారు. ఈ ఆక్రమణలపై ఫిర్యాదులు రావడంతో హైడ్రా రంగంలోకి దిగింది. నిర్మాణాలను కూల్చి వేసి, ముందుందు కబ్జాలకు గురికాకుండా స్థలానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. నది ఒడ్డున ఉన్న నివాసాల జోలికి వెళ్లలేదు.



చాదర్‌ఘాట్ బ్రిడ్జి వద్ద మూసీలో ఏర్పాటు చేసిన పార్కింగ్

గతంలో కేసులు నమోదైనా..

ఈ ముగ్గురు వ్యక్తుల ఆక్రమణల తొలగింపుపై రెవెన్యూ విభాగం కనీస చర్యలు తీసుకోలేదు. ఫిర్యాదులు అందితే నోటీసులు ఇవ్వడం మినహా ఏమీ చేయలేదు. హైకోర్టు ఆదేశాల మేరకు గతంలో హైదరాబాద్ కలెక్టర్ బాధ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా ఆక్రమణదారులు యథేచ్ఛగా వ్యాపారం నిర్వహిస్తున్నారు. వాహనాల పార్కింగ్, పండ్లు నిల్వ చేసే ఫ్రీజర్ల ఏర్పాటుకు మెజారిటీ స్థలాన్ని వినియోగిస్తున్నారు. ఒక్కో వాహనానికి రోజుకు రూ.300 చొప్పున పార్కింగ్ రుసుము వసూలు చేస్తున్నారని హైడ్రా వర్గాలు పేర్కొన్నాయి. కాగా, సాయంత్రం 4 గంటల సమయంలో పూనం చంద్ యాదవ్ అక్కడికి చేరుకుని ఈ స్థలం తనదేనని, 40 ఏళ్ల క్రితం నాటి పట్టాలున్నాయని, ప్రభుత్వానికి టాక్స్‌లు చెల్లిస్తున్నానని చెప్పారు. నోటీసులు ఇవ్వకుండా హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టారని, దీనిపై హైకోర్టును ఆశ్రయించానని తెలిపారు.

సుందరీకరణతో సంబంధం లేదు

మూసీ సుందరీకరణ ప్రాజెక్టుతో కూల్చివేతలకు సంబంధం లేదు. నది ప్రవాహానికి అడ్డుగా ఉన్న ఆక్రమణలను తొలగించాం. పౌరుల నివాసాల జోలికి వెళ్లలేదు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో చెరువులు, నాలాలు, పార్కులు, రహదారుల కబ్జాల తరహాలోనే మూసీ ఆక్రమణలు తొలగించాం.

- ఏవీ రంగనాథ్, హైడ్రా కమిషనర్

ప్రజాస్వామ్యం గుర్తుకొచ్చేది ప్రతిపక్షంలోనే

» రాజకీయ నేతలకు ఎన్‌హెచ్ఆర్సీ చైర్మన్ జస్టిస్ రామ సుబ్రహ్మణ్యన్ చురకలు

» మానవ హక్కుల పరిరక్షణలో మీడియాది ఎనలేని పాత్ర అని వ్యాఖ్య

హైదరాబాద్ సిటీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నప్పుడు ఆధిపత్యం ప్రదర్శించి, ప్రతిపక్షంలోకి రాగానే ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం పరిపాటిగా, సార్వత్రిక సంప్రదాయంగా మారిందని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ) చైర్మన్ జస్టిస్ రామ సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యానించారు. మీడియాలో వస్తున్న మానవ హక్కుల హననం ఘటనలు, ఉదంతాలను సుమోటోగా స్వీకరించి, బాధితులకు న్యాయమందించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. తమ విధి నిర్వహణలో మీడియా సహకారం ఎనలేనిదని కొనియాడారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం వేదికగా 2 రోజుల్లో 109కేసుల విచారణలో 29 కేసులకు శాశ్వత పరిష్కారం లభించిందని మంగళవారం మీడియా సమావేశంలో జస్టిస్ రామ సుబ్రహ్మణ్యన్ చెప్పారు. చట్టాన్ని వ్యతిరేకించిన బాలుడ్ని.. జువైనల్ జస్టిస్ చట్ట నిబంధనలకు విరుద్ధంగా 40రోజులు సాధారణ జైలులో ఉంచిన పోలీసులను మందలించి, బాధితుడికి లక్ష పరిహారం ఇప్పించినట్లు తెలిపారు. బిహార్‌లో ఒక బాలిక కిడ్నాప్ కేసును తమ జోక్యంతో పోలీసులు 3రోజుల్లో పరిష్కరించారని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎన్‌హెచ్ఆర్సీ చైర్మన్ రామ సుబ్రహ్మణ్యన్

సూచీలే ప్రామాణికం కాదు

మానవ హక్కుల సూచీలో ర్యాంకులే ప్రామాణికం కాదని, భారత్ కంటే మెరుగైన పరిస్థితులున్నాయన్న దేశంలో మీడియా స్వేచ్ఛే లేదని రామసుబ్రహ్మణ్యన్ చెప్పారు. రాష్ట్రంలో గిరిజన మహిళ అక్రమ రవాణా కేసులో దోషిగా తేలిన ఓ పోలీస్ కానిస్టేబుల్‌ను ఉద్యోగం నుంచి తొలగించినట్లు సుబ్రహ్మణ్యన్ వెల్లడించారు. డీఆర్‌డీవో రాకెట్ ప్రొపల్లెంట్ యూనిట్‌లో పేలుడు ఘటనలో మరణించిన 4 కుటుంబాలకు నష్ట పరిహారం అందేలా ఎన్‌హెచ్చార్సీ చేసింది. తెలంగాణ గురు కులాల్లో 48 మంది విద్యార్థుల మృతి 886 మంది విద్యార్థుల అనారోగ్య కారణాలపై 4 వారాల్లో నివేదిక సమర్పించాలని సంబంధిత కార్యదర్శులను ఆదేశించారు. రాష్ట్రంలో మానవ హక్కుల పరిరక్షణ, వివిధ అంశాలపై మంగళవారం సీఎస్ కె.రామకృష్ణారావు, డీజీపీ జితేందర్ తదితరులతో ఎన్‌హెచ్ఆర్సీ సమీక్షించింది.

సఖీ ఉద్యోగులకు 6 నెలలుగా వేతనాల్లేవ్

బాధిత మహిళల 'సఖీ' కేంద్రాల ఉద్యోగులకు 6 నెలలుగా వేతనాల్లేవని వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో కొండవీటి సత్యవతి చెప్పారు. 37 హత్య, అత్యాచారానికి గురైన ఆదివాసీ, గిరిజన, దళిత మహిళల కేసుల్లో 15 ఏళ్లు దాటినా బాధితులకు నష్ట పరిహారం అందలేదని దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని ఆరోపిస్తూ ఎన్‌హెచ్చార్సీకి బీఆర్ఎస్ ఫిర్యాదు చేసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.